నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 24-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 266 | పేజీలు: 8 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

నైరుతి రాక
భువి ఆనంద కేక
పచ్చలహారం

రైసుమిల్లులు
సంచులకు చిల్లులు
గోదకుగోడు.

చీడల పీడ
విశ్వ నరుల గోస
టీకాల దారి

లంచం సామాన్యం
ఓటేను అసామాన్యం
హింసపాలన

ఇచ్చిన మాట
కాగితం పడవలు
జుడాలసమ్మె

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

ఒక ఊరును కేసీఆర్
తీసుకొనే పెంపుడు !
మచ్చుకైన ఉండదండి
ఇకమీదట చంపుడు !

బురదలోంచి పద్మమోలె
ఊరు రూపం రంగారు !
' వాసాలమర్రి ' మారును
ఒక్కసారే బంగారు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

క్రీడాకారులను ప్రశంసించిన ప్రధాని మోడీ..

న్యూఢిల్లీ, జూన్ 23:ఇప్పటివరకు ఇండియా తరపున ఒలంపిక్స్ క్రీడల్లో పాల్గొన్నప్లేయర్స్ ను ప్రధాన మంత్రి మోడీ ప్రశంసించారు. ఒలింపిక్ క్రీడల దినోత్సవం సందర్భంగా ట్విట్టర్ వేదికగా క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు."టోక్యో ఒలింపిక్ క్రీడలలో పాలుపంచుకోనున్న భారతీయ క్రీడాకారుల కు, భారతీయ క్రీడాకారిణుల కు అంతా మంచే జరగాలి అని" మోడీ అభిలషించారు.

"గత కొన్నేళ్లుగా జరిగిన వివిధ ఒలింపిక్ క్రీడల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన వారందరిని చూసుకొని దేశ ప్రజలు గర్వపడుతున్నారు "అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

"ఈ రోజు ఒలింపిక్ క్రీడలదినోత్సవం. ఒలింపిక్ క్రీడల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన వారందరిని నేను అభినందిస్తున్నాను" అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.

కొన్నివారాల్లో ఏనీఎనీ2020 మొదలవనుంది.

మన దేశాని కి చెందిన క్రీడాకారులు ఆ క్రీడోత్సవాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. ఆ క్రీడలు ప్రారంభం కావడానికి ముందుగా మైగవ్ లో క్విజ్ ను నిర్వహించడం జరుగుతుంది. ఆ క్విజ్ పాల్గొనవల్సిందిగా మీ అందరికి, ప్రత్యేకించి నా యువ మిత్రులకు, నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని మోడీ పేర్కొన్నారు.

అభినందనలు, అవార్డులేనా? నిధులు కూడా ఇవ్వండి : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , జూన్ 23:పంచాయితీ నిధుల ఆడిట్ లో తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలిచిందని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ వెల్లడించిన విషయం విదితమే. ఈ సందర్భంగా కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, ఆయన దార్శనికత వల్లే దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తున్నదని అన్నారు. అభినందనలు, అవార్డులేనా?నిధులు కూడా ఇవ్వండి అంటూ ఆయన కేంద్ర మంత్రి కి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాల పంచాయతీ రాజ్ శాఖ ఆర్థిక, ఆడిట్ విభాగాల అధికారులతో కేంద్ర మంత్రి తోమర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను అభినందించారు. నిధుల దుర్వినియోగం జరగకుండా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఆడిటింగ్‌ను ప్రశంసించారు. మరోవైపు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సునీల్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అయితే, తెలంగాణ రాష్ట్రం అవలంభిస్తున్న ఆన్‌లైన్ ఆడిట్ విధానం దేశానికి ఆదర్శం అని అభినందించినందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ? సీఎం కేసీఆర్ ముందుచూపు వల్లే రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ రూపొందించిన పల్లె ప్రగతి, హరిత హారం, రైతు బంధు, ధాన్యం కొనుగోలు వంటి అనేకానేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవు అన్నారు. ఈజీఎస్ లాంటి కేంద్ర పథకాల అమలులోనూ దేశంలో తెలంగాణ నెంబర్‌వన్‌గా ఉందన్నారు. ఆయా పథకాలు రాష్ట్రాన్ని అన్ని విభాగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నాయని చెప్పారు.

ఇప్పటికే కేంద్రం, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు అనేక అవార్డులు ఇచ్చిందని, ప్రశంసలు కురిపిస్తూనే ఉందన్నారు. కేవలం అవార్డులు, రివార్డులు మాత్రమే కాకుండా, ప్రోత్సాహకంగా రాష్ట్రానికి మరిన్ని నిధులు కేటాయించాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఎర్రబెల్లి కేంద్రాన్ని కోరారు. ఈ అవార్డులు,రివార్డులు ప్రశంసలు రావడానికి కృషి చేస్తున్న సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు, ఆన్‌లైన్ ఆడిటింగ్ అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇతర అధికారులకు, సిబ్బందికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందనలు తెలిపారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశానికే ఆదర్శం

జగిత్యాల, జూన్ 23: : కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం జిల్లాలోని గొల్లపల్లి మండలం వైశ్య భవన్‌లో కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సదర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు.

అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని మంత్రి తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మహిళా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని మంత్రి సూచించారు.

కొత్త మలుపు తిరిగిన రంగురాళ్ల చోరీ కేసు

హైదరాబాద్ , జూన్ 23: జ్యోతిష్కుడు మురళీకృష్ణ శర్మ ఇంట్లో చోరీ కేసు కొత్త మలుపు తిరిగింది. తన ఇంట్లో రంగు రాళ్లు చోరీ అయ్యాయని వారం రోజుల క్రితం మురళీకృష్ణ శర్మ ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మురళీకృష్ణ శర్మ తప్పుడు ఫిర్యాదు ఇచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసుల దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.బెల్లంకొండ మురళీకృష్ణ శర్మ ఇంట్లో భారీగా నగదు గుర్తించారు. రూ. 17.72 కోట్ల విలువ చేసే నకిలీ రూ. 2 వేల నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ కరెన్సీతో పాటు రూ. 6 లక్షల 32 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, కారు సీజ్ చేశారు. డబ్బు విషయం దాచి రంగురాళ్లు పోయాయని ఆయన ఫిర్యాదు చేశాడు. మురళీకృష్ణతో పాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రూ. 90 కోట్ల హవాలా మనీ కేసులో గతంలో మురళీకృష్ణ జైలుకు వెళ్లొచ్చాడు.

చరిత్రలో నేటినిజం

కం!! నటుడై "మురళీమోహను"
పటుతరమగు పాత్రలందు ప్రుత్యేకముగా
పటిమను జూపుచు... నిలచెను
జటిలమ్ముగు రాజకీయ చదురంగములోన !!

–రాధశ్రీ

(జూన్ 24 నటుడు, నేత మురళీమోహన్ పుట్టిన రోజు...)
సెల్: 9494481210

పీసీవీ నిర్మాణానికి జీఎస్ఎల్‌తో ఎంఓడీ ఒప్పందం

న్యూఢిల్లీ, జూన్ 23:ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) కోసం రెండు కాలుష్య నియంత్రణ వెస్సెల్స్ (పీసీవీ) నిర్మాణానికి గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో (జీఎస్ఎల్) రక్షణశాఖ ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం పీవీసీల నిర్మాణానికి రూ.583 కోట్లు వెచ్చించనున్నారు. ఈ స్పెషల్ రోల్ షిప్స్ దేశీయంగా రూపొందించనున్నాయి. ఇవి జీఎస్ఎల్ ద్వారా నిర్మించనున్నారు. సాగరంలో చమురు స్పిల్లంగ్ వంటి విపత్తులకు స్పందించడానికి ఐసీజీ సామర్థ్యాన్ని ఇది గణనీయంగా పెంచుతుంది.

సాగర కాలుష్యపు ప్రతిస్పందన (వీఆర్) సామర్థ్యాన్ని కూడా ఇది పెంచుతుంది. ఈ రెండు వెస్సెల్స్ వరుసగా నవంబర్ 2024, మే 2025 నాటికి పూర్తికానున్నాయి. ప్రస్తుతం ఐసీజీ ముంబయి, విశాఖపట్నం, పోరుబందర్లలో మూడు పీసీవీలున్నాయి. తద్వారా కాలుష్య పర్యవేక్షణలు,చమురు లీకుల పర్యవేక్షణ కార్యకలాపాలనుబట్టి ఈఈజెడ్,ఐలాండ్‌ల చుట్టూ నిర్వహిస్తుంది. ఈ ఒప్పందం దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది. దీనికి తోడు 200 మంది ఎంఎస్ఎంఈ విక్రేతలకు నౌకానిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలను పెంచుతుంది.

తెలంగాణలో కొత్తగా 1,114 కరోనా కేసులు

హైదరాబాద్ , జూన్ 23: తెలంగాణ రాష్ట్రంలో బుధవారం సాయంత్రం 5.30 గంటల వరకు కొత్తగా 1,114 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. కొవిడ్-19తో తాజాగా 12 మంది చనిపోయారు. 1280 మంది వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నారు. తాజా కేసులతో కలుపుకుని రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 6,16,688కు చేరుకుంది. వీటిలో యాక్టివ్ కేసుల సంఖ్య 16,462గా ఉంది. రాష్ట్రంలో కొవిడ్‌తో ఇప్పటి వరకు మొత్తం 3,598 మంది చనిపోయారు.

జిల్లాల వారీగా తాజా కరోనా పాజిటివ్ కేసుల వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్-2, భద్రాద్రి కొత్తగూడెం-59, జీహెచ్ఎంసీ-129, జగిత్యాల-23, జనగాం-11, జయశంకర్ భూపాలపల్లి-21, జోగులాంబ గద్వాల-7, కామారెడ్డి-3, కరీంనగర్-69, ఖమ్మం-69, కొమురంభీం ఆసిఫాబాద్-6, మహబూబ్‌నగర్-23, మహబూబాబాద్-44, మంచిర్యాల-49, మెదక్-8, మేడ్చల్ మల్కాజ్‌గిరి-58, ములుగు-24, నాగర్‌కర్నూలు-12, నల్లగొండ-72, నారాయణపేట-6, నిర్మల్-3, నిజామాబాద్-8, పెద్దపల్లి-53, రాజన్న సిరిసిల్ల-16, రంగారెడ్డి-75, సంగారెడ్డి-16, సిద్దిపేట-44, సూర్యాపేట-69, వికారాబాద్-14, వనపర్తి-17, వరంగల్ రూరల్-16, వరంగల్ అర్బన్-53, యాదాద్రి భువనగిరి-35.

కొవిడ్ బాధిత జర్నలిస్టులకు రూ. 5 కోట్ల సాయం : అల్లం నారాయణ

హైదరాబాద్ , జూన్ 23:దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా కొవిడ్ బారిన పడిన జర్నలిస్టులను తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమి ఆదుకున్నదని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. తెలంగాణ జర్నలిస్టులకు అందించిన కొవిడ్ ఆర్థిక సహాయం మొత్తం రూ. 5 కోట్ల 15 లక్షలు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం ? శిక్షణ కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి జర్నలిస్టులకు ఎదురైన కరోనా ఇబ్బందులను కొద్ది మేరకైనా తొలగించడానికి ప్రయత్నం చేసిందన్నారు.

తొలి విడత కరోనా సమయంలో దాదాపు 1,553 మంది కరోనా సోకిన జర్నలిస్టులకి రూ. 3 కోట్ల 10 లక్షల 60 వేలు అదే కరోనాతో హోంక్వారంటైన్ లో ఉన్న జర్నలిస్టులు 87 మందికి రూ. 8 లక్షల 70 వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. రెండవ విడత కరోనా తీవ్ర ఉధృతి కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే దాదాపు 1,958 మంది జర్నలిస్టులకి కరోనా సోకింది. మలి విడత ఆర్థిక సహాయం రూ. 10 వేల వంతున 1,958 మంది జర్నలిస్టులకి ఒక కోటి 95 లక్షల 80 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు.

ఈ కరోనా మహమ్మారితో ఎంతోమంది పేరుగాంచిన జర్నలిస్టులు ఆకాల మరణం పొందారు. కొవిడ్ తో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం ఇవ్వాలని మీడియా అకాడమి నిర్ణయించింది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఒక నెలలోపు ఆర్థిక సహాయం అందిస్తాము. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఇచ్చిన విధంగానే 5 ఏళ్ల పాటు నెలకు రూ. 3 వేల పెన్షన్ లభిస్తుంది. అంతేగాక మరణించిన జర్నలిస్టు కుటుంబంలో 10వ తరగతిలోపు చదువుకుంటున్నవారిలో గరిష్టంగా ఇద్దరికి ఒక వేయి రూపాయల చొప్పున ఉపకార వేతనం అందుతుంది.

కొవిడ్ సోకి మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు పూర్తి చేసిన దరఖాస్తులను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి, హైదరాబాద్ చిరునామా : ఇంటినెం.10-2-1, సమాచార భవన్, 2వ అంతస్తు, ఎ.సి. గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కాంప్లెక్స్, హైదరాబాద్ కు పంపవలసిందిగా అల్లం నారాయణ తెలియజేశారు.

కలెక్టర్లతో సీఎం కేసీఆర్ సమావేశం తేదీ మార్పు

హైదరాబాద్ , జూన్ 23:ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించే తేదీ మారింది. ఈ నెల 28వ తేదీకి బదులుగా రెండు రోజులు ముందే(జూన్ 26న) కలెక్టర్లతో సీఎం కేసీఆర్ సమావేశం నిర్వహించనున్నారు. ప్రగతి భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో పాటు డీపీవోలు, డీఆర్డీవోలు హాజరు కానున్నారు. సీఎం, కలెక్టర్ల సమావేశంలో మంత్రులు కూడా పాల్గొననున్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారంపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, జూలై 1 నుంచి 10వ తేదీ వరకు పల్లెప్రగతి, పట్టణప్రగతి, హరితహారం కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 23: జిల్లాలోని చిన్నకోడూరు మండలం రైతుబంధు సమితి మండల కమిటీ సభ్యుడు పానుగంటి రమేశ్ తండ్రి పానుగంటి రామచంద్రం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మంత్రి హరీశ్‌రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, టీఆర్ఎస్ నాయకుడు మందుల రాఘవారెడ్డి తల్లి నర్సవ్వ మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించి ఓదార్చారు. ఆత్మవిశ్వాసంతో ఉండాలని ఆ కుటుంబానికి మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, ప్రజాప్రతినిధులు ఉన్నారు

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన వీసీ సీతారామారావు

హైదరాబాద్ , జూన్ 23:పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.కె. సీతారామ రావు మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ దూర విద్య విధానం, తెలంగాణ రాష్ట్రంలో దూర విద్యా వ్యాప్తి కోసం పంచాయతీ రాజ్ శాఖ సహకారం అవసరం ఉందని మంత్రిని కోరారు.

పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల్లో డిగ్రీ పూర్తి చేయని వారికి, పీజీ లాంటి కోర్సులు పూర్తి చేయాలి అనుకునే వారికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక వరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఎర్రబెల్లి స్పందిస్తూ పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులంతా దూర విద్య విధానం ద్వారా ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు.

ఇంటర్ ఫలితాలపై తెలంగాణ సర్కారు మార్గదర్శకాలు

హైదరాబాద్ , జూన్ 23:ఇంటర్ ఫలితాలపై తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. ఇందులో భాగంగానే ఇవాళ ఇంటర్ సెకండియర్ ఫలితాల విధివిధానాలను తెలంగాణ సర్కారు ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులనే ద్వితీయ సంవత్సరం లోనూ ఇస్తామని ఉత్తర్వుల్లో ప్రకటించింది. అలాగే ప్రాక్టికల్ పరీక్షలకు వంద శాతం మార్కులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం బ్యాక్ లాగ్స్ ఉంటే 35 శాతం మార్కులతో పాస్ చేస్తామని, సెకండియర్‌లోనూ ఆ సబ్జెక్టులకు 35 శాతం మార్కులు ఇస్తామని సర్కార్ ఉత్తర్వుల్లో పేర్కొంది.

అలాగే ప్రైవేట్ గా పరీక్ష ఫీజు కట్టిన విద్యార్థులకు 35 శాతం పాస్ మార్కులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. ఇక ఈ క్రైటీరియా నచ్చని విద్యార్థులకు పరీక్ష రాసే అవకాశం కూడా కల్పిస్తూ.. తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. కాగా ఇటీవలే ఇంటర్ పరీక్షలను రద్దు చేస్తూ తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (నాలుగో దశ) లో భాగం గా

ఎన్ఎఫ్ఎస్ఎ లబ్ధిదారుల కు మరొక 5 నెలలు ఆహార ధాన్యాలు

న్యూఢిల్లీ, జూన్ 23:ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన నాలుగో దశ లో భాగం గా జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ.. అంత్యోదయ అన్న యోజన – ప్రాధాన్యత కలిగిన కుటుంబాలు) పరిధి లోని 81.35 కోట్ల మంది వ్యక్తుల కు – వీరి లో ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) పరిధి లోకి వచ్చే లబ్ధిదారులు కూడా కలిసున్నారు– 5 నెలల పాటు అంటే 2021 జులై మొదలుకొని 2021 నవంబరు వరకు ప్రతి ఒక్క వ్యక్తి కి 5 కిలో ల వంతు న ఉచితం గా అదనపు ఆహారధాన్యాల ను ఇచ్చేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.టిపిడిఎస్ లో భాగం గా 81.35 కోట్ల మంది వ్యక్తుల కు 5 నెలల కాలానికి ప్రతి ఒక్కరి కి నెల కు 5 కిలోల వంతు న ఆహార ధ్యాన్యాల ను అదనం గా ఎలాంటి ధర అనేది లేకుండా మంజూరు చేయడానికి సంబంధించి 64,031 కోట్ల రూపాయల మేరకు ఆహార సబ్సిడి అవసరమవుతుందని అంచనా వేయడమైంది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వైపు నుంచి ఎటువంటి తోడ్పాటు అనేది లేకుండా ఈ పథకానికి అయ్యే మొత్తం ఖర్చు ను భారత ప్రభుత్వం భరిస్తోంది. భారత ప్రభుత్వం ద్వారా ఆహార ధాన్యాల రవాణా, వాటి హ్యాండ్ లింగ్ , ఎఫ్ పిఎస్ డీలర్ ల మార్జిన్ తదితరాలకు గాను దాదాపు గా మరో 3,234.85 కోట్ల రూపాయల ను సైతం ఖర్చు పెట్టడం జరుగుతుంది. ఈ ప్రకారం గా, భారత ప్రభుత్వం ద్వారా కాబోయే మొత్తం అంచనా వ్యయం 67,266.44 కోట్ల రూపాయలు ఉంటుంది.గోధుమలు/బియ్యం కేటాయింపు ను ఆహారం, ప్రజాపంపిణీ విభాగం నిర్ణయించనుంది. దీనికి తోడు, వర్షాలు, మంచు కురియడం వంటి ప్రతికూల వాతావరణ స్థితుల లో సప్లయ్ చైన్ మరియు కోవిడ్ వల్ల ఉత్పన్నమైన సమస్య ల కారణం గా నిర్వహణ సంబంధి అవసరాల కు తగినట్లుగా పిఎమ్‌జికెవై మూడో దశ, పిఎమ్‌జికెవై నాలుగో దశ లలో భాగం గా సరకు తరలింపు/పంపిణీ కాలాన్ని పొడిగించే అంశాన్ని కూడా ఆహారం, ప్రజాపంపిణీ విభాగమే ఖాయం చేసే అవకాశం ఉంది. ఆహార ధాన్యాల పరం గా చూస్తే సుమారు గా 204 ఎల్ఎమ్‌టి ని తరలించవలసి రావచ్చు. ఈ అదనపు కేటాయింపు తో కరోనా వైరస్ కారణం గా ఆర్థికం గా చితికిపోయిన పేదల కు ఎదురయ్యే ఇక్కట్టులు తగ్గవచ్చు. రాబోయే అయిదు సంవత్సరాల లో ఏ పేద కుటుంబానికీ ఒడుదొడుకు ల కారణం గా ఆహార ధాన్యాల అలభ్యత తాలూకు బాధలను అనుభవించవలసిన స్థితి దాపురించదు.

క్రీడల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , జూన్ 23: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధిపై దృష్టి సారించిందని క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఒలింపిక్స్ డే సందర్భంగా తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూమ్ యాప్ ద్వారా నిర్వహించిన వర్చువల్ మీటింగ్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఒలింపిక్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడల అభివృద్ధి లో భాగంగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో మినీ స్టేడియంల నిర్మాణం చేస్తున్నామన్నారు. ఇప్పటికే 50 శాతం స్టేడియాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి క్రీడా పాలసీని తయారు చేయటానికి సీఎం కేసీఆర్ క్యాబినెట్ సబ్ కమిటీని నియమించారని గుర్తు చేశారు. దేశంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్‌లో రాణించిన క్రీడాకారులకు గత ప్రభుత్వాలు నామ మాత్రంగా సహాయ సహకారాలు అందించాయన్నారు. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఉన్నత విద్యలో ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

సానియా, ప్రణీత్‌లు సత్తా చాటాలి

టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తెలంగాణ క్రీడాకారులు సానియా మిర్జా, సాయి ప్రణీత్ లు సత్తాచాటి తెలంగాణ రాష్ట్రం కీర్తి ప్రతిష్టలను పెంచాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడా సంఘాలకు క్రీడా శాఖ ద్వారా ఎంతో ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. ఒలింపిక్స్ అసోసియేషన్ ద్వారా క్రీడల అభివృద్ధికి చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. కరోనా మహమ్మారి వల్ల క్రీడాకారులు తమ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల కరోనా మహమ్మారితో చనిపోయిన క్రీడా దిగ్గజం మిల్కాసింగ్ తో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు క్రీడాకారులు, క్రీడా అసోసియేషన్ సభ్యులు, స్పోర్ట్స్ ఫోటోగ్రాఫర్ సలీంలకు సంతాపం ప్రకటించారు. 2 నిమిషాల మౌనం పాటించి వారి సేవలను స్మరించుకున్నారు.

ఈ జూమ్ మీటింగ్‌లో తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ సీనియర్ అసోసియేషన్ సభ్యులు సముద్రాల వేణుగోపాల చారి, శాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, ప్రేమ్ రాజ్, హ్యాండ్ బాల్ జాతీయ ఫెడరేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ రావు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ శ్రీధర్ రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇస్మాయిల్ బేగ్ , వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, శాట్స్ అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం: మంత్రి తలసాని

హైదరాబాద్ , జూన్ 23: నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని మంద్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై మంత్రి తలసాని సమీక్ష నిర్వహించారు. జూలై 13న ఎల్లమ్మ కల్యాణం మహోత్సవం, 14న రథోత్సవం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా కరోనా నిబంధనలను పాటించాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అమ్మవారి కల్యాణం, ఉత్సవాలకు సీఎం ప్రత్యేక బడ్జెట్ కేటాయించారని తెలిపారు. ఎల్లమ్మ తల్లి ఉత్సవాల దృష్ట్యా కొవిడ్ నేపథ్యంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహమ్మారి నుంచి ప

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 24-6-2021

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

నేటికవితలో ఈ వారం: 'ఉషోదయపు నడక'
అనే అంశంపై వచ్చిన 61 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన
కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

వడ్డించేవాడు తనవాడే

అసలు ఎంతున్నా కొసరుకై ఆశే
ఉన్నోడికెప్పుడూ లేనోడి
నోటికాడికూడుపై ధ్యాసే
వడ్డించేవాడు తనవాడే కదా..!.
వడ్డీపైన వడ్డీ వసూలు చేసే
వడ్డీ వ్యాపారే..!
ప్రభుత్వ దృష్టిలో..
పైసా ఆదాయం లేని
నిరుద్యోగ భృతికి
అర్హత సాధించిన సామాన్యుడు.
చిన్న సన్నకారు రైతుకాడి
వీసమంత భూమిని లాక్కుని
భూస్వామిగా ఎదిగిన
ఊరి ఆసామే
తెల్లకార్డుకై అర్జీపెట్టుకున్న
పూట గడవని బికారి.
తరాలు తిన్నా
తరగని ఆస్తులు కూడబెట్టిన పెత్తందారే
కాలు కింద పెట్టకుండా
కార్లలో తిరిగే ఆగర్భశ్రీమంతుడే
ఆరోగ్యశ్రీకై బారులు కట్టిన నిరుపేద
పేదోడి కడుపు కొడితే
అడ్డొచ్చే నాథుడెవరూ..?
ఎట్టికొచ్చిన పథకాలు కదా
కలిగినోళ్ళకు బహుతీపి
పేదోడి ఎన్నటికీ ప్రభుత్వ
పథకాలందుకోలేని ఉన్నతుడే..!
చేయి చాచి అడగలేని
అభాగ్యవంతుడే.

-వెగ్గలం సుభాషిణి
9490732454

కరీంనగర్ కు చెందిన కవయిత్రి సుభాషిణి వెగ్గలం గారు ఉచితమంటే చేదెవరికి? అంశంపై వడ్డించేవాడు తనవాడే శీర్షికతో రాసిన కవితలో ఆద్యంతం నడుస్తున్న చరిత్రను తెలియజెప్పేందుకు ప్రయత్నించారు. పేదోళ్ళకు అందాల్సిన పథకాలను ధనికులు తన్నుకు వెళుతున్న తీరుతెన్నులను కవయిత్రి ఎండగట్టారు.

కవయిత్రి సుభాషిణి గారు కవిత ప్రారంభపంక్తులను ఆసక్తికరంగా మలచారు. చక్కని ఎత్తుగడకు చోటుకల్పించారు. అసలు కన్నా కొసరుకే ఆశపడే మనిషి నైజంను గుర్తుచేశారు. ఉన్నోడికెప్పుడూ లేనోడి నోటికాడి కూడుపై ధ్యాసే. వడ్డించే వాడు తనవాడేకదా అంటూ వ్యాఖ్యానించారు. వడ్డీపైన వడ్డీ వసూలుచేసే వడ్డీ వ్యాపారే.. ప్రభుత్వ దృష్టిలో పైసా ఆదాయం లేని నిరుద్యోగ భృతికి అర్హత సాధించిన సామాన్యుడంటూ కొనసాగించిన తీరు బాగుంది. సన్నకారు రైతు కాడి వీసమంత భూమినీ లాక్కుని.. భూస్వామిగా ఎదిగిన ఊరి ఆసామేతెల్లకార్డుకై అర్జీ పెట్టుకున్న పూటగడవని బికారిగా నటిస్తున్నారని ధ్వజమెత్తారు. తరాలు తిన్నా తరగని ఆస్తి కూడబెట్టిన పెత్తందారే కాలుకిందపెట్టకుండా కార్లలో తిరిగే ఆగర్భ శ్రీమంతుడే ఆరోగ్యశ్రీకై బారులుకట్టిన నిరుపేద అంటూ నేడు సమాజంలో మనం చూస్తున్న వాస్తవాలను గుర్తుచేస్తూ కవయిత్రి సుభాషిణి గారు వ్యంగ్యాత్మకంగా తమ అక్షరశరాలను సంధించారు. కోట్లకు పడగలెత్తి.. కార్లలో వెళ్ళి.. రైతుబంధు ప్రయోజనాలకై అర్రులు చాస్తున్న వెర్రి వాళ్ల వైఖరులను నర్మగర్భంగా ఎత్తిచూపారు. అసలైన పేదోళ్లను పక్కకు నెట్టి అసలు సిసలైన గరీబోళ్లం మేమే అంటూ అమీరులు ఆడుతున్న నాటకాలను ఎండగట్టారు. పేదోడి కడుపు కొడితే అడ్డొచ్చే నాథుడెవరూ అంటూ ప్రశ్నించారు. ఎట్టికొచ్చిన పథకాలు కదా! కలిగినోళ్లకు బహుతీపే కానీ చేదెట్లవుతుందన్న అర్థం వచ్చే విధంగా కవయిత్రి తమ భావాలను అక్షరాలలో నిక్షిప్తం చేశారు. కవిత చివరలో పేదోడు ఎన్నటికీ.. ప్రభుత్వ పథకాలందుకోని ఉన్నతుడేనని.. చేయిచాచి అడగలేని భాగ్యవంతుడేనంటూ ఆలోచనాత్మక ముగింపునిచ్చారు. అలతి అలతి పదబంధాలతో రూపుదిద్దుకున్న ఈ కవిత కవయిత్రి కలం యొక్క బలాన్ని సూచించే విధంగా కొలువుదీరింది. మున్ముందు మరిన్ని మంచి కవితలు సుభాషిణి గారు రాస్తారన్న నమ్మకం ఉంది.

ఆలోచించు

మధ్యతరగతి మనస్తత్వం
ఫ్రీగా వస్తే ఫినాయిల్ తాగినట్లు
ఉచితం అనగానే ముందు
వరసలో పరుగు పందాలు.
పనికిరాని పాతబడి
అమ్ముడుపోని వస్త్రాలు
ఒకటి కొంటే ఒకటి ఉచితమనగానే
క్యూలల్లో నిలబడే ఆడవాళ్ళు.
రాజకీయపు రంగస్థలంలో
ఉచిత ఓనమాలతో తెరకెక్కి
తిమ్మిని బమ్మిని చేస్తూ
ఉచితానుచితాలను ఆలోచించని
నాయకులు ఐదేళ్ళు
అందలం ఎక్కుతున్నా పట్టని జనం
విద్య ఉచితం
ఉచిత రేషన్ బియ్యం
పుట్టేపాపకు అన్నీ ఉచితం అంటూ
చదివిన చదువుకు ఉపాధిచూపక
నిరుద్యోగ భృతితో
భ్రమల లోకంలో
యువత ఊరేగేలా చేస్తున్న
పాలకులను చూసి ఏమందాం?.
అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు
పన్నులతో చెత్తపన్నుతో చిత్తుచేస్తూ
మోపెడు బిల్లుల బల్లుల్లా వసూలుచేస్తూ
ఇస్తామంటూ ఊరిస్తుంటే
ఉచితానికి అలవాటుపడి
ఆలోచించని మెదళ్లు
ఇకనైనా ఆలోచించి అంతు తేల్చాలి

-డా.బండారి సుజాత
9959771228

హన్మకొండకు చెందిన కవయిత్రి డా. బండారి సుజాత గారు ఉచితమంటే చేదెవరికి? అంశంపై ఆలోచించు శీర్షికతో రాసిన కవితలో ఉచితానుచితాలు ఆలోచించకుండా ఉచితం కోసం ఎగబడే మనస్తత్వాలను తమ కవిత్వంలో ఆవిష్కరించారు. మధ్యతరగతి ప్రజలు ఫ్రీగా వస్తే పరుగులు తీయడాన్ని కవయిత్రి సుజాత గారు తమ కవిత ద్వారా ఎండగట్టారు. ఫ్రీగా వస్తే ఫినాయిల్ కూడా వద్దనరన్న అర్థం ధ్వనించే విధంగా ఉచితం కోసం పరుగులు తీస్తారని వ్యాఖ్యానించారు. పనికిరాని పాతబడి అమ్ముడుపోని వస్త్రాలు .. ఒకటి కొంటే మరొకటి ఉచితమనగానే క్యూలల్లో నిలబడే ఆడవాళ్ళపై కవయిత్రి తమదైన శైలిలో ధ్వజమెత్తారు.

రాజకీయపు రంగస్థలంలో ఉచిత ఓనమాలతో తెరకెక్కి తిమ్మిని బమ్మిని చేస్తూ ఉచితానుచితాలను ఆలోచించని నాయకులు అయిదేళ్లు అందలమెక్కుతున్నప్పటికీ జనం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉచితం అంటూ అటు ప్రభుత్వం ఇటు జనం ఎగబడటాన్ని కవయిత్రి సుజాత గారు ప్రస్తావించే ప్రయత్నం చేశారు. విద్య ఉచితం.. రేషన్ బియ్యం ఉచితం.. పుట్టేపాపకు అన్నీ ఉచితం.. యువతకు చదివిన చదువుకు ఉద్యోగం ఇవ్వకుండా నిరుద్యోగ భృతి పేరున మభ్యపెట్టడం వంటివి సత్ఫలితాలను ఇవ్వవన్న అర్థం ధ్వనించే విధంగా కవయిత్రి సుజాత గారు తమ కవితను కొనసాగించారు.

అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు ..పన్నులతో.. చిత్తుచేస్తూ మోపెడు బిల్లులు వసూలు చేస్తూ .. ఉచితంగా ఇస్తామంటూ పథకాలు మరోవైపు పాలకులు తెరలేపుతుంటే భ్రమలలోకంలో బాధ్యత మరచి ఊరేగుతూ జనం కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. సదా ఉచితానికి అలవాటుపడి తమ జీవితాలను అంధకార బంధురం లోనికి నెట్టుకోవద్దని ఇప్పటికైనా స్వావలంబన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఉచితాలకు అలవాటుపడి వాస్తవాలు తెలుసుకోని మెదళ్లు ఇకనైనా ఆలోచించి ఉచితాల బాట విడనాడాలని పిలుపునిచ్చారు. కవిత్వాంశ పెద్దగా లేకపోయినప్పటికీ ఉచితం పేరున సమాజంలో జరుగుతున్న పరిస్థితులకు అద్దం పట్టేందుకు ప్రయత్నించారు. ఉచితం ఊబినుండి బయటపడి స్వయం కృషితో స్వావలంబనతో స్వాభిమానంగా బ్రతకాలన్న ఆలోచన కల్పించేందుకు కృషిచేశారు. కవయిత్రి సుజాత గారు అధ్యయనం ద్వారా తమ కలానికి మరింత పదునుపెట్టుకుంటారని విశ్వసిద్దాం.

వ్యామోహపు ఊయల

ఎరవేసి చేపను బుట్టలో వేసినట్లు
ఎన్నికల మాయాజాలంలో
ఉచిత పథకాల వల.
తెలివిగా బురిడీ కొట్టించే తీరుతో
ఐదేళ్ల దోపిడీకి
పథకం ప్రకారం వేసే తెర..
అడ్డూ అదుపూ లేని ఉచితాలు
అధికారం చేజిక్కించుకోడానికి
కొత్త ప్రయోగాల పన్నాగాలూ..
ఉచితం చేదుగాక పోవచ్చు
కానీ అది మెల్లగా చల్లగా
నిను ముంచే విషం
తేరగా అన్నీ వస్తున్నాయనుకోవడం భ్రమ
తేలికగా వచ్చేదేదైనా ముంచుతుంది సుమా!
అంతా ఫ్రీ అన్న వ్యామోహపు
ఊయలలో ఊగిన వెనిజులా
కొట్టుకుంటోంది గిలగిలా..
శృతిమించినదేదైనా
గతి తప్పే రాగమే
అతిగా ఆశపడితే
ఎవుడూనా విలయమే

-వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

కరీంనగర్ కు చెందిన కవి వెల్ముల జయపాల్‌రెడ్డి గారు ఉచితమంటే చేదెవరికి అనే అంశంపై వ్యామోహపు ఊయల శీర్షికతో రాసిన కవితను అలతి అలతి పదాలతో తీర్చిదిద్దారు. శృతిమించినదేదైనా గతితప్పిన రాగమేనని తేల్చి చెప్పారు. అతిగా ఆశ పడడం అనర్థదాయకమన్న అర్థం వచ్చే విధంగా తమ భావాలను ప్రకటించారు.

అంశం వెలుగులో... ఉచితాలకై వెంపర్లాడే మనస్తత్వాలను సున్నితంగా ఎత్తి చూపారు. చిన్ని చిన్ని పదాలను ప్రయోగిస్తూ నర్మ గర్భంగా లోతైన భావాలకు చోటు కల్పించారు. కవిత ఆరంభంలోనే.. ఎరవేసి చేపను బుట్టలో వేసినట్లు ఎన్నికల మాయాజాలంలో ఉచిత పథకాల వల అంటూ ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టారు. ఎన్నికల మాయాజాలం .. ఎరవేసి చేపను బుట్టలో వేయడం.. ఉచిత పథకాలవంటి పదబంధాలను ప్రయోగించడంలోకవి రెడ్డి గారు ఔచిత్యాన్ని పాటించి కవిత ఎత్తుగడకు జీవం పోశారు. పాఠకుడిలో ఆసక్తిని పెంపొందించారు. ప్రజా ప్రతినిధులు తెలివిగా బురిడీ కొట్టించే తీరుతో ఐదేళ్ల దోపిడీకి పథకం ప్రకారం తీసే తెర అని వ్యాఖ్యానించారు.

అధికారమే పరమావధిగా అడ్డూ అదుపూ లేని ఉచితాలను ప్రకటిస్తూ నాయకులు ప్రజలపై చేసే కొంగ్రొత్త ప్రయోగాలను.. పన్నాగాలను కవి చక్కగా ప్రస్తావించారు. మొదట ఉచితాలన్నీ బాగా ఆకర్షిస్తాయని.. అవి ఆరంభలో చేదుకాకపోవచ్చని మెల్లమెల్లగా జనాన్ని ముంచే విషయవ్వడం ఖాయమన్న అర్థం ధ్వనించేలా కవితమ ఆలోచనలను అక్షరాలలో నిక్షిప్తం చేశారు. సరళత్వానికి పెద్దపీట వేస్తూ కొనసాగించిన ఈ కవితలో రెడ్డిగారు తేరగా అన్నీ వస్తాయనుకోవడం భ్రమఅనీ.. తేలికగా వచ్చేదేదైనా ముంచుతుంది సుమా! అంటూ హెచ్చరించారు. అంతా ఫ్రీ అన్న వ్యామోహపు ఊయలలో ఊగవద్దనీ హితవుపలికారు. శృతిమించినది ఏదయినా గతి తప్పే రాగమని అతిగా ఆశపడితే ఎప్పుడైనా విలయమేనని చక్కని ముగింపునిచ్చారు. ఉచితాలకై ఎగబడవద్దన్న సందేశాన్ని అందించడంలో కవి జయపాల్‌రెడ్డి గారదు సఫలీకృతులయ్యారు. మున్ముందు మరిన్ని గాఢమైన కవితలు ఆయన కలం నుండి జాలువారాలని కోరుకుందాం.

తెలుగు భాషలోని అక్షరాలపైన, భాషా నుడికారంపైన ఈనాటి తరాల వారికి ఎంతవరకు అవగాహన ఉన్నదో ఆలోచిస్తే సమాధానం చెప్పటం కష్టమే

పలుకుతల్లి సిగలో పొగడదండ ఈ 'నుడిగుడి'

- డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి
సెల్: 9394113848

పుస్తక సమీక్ష



తెలుగు భాషలోని అక్షరాలపైన, భాషానుడికారంపైన ఈనాటి తరాల వారికి ఎంతవరకు అవగాహన ఉన్నదో ఆలోచిస్తే సమాధానం చెప్పటం కష్టమే. భావవ్యక్తీకరణకు ప్రప్రథమ సాధనం భాష. బుద్ధిజీవి అయిన మానవుడు నాగరికత నేర్చి ప్రగతిని సాధించిన క్రమంలో భాష కూడా ప్రముఖమైన స్థానం వహించింది. భాష మనిషికి లభించిన ఒక గొప్ప వరం. భాషా నైపుణ్యం ఉంటే ఎంతటి సంక్లిష్టమైన వ్యవహారాలైనా మబ్బుల్లా విడిపోయి ఆనందాన్ని కలిగిస్తాయి. మనిషి భవిష్యత్తు అతడి మాట తీరుపైన ప్రవర్తన పైన ఆధారపడి ఉంటుంది. ఏ భాష అయినా నదీ ప్రవాహంలా ముందుకు పరుగులు తీయాలి. ఎప్పటికప్పుడు కొత్త పదాలను తనలో విలీనం చేసుకుంటూ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇముడ్చుకుంటూ తన పదాలను ఇతర భాషలకు దత్తత చేస్తూ ముందుకు సాగినప్పుడే సజీవమైన కాల పరీక్షకు నిలద్రొక్కు కుంటుంది.

పూర్వం ఆశ్రమాలలో, గురుకులాలలో విద్యాబోధన సాగేది. ఆ విద్యతో మనిషి మనుగడకు అవసరమయ్యే సమస్త విజ్ఞానమూ ఇమిడి ఉండేది. వేదాలు, మహాకావ్యాలు, ధనుర్విద్యాది అనేక శాస్త్రాలు నేర్చుకొని విద్యార్థి పరిపూర్ణ విద్యావంతుడయ్యేవాడు. దానిలో జీవనోపాధి మార్గాలుండేవి. వ్యక్తిత్వం వికసించేది. సంస్కృతి, సంప్రదాయాలపట్ల అవగాహన, అభిమానం, అభివేశం ఏర్పడేవి. భాష నేర్చుకోవటం వలన మెదడు పదునుదేరుతుంది. ఈ ఆధునిక, సాంకేతిక యుగంలో మాతృభాషలోని మాధుర్యాన్ని ఆస్వాదించటానికి అవకాశమే లేని నేటి చదువుల గందరగోళాల్లో తేనె ఊటల్లాంటి తెలుగు పదాలను, పదార్థ స్వారస్యాన్ని నుడికారపు సొంపును హృదయ సమ్మోహనమైన రీతిలో అందించిన వ్యాస సంపుటి శ్రీమతి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిగారి 'నుడిగుడి'.

ఆధునిక తెలుగు భాషావసరాలైన తెలుగు పదపరిచయం, పదస్వరూపం, పదం యొక్క అర్థం, అర్థఛాయలు, ఏది పదం, ఏది పదాంశం, ఏది ప్రత్యయం, ఏది ప్రయోగం ఇత్యాది అంశాలన్నిటిని పొందుపరచి భాషా పరిశోధనకు ఆకర గ్రంథంగా 'నుడిగుడి' నిర్మింపబడింది.

సూర్యరాయాంధ్ర నిఘంటువు వంటి కోశాలలో పదం అర్థం పద ప్రయోగం పదస్వరూపం అందింపబడటం వలన సమగ్రతను సాధించాయి. ఈ గ్రంథంలో రచయిత్రి 108 పదాలకు నానార్థాలు, పర్యాయపదాలు, ప్రయోగాలను ఉటంకిస్తూ పదప్రయోగ ఔచిత్యాన్ని వివరించారు. వ్యాకరణాంశాలను బోధించే ప్రయత్నం చేశారు. అందువలన ఇది ఒక సాహిత్య గ్రంథంగా, వ్యాకరణ గ్రంథంగా, భాషాధ్యయన మార్గంగా మనముందుకు వచ్చింది. ఆనాటి గురుకుల విద్యాభ్యాసాన్ని తలపింపచేసే తీరులో సాగటం రచయిత్రి బహుముఖీనమైన ఉపజ్ఞకు అక్షరాకృతి ఈ గ్రంథం.

తెలుగు భాషా రమణికి రమణీయమైన రత్నాభరణం వంటి, ఎనిమిది అంశాలతో కూడిన అష్టావధానం తెలుగుతల్లి కీర్తిని దిగంతాలకు వ్యాప్తి చేసింది. పాఠకుల సృజనాత్మక శక్తిని ఉద్దీపింప చేసే నుడిగుడి గ్రంథంలో తెలుగు సాహిత్యం భాషానుడికారం, వ్యాకరణం, సమాజం, చరిత్ర, ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం అనే ఎనిమిది అంశాలను సమాన రూపంగా అందించటము రచయిత్రి అష్టావధానం చేశారని చెప్పచ్చు. ఆట, పాట, మాట రీతిని అనుసరించిన ఈ గ్రంథం కేవలం విద్యార్థులకే కాకుండా భాషా ప్రేమికులకు, పరిశోధకులకు సహితం సరళానందకమైన శైలిలో భాషాధ్యయనానికి ప్రత్యేక విధానానికి ఒరవడి దిద్దారు రచయిత్రి.

తెలుగు భాషను జాతీయాలు, నానుడులు, లోకోక్తులు సహజ సుందరమైన ఆభరణాలు. తెలుగు వారి జనజీవనానికి దర్పణాలు. అపారమైన లోకానుభవంతో జోడింపబడి అరవిరిసిన వెన్నెలలా ఆహ్లాదాన్ని పంచిపెడతాయి. ఈ గ్రంథంలో పలు సందర్భాలలో ఉటంకింపబడిన సామెతలు, లోకోక్తులు ఆయా పద సంబంధాల సుగంధాలను వెదజల్లుతాయి. '

కణము' అనే పదాన్ని వివరిస్తూ 'నా హృదయపుటము దెఱచి నిలచినదొక బాష్పతరళ కణము' దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రిగారి ప్రయోగంతో ప్రారంభించి 'కణము' అంత్యపదంగా చేరి వ్యవహరింపబడే అనేక పద, పదార్థాలను వివరించారు. ఒక పదం నేర్చుకోవటానికి ముందుగా మనస్సును ఉన్ముఖీకరించి ఆ పదాన్ని పరిచయం చేయటం. ఒక లోకోక్తిని పరిచయం చేసి దానిలోని పద, పదాంశాలను విశ్లేషించటం ఆ గ్రంథంలో అనుసరింపబడిన విధానం.

'కొలనులెండినంత కొక్కెరలుండునా, కొలని హంసలకడ కొక్కెరలున్నట్లు', 'కొంగజపం' ఇలా సామాజికానుభవంతో కూడిన సామెతలను పరిచయం చేసి మనిషిలోని ఒక ప్రత్యేకమైన స్వభావాన్ని వ్యక్తం చేసే 'కొంగ'ను 'కృకణం' అని వ్యవహరిస్తారని తాము నేర్పదలచుకున్న పదం చెంతకు విద్యార్థి మనస్సును చేరుస్తారు రచయిత్రి. 'కాపులేని ఊరు కరణానికిడు' అని వేమన పద్యాన్ని స్మరింపచేస్తూ ఒకనాటి గ్రామీణ సామాజిక వ్యవస్థనంతా కళ్ళ ముందుంచారు.

భారతాది ఇతిహాసాలు, పురాణాలు భారతీయ సాంస్కృతిక గనులు. తెలుగువారి జనజీవన స్రవంతిలో తాదాత్మ్యం చెందిన గ్రంథాలు భారత యుద్ధానంతరం తన వందమంది పుత్రులను పోగొట్టుకున్న ధృతరాష్ట్రుడు, విజయం సాధించిన పాండవులలో భీముడిని కౌగలించుకోవాలనుకుంటాడు. శ్రీకృష్ణుడు పాయంతో భీముడి ఇనుప విగ్రహాన్ని ధృతరాష్ట్రుని ముందు నిలుపుతాడు. ధృతరాష్ట్రుడు ఆ విగ్రహాన్ని నుగ్గు నుగ్గు చేస్తాడు. ఈ వృత్తాంతం ఆధారంగా లోకంలో పైకి ప్రేమ నటిస్తూ, వారిని అంతం చేయాలని ఆలోచించే వారిని గురించి చెప్పటానికి 'ధృతరాష్ట్ర కౌగిలి' అనే నానుడి రూఢికెక్కింది. మహాభారతంలోని సుప్రసిద్ధమైన పై సన్నివేశాన్ని వర్ణించి 'కౌగిలి' అనే అర్థంలో 'క్రోడీకరణం' అనే పదాన్ని పరిచయం చేసిన విధానం భాషాధ్యయన విధానంతో సాధింపబడిన మరొక ప్రయోజనం.

'ఆయువు' అనే పదాన్ని వివరిస్తూ 'ఆయువు వుంటే గాయమంత సుఖం లేదు' అనే సామెతతో ప్రారంభించి మనిషి జీవించిన నాలుగు రోజులు అహింస, కరుణ, సాటి వారిపట్ల సానుభూతి కలిగి ఉండాలని, అటువంటి వారినే ధర్మ ప్రవర్తకులుగా పేర్కొంటారని చెప్తూ 'ఆయువు గల్గు నాల్గు గడియల్ కనిపెంచిన తీపతల్లి జాతీయత దిద్ది తీర్తుము' అని జీవన పరమార్థాన్ని, మానవజీవన తాత్త్వికతకు అద్దం పట్టిన కరుణశ్రీ వారి పుష్పవిలాపాన్ని గుర్తుకు తెచ్చాక అభ్యాసకుల హృదయాలలో ఒక మహోన్నతమైన భావ సౌమ్యతకు గుడి కట్టారు. 'గతి' పద వివరణలో రచయిత్రిగారి తాత్త్విక భావ సంయోజనం భారతీయతకు నిదర్శనంగా నిలిచింది. **"గతులన్నీ విఫలైన కలిగియుగమందును/ గతి ఈతడే చూవె ఘనగురుదైవము"** అని అన్నమయ్య గానామృతంలో మదిని తనిపి "పున్నమి చంద్రుని చూచియుసున్నను సృష్టించెనట శూన్యములో ఏ చిన్నెలు కనిపించినవోవన్నెల చక్రము, పుట్టె ప్రగతిన్ తరుమన్" అంటూ గరికపాటి వారి చమత్కారాన్ని కలుపుకొని **"మోక్షానికి పోతే మొసలెత్తుకు పోయిందట"** అనే సామెతలో 'సదాగతి'గా చెప్పబడే మోక్షం వరకు చేరింది. సంస్కృత వ్యాకరణం సువిశాలమైనది.

సంస్కృతం ప్రత్యయాత్మక భాష. ధాతువుకు ముందు (prefix) చేరే ప్రత్యయాల మీద కొన్ని విభిన్నమైన అర్థాలు ఏర్పడతాయి. ధాతువుకు తరువాత చేరే ప్రత్యయాల (sufix) వలన మరికొన్ని విలక్షణమైన అర్థాలు ఏర్పడతాయి. ధాతువుకు ముందు చేరే ప్రత్యయాలను ప్రాదులు (ఉపసర్గలు) అంటారు. అవి కొన్ని నామవాచకాలుగా ఇవి విశేషణాలుగా క్రియలుగా ప్రయోగింపబడతాయి. అవి ముచ్చటగా తెలుగు భాషలోకి ప్రవేశించి ఆ భాషకి సొంతం అయిపోయాయి. ఉదాహరణకు 'కృ' ధాతువునకు 'కృత్' ప్రత్యయం చేరి 'కారం' అవుతుంది. అది ప్ర, పర, అధి, అప, అజ్ ఇత్యాది ఉపసర్గలను చేర్చుకుని పలు రీతులలో ప్రయుక్తమవుతుంది. రచయిత్రి 'ఉప్పుకారం'తో ప్రారంభించి నమస్కారం, పురస్కారం, తిరస్కారం, అహంకారం, బహిష్కారం, ధిక్కారం, అధికారం, అంగీకారం, "ఉపకారికి నుపకారమువిపరీతము కాదుసేయ వివరింపంగా" అనేవేమన పలుకుల్లోని ఉపకారం, "ఓంకారము లేని మంత్రం"లోని ఓంకారం. స్నేహమేరా జీవితం అని గుర్తు చేస్తూ చెలికారం, ఫీంకారం, క్రేంకారం, నుడికారం, ప్రాకారం,"ఒంటి చరింపకు పొలమునినింటికి కడు ప్రొద్దుగలుగ నేతెంచుము" అని గోమాత తన బిడ్డపై ప్రదర్శించిన మమకారం (భోజరాజీయం), "సందడి సొమ్ములతోడి సాకారమిదె విడయిందరు వర్ణించరే" అని అన్నమయ్య కీర్తించిన బ్రహ్మాండనాయకుని 'సాకారం' వరకు విస్తరించి భాష విశ్వరూపాన్ని అందించారు. సందర్భానుసారంగా రచయిత్రి కేవలం పదపరిచయంతోనే ఆగిపోకుండా, అదే అర్థంలో ప్రయుక్తమయ్యే ఇతర పదాలను సహితం చొప్పించారు.

దీనివలన కొన్ని సందర్భాలలో అవగాహన క్లేశం ఏర్పడినప్పటికి భాషమీద ఉండే అపారమైన ఆదరాభిమానాలు రచయిత్రిని నిలువనీయలేదని చెప్పవచ్చు. పలుకు తేనెల తల్లి మల్లీశ్వరి రచనాగ్రంపై హల్లీసకమాడింది. తెలుగు నుడిగుడి అయింది. భాష ఒక దేవాలయం నిత్యజీవితంలో భగవంతుని భక్తిభావంతో ఏవిధంగా అర్చిస్తామో ఆ రీతిగా వాక్కుల తల్లిని అర్చించవలసిన ఆవశ్యకతను నిడిగుడి గుర్తు చేస్తుంది. బహుముఖ ప్రజ్ఞావిలసితం ఈ నుడిగుడి ఆపాత మధురమైన సంగీతాన్ని, ఆలోచనామృతమైన సాహిత్యాన్ని, భాషాదీపమైన వ్యాకరణాన్ని రాశిగా పోసి అందించారు. సంగీత సాహిత్యాలు రెండు నుడుల తల్లికి ఆభరణాలు కదా.

ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, నవచేతన బుక్ హౌస్,
విశాలాంధ్ర బుక్ హౌస్
వెల: రూ.400/-

కల

కలలు పొదుగుతున్న పక్షిని
కరోనా పాము కాటేస్తుందనుకోలేదు
పాలు తాపుతున్న లేగకు
ఊపిరులు లాగిన కరోనా మహమ్మారి
తల్లిని లేకుండా చేస్తుందనుకోలేదు.
వారి కలలను ఎవరు పొదగాలి?
వారిని ఏతల్లులు అక్కున చేర్చుకొని
కలలు కనడానికి అవతరిస్తారో?.
అంపశయ్యపై ఉన్న భీష్ములకు
ఆక్సిజన్ నిలిపేస్తే?.
వారి కలలను ఎవరు పండిస్తారు?
ఎడారికి హరిత హారం వేయాలని కల
నదికి ఆనకట్ట వడ్డాణం ధరించాలని కల
సముద్రానికి తీరం దాటాలని కల
కొన్నికలలు ఎన్నటికీ నెరవేరవు
మంచుకొండ మంచి రగ్గును
కప్పుకోవాలని కల
లోయ భూమట్టానికి చేరాని కల
సూర్యుడు కుంకకూడదని కలగాస్తాడు
చంద్రుడు పున్నమిగా ఎల్లవేళలా
కనబడాలనికలగంటాడు!
చుక్కలకు పూలువెదచల్లాలని కల
ఏరు నిరంతరం పారాలని
చెట్టు కిలకిలారావాల కోలాహలం కావాలని
కొండలు తమభుజస్కంధాలపై
భూజాలను మోయాలని
కలలు కాస్తాయి!
కలంటే నిఖార్సైన ఆశలే కదా!
నెరవేరేవేవో
నెరవేరనివేవో
నెరవేర్చడానికి వీలుకానివేవో
ఆ సృష్టికర్తకే తెలియాలి!

-కిలపర్తి దాలినాయుడు
7780589336

మానవ నైజం

ఎంత దూరమైనా నడిచేందుకు
ఎక్కడికైనా చేరేందుకు
రెండు కాళ్ళూ సరిగ్గా ఉన్నా
పక్షులా ఉగిరేయకు రెక్కల్లేవని
చేపల్లా ఈదేందుకు మొప్పల్లేవని
నిరంతరంశోధన! అంతులేని ఆవేదన!
ఏ పనైనా చేసేందుకు
ఏదైనా ఇచ్చిపుచ్చుకునేందుకు
రెండు చేతులూ బాగున్నా..
గిత్తల్లా పొడవడానికి కొమ్ముల్లేవని
పాముల్లా కరవడానికి కోరల్లేవని
తెలియని దిగులు! రేబవళ్ళూ గుబులు!
భూమి అంచుల్దాకా పయనించేందుకు
నేలపై కాలూన్చక తిరిగేందుకు
వాహనాలెన్ని వరసకట్టినా..
ఆకాశ విహారానికి విమానం లేదని
సొంతానికి బొత్తిగా ఒక్కరైలూ లేదని
మోయలేని బరువు! గుండెంతా చెరువు!
అందిన భూముల్నేల్లా ఆక్రమించినా
ఆకాశ సౌధాలే నిర్మించినా
సుఖ సంపదలకేమీ కొదువ లేకున్నా..
ఒక్క ఖండ మూసాంతం సొంతమవలేదని
తనదైన ఆకాశం విడిగా లేదని
ఆగని యావ! కనిపించక ఏత్రోవ!

- ఎస్. కాశింబి
సెల్: 9052216044

భల్లం భాష్యం

నిజమైన కవిత్వానికెపుడూ నిండైన మార్కులే...!!

తూరుపు తెలతెలవారుతున్నప్పుడు.. పొగమంచు చీరలో పచ్చని చేలు అలరారుతున్నప్పుడు.. చెట్ల కొమ్మల్లోంచి సుతారంగా నేలను తాకే సూర్య తొలి కిరణంలా.. పెరట్లో ఎర్రని మందారం వంటి అమ్మాయి పెదవిపై విరిసిన కొంటె నవ్వులా.. విరహ వేదనతో ఎదురు చూపులతో రాలిన పారి కవిత్వం ఉండాలి..! జగమంతా నిండాలి..! మనిషికి మనిషే కాదు అంతకన్నా కవిత్వమే గొప్ప భరోసాగా కవిత్వం ఉంటే చాలనిపించాలి.

ఆధునిక వ్యామోహంలో మానవీయ విలువల్ని దులపరించుకొని కృత్రిమంగా మెలుచుకొస్తున్న, సోకాల్డ్ కవుల భావాలు-మనవికాని ఊహలరెక్కల్ని తొడుక్కొని-పరాయి కిరాయి సిద్ధాంతాన్ని నెత్తి కెక్కించుకొని, వాటిని కవిత్వంతో వొంపడం దురదృష్టకరం.

కవిత్వాన్ని చదువుకోవడం కూడా, కవిత్వాన్ని రాయడమేనేమో. అధ్యయన శీలి అయిన పాఠకుడు- కవిత్వాన్ని తనకు జీవితమిచ్చినంత చీకటి వెలుగులమేరా , సరిహద్దుకీ సరిహద్దుకీ వొక్కో శూన్య ఆవరణాన్ని నిలబెట్టుకుంటూ వాక్యానికీ వాక్యానికీ మధ్య ఆనందానుభవ అర్థాల్ని కంపోజు చేసుకుంటాడు. అప్పుడు కవిత్వం రాసేటప్పుడు కవికి అందుబాటులో లేని అదనపు పరాశ్రయత పాఠకుడికి దొరుకుతుంది. తద్వారా కవిత్వపు ప్రయోజనం 'పాఠకుడి ద్వారా పూర్తిగా సిద్ధిస్తుంది'.

వినూత్న ప్రక్రియకి, ప్రతిభావంతమైన ప్రతీక జ్ఞానం. జోడించబడిన కవిత్వానికి అంతకు ముందున్న కవిత్వానికి లక్షణాలే కాదు లక్ష్యాలూ వేరు. క్లుప్తత, స్పష్టతతో సూటిగా, మామూలు మని

భారతీయ విద్యారంగంలో సావిత్రి బాయి ఫూలేతో పాటు సాగిన

వేగు చుక్క ఫాతిమా షేక్

భారతీయ చరిత్ర తిరగ రాయవలసి ఉన్నది. ప్రాధాన్యతలు మార్చ వలసి ఉన్నది. వలసవాదుల దృకపథం చిలుము వదిలించి కొత్త చరిత్ర రాయ వలసి ఉన్నది. అగ్ర వర్ణ, అగ్ర కులాధిక్య దృక్పథం ఆధిక్యతావాద చెదలు వదిలించి నూతన అంశాలతో కొత్త చరిత్ర రాయ వలసి ఉన్నది. ముస్లిం రాజుల, ముస్లిం సమాజ వ్యతిరేక విషాలను హరించి జాతీయ సమైక్యతను వెలికి తీసి కొత్త చరిత్ర రాయవలసి ఉన్నది. శూద్ర , అతి శూద్ర ఉత్పత్తి కులాల, సేవా కులాల త్యాగాలను, నైపుణ్యాలను, వారు సృష్టించిన సంపదను, సాహిత్యం, కళలు సంగీత వాయిద్యాలను, సైన్సు , టెక్నాలజీలను ఎత్తి పట్టి చరిత్రను పునర్ నిర్మాణం చేయ వలసి ఉన్నది.

రాజులు, రాజ్య విస్తరణ, పరిపాలన, యుద్ధాలు, వారి ఆసక్తులు, వారి మతాలు, గుడి గోపురాల నిర్మాణాలు వారి సౌందర్య ఆరాధన కు ప్రాధాన్యత ఇచ్చి రాస్తున్న చరిత్ర రచనలో చరిత్ర కారుల ఆసక్తులేమిటో స్పష్టంగానే తెలుస్తున్నవి. వీర, సాహస శృంగార, బీభత్స , హింస సినిమాలను నీతి , సత్ప్రవర్తన శీల నిర్మాణం కోసం చూస్తున్నామంటే , తాడి చెట్టెక్కి ఆవు పాలు తాగుతున్నా నంటే నమ్మమంటున్న చరిత్ర రచన అది.. చరిత్రకారుల ఆసక్తే , లక్ష్యమే చరిత్ర రచన రూపంలో మనకందించ బడుతున్నది. ఇది ప్రజల చరిత్ర కాదు. ప్రజల చరిత్ర , ఆనాటి వ్యవసాయం, వేట, ఆహారం, వృత్తులు, నైపుణ్యాలు, రక్త సంబంధాలు, వారి కళలు , సంస్కృతి , విద్య, విశ్వాసాలు, గృహవసతి, పనిముట్లు, దారులు, దాడులు, విద్య, వైద్యం, ప్రకృతిలోని చరాచర జీవరాసులతో సంఘర్షణ, మచ్చిక చేసుకొని సాదుకోవడం, నైసర్గిక స్థితి గతులు , ఎండవాన, వరదలు, కరువులు, రోగాలు, ఆరోగ్యాలు జీవన ప్రమాణాల గురించిన ప్రాధాన్ తలత రాసినదే నిజమైన చరిత్ర. అది ప్రజల కోసం రాయవలసిన చరిత్ర. ఆధునిక సమాజం ప్రజాస్వామిక సమాజంగా పరివర్తన చెందుతున్నది. భారత రాజ్యాంగ మౌలిక విలువలకు, లక్ష్యాలకు ప్రాధాన్యత నిచ్చే చరిత్ర పునర్ నిర్మాణం నేటి కర్తవ్యం. అలాంటి కర్తవ్య నిర్వహణకు ఎంతో పరిశోధన, పరిశ్రమ అవసరం.

సమాజంలో మార్పులు ప్రవేశించినపుడు అందుకు అనువుగా సంఘ సంస్కరణలు అవసరమవుతాయి. ఘనీభవించి , గడ్డకట్టుకు పోయిన విశ్వాసాలను, వ్యవస్థలను, వివక్షలు, అసమానతలను పెకలించి వేయడానికి సంఘ సంస్కర్తలు కృషి చేస్తారు. వారు సంఘంతో తల పడుతారు. వారు నూతన వెలుగులు ప్రసరింప జేస్తారు. అలాంటి వారి గురించి రాసేదే నిజమైన సామాజిక చరిత్ర పరిణామాన్ని తెలుపుతుంది. అలా కబీర్, గురు రవిదాస్, గురునానక్, మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, రాజారామ్మోహన్ రాయ్, నారాయణ గురు, పెరియార్ రామస్వామి నాయకర్, పోతులూరి వీర బ్రహ్మం, కందుకూరి వీరేశలింగం, డాక్టర్ బాబా సాహెబ్ బి ఆర్ అంబేద్కర్ , గాడ్గే బాబా , నారాయణగురు , భారత రాజ్యాంగ నిర్మాతలు మొదలైనవారు సమాజ పరిణామానికి కృషి చేసిన సంఘ సంస్కర్తలు.

నేడు విద్యలో భాగంగా భావిస్తున్నవి చాలా కాలందాకా వృత్తులుగా, కళలుగా, నైపుణ్యాలుగా భావించ బడ్డాయి. జ్ఞానం నిజ్ఞానం , అధికారం, సంఘ సంస్కరణ అక్షరాస్యతతో ముడిపడి ఉంది. అందుకని విద్యా విధానాల చరిత్ర అధ్యయనానికి పూనుకున్నాను. అది అనేక పరిశోధనలలాగే బహుజన చైతన్యం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల ప్రాధాన్యతలో మధ్యలోనే ఆగి పోయింది. యువ పరిశోధకులు, విద్యారంగ చరిత్ర కారులు ఈ పనికి పూనుకోవడం అవసరం.

ధనుంజయకీర్ మహాత్మా జ్యోతిబా ఫూలే, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ల జీవిత చరిత్ర రాసి మనకు ఎంతో చరిత్రను అందించారు. అట్లా వారి సహచరులు, సమకాలికులు, నాటి సమాజం, విద్యావ్యాప్తి, సంఘ సంస్కరణలు, సంఘర్షణలు మనకు మూల వనరులు గా అందించారు. అలా వెలువడిన అనేక పరిశోధనలతో ఫూలే చరిత్ర తోపాటు, భారత కార్మిక ఉద్యమ నిర్మాత ఫూలే సహచర్యంతో కృషిచేసిన ఎం ఎన్ లోఖాండే , సావిత్రి బాయి ఫూలే , రికార్డులు లభ్యమయ్యాయి. సావిత్రి బాయి ఫూలే చరిత్ర వెలికితీతలో మరెన్నో వెలుగులోకి వచ్చాయి. అట్లా ఫూలే దంపతుల చరిత్రతో మరో ఆణిముత్యం చరిత్ర వెలుగులోకి వచ్చింది. ఒక చిన్న సాహిత్య ఆధారాలతో ఊహలు జోడించి అంబేద్కర్ " శూద్రులెవరు", అస్పృ?శ్యులెవరు వంటి గొప్ప గ్రంథాలు రాసి చరిత్ర నిర్మాణంలో కొత్త పద్ధతులు, నూతన ప్రాధాన్యతలు ప్రవేశ పెట్టారు. అవి డి డి కోశాంబి, దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ, బిపిన్ చంద్ర, రొమిల్లా థాపర్, డి ఎన్ ఝా వంటి వారికి రుచించ లేదు. వారి ప్రాధాన్యతలు వేరు. ముంగేకర్, థోరాట్, బి ఎస్ రాములు, కె యస్ చలం , కంచ ఐలయ్య , సయ్యద్ నశీర్ అహమ్మద్, సౌదా, విమల్ కీర్తి వంటి వారిని ఆ చరిత్ర రచనలు ఆకర్షించాయి. ఆ వెలుగులో ముందుకు సాగారు.

ఆ వెలుగులను అంది పుచ్చుకొని సయ్యద్ నశీర్ అహమ్మద్ , చరిత్ర రచనలో వివక్షకు గురవుతున్న ముస్లిం సమాజం గురించి పట్టించుకోవాలను కున్నారు. సమీప చరిత్రలో ఎంత మంది ముస్లిం నాయకులు, సంఘ సంస్కర్తలు మరుగున పడేయబడ్డారో తవ్వడం మొదలు పెట్టారు. తవ్విన కొద్దీ గనులలో ముత్యాలు, వజ్రాలు లభించాయి. చారిత్రక ఆధారాలు దొరకబట్టి నూతన చరిత్ర నిర్మాణాన్ని అల్లుకుంటూ పోయారు. అలా స్వాతంత్రం కోసం, జాతీయోద్యమాల్లో వెలుగులీనిన ముస్లిం మహనీయుల చరిత్రను అందించారు. పలు పుస్తకాలు రాసి తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో వెలువరించి దేశ వ్యాప్తంగా హిందూ వాదుల విద్వేష చరిత్రకు సమాంతరంగా , భిన్నంగా విద్వేష రహితంగా , సామరస్య విధానంలో మనకందించారు. ఆ వరుసలో ఫాతిమా షేక్ చరిత్ర పుస్తకం వెలువడింది.

ఫాతిమా షేక్ చరిత్ర ఆధారం మొదట ఫూలే, సావిత్రి బాయి ఫూలేల చరిత్రలో కన పడింది. వారు ప్రారంభించిన శూద్ర అతి శూద్ర బాలికల పాఠశాలకు ఎవరూ కిరాయకు ఇవ్వక పోతేముస్లిం కుటుంబం వారికి ఆశ్రయమిచ్చింది. అట్లా ఆశ్రయ మిచ్చిన కుటుంబానికి చెందినదే ఫాతిమా షేక్. ఫాతిమా అన్న గారైన ఉస్మాన్ షేక్ ఆశ్రయం కల్పించారు. ఉస్మాన్ షేక్ కు చెప్పి ఇప్పించింది. మున్నీ గఫార్ బేగ్. వీరు ఉస్మాన్ షేక్ ను ఆదుకోవడమే కాకుండా ఫూలేకు చదువు నేర్పిన గురువు. ఇట్లా మున్నీ గఫార్ బేగ్ ఫూలే నిలదొక్కునేట్టు చేసి చరిత్రలో నిలిచి పోయారు.

ఫాతిమా గురించి సావిత్రి బాయి లేఖలోని ఒక మాట ఆధారం చేసుకొని చరిత్ర ఆధారాల కోసం ఎన్నో పరిశోధించారు. దేవ్యాప్తంగా సంప్రదించారు. ఉన్నంతలో సమగ్రంగా రాసి పుస్తకం ప్రచురించారు. ఆ పుస్తకం పేరు " ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ ". సావిత్రి బాయి దేశంలో తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలైతే, ఫాతిమా షేక్ భారతీయ దేశంలో రెండవ మహిళా ఉపాధ్యాయురాలు అని చెప్పవచ్చు. ఫాతిమా షేక్ సావిత్రిబాయి, ఫూలే దంపతుల ఆశయాలకు చేదోడుగా , వెనుక దన్నుగా నిలిచారు. హెడ్మాస్టర్ గా పని చేశారు. 72 పేజీల పుస్తకంలో చరిత్ర ఆధారాల మేరకే కల్పనలు లేకుండా వారి చరిత్రను మనకందించారు.

ఫాతిమా షేక్ గారు 1831 జనవరి 9న జన్మించారు. 1856 వరకు వారి చరిత్రను సయ్యద్ నశీర్ అహ్మద్ గారు అనేక గ్రంథాలను శోధించి పర్యటించి ఈ పుస్తకంగా వెలువరించారు. ఫాతిమా షేక్ ఫోటోను సేకరించడం దానికదే ఒక బృహత్తర ప్రయత్నం. ఆ ఫోటో ఆధారం గా పేయింటింగ్ వేయించి ముఖ చిత్రంగా వేసారు. ఫాతిమా షేక్ తన ఉదాత్త ఉత్తమఉపాధ్యాయురాలి వ్యక్తిత్వంతో ఆ చిత్రంలో సాక్షాత్కరిస్తుంది. పుస్తకం చూడడానికి 72 పేజీలే ఐనప్పటికీ ఈ పుస్తకంలో అత్యంత విలువైన చారిత్రక సమాచారం ఉంది. సావిత్రి బాయి ఫూలే చరిత్రను మరింత జోడించి దేశ వ్యాప్తంగా అన్ని భాషలలోకి అనువదించి ఎనిమిది – పది తరగతులకు పాఠ్యాంశంగా , ఉప వాచకంగా పెట్టడం అవసరం. బేటీ పడావో బేటీ బచావో ఎపుడు ప్రారంభమైందో కూడా తెలుస్తుంది. ఎన్ని అవాంతరాలు దాటి నేటి సమానత్వానికి చేరుకున్నారో తెలిసి దాని విలువను గ్రహిస్తారు. ఆ సేవా దృష్టిని పెంపొందించుకుంటారు. మత సామరస్య భావన, జాతీయ సమైక్యత వెల్లి విరుస్తుంది. మహారాష్ట్ర ప్రభుత్వం రెండవ తరగతిలోనే పాఠ్యాంశం గా చేర్చడం బహుధా ప్రశంస నీయం. భారత ప్రభుత్వంలో తొలి న్యాయ శాఖమంత్రి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కాగా, తొలి విద్యామంత్రి మౌలానా అబ్దుల్ కలం ఆజాద్ కావడం యాదృచ్ఛికం కాదు. దేశ పునర్నిర్మాణంలో దళిత విజ్ఞానవంతులు. , ముస్లిం విద్యావంతులు నిర్వహించిన పాత్ర ను చెప్పకయే చెపుతుంది. ఈ జాతీయ సమైక్యతను నిరంతరం కాపాడుకో వలసి ఉన్నది. అందుకు చరిత్ర పునర్ని ర్మాణం అవసరం. దాంతో పాటు అనేక సంస్థలకు కు స్కూళ్లకు యూనివర్సిటీకి సావిత్రిబాయి ఫూలే పేరు పెట్టినట్టుగా ఫాతిమా షేక్ పేరిట గురుకుల పాఠశాలలు స్కూళ్లు కాలేజీలు యూనివర్సిటీలు విశ్వవిద్యాలయాల్లో పీఠాలు అధ్యయన కేంద్రాలు స్కాలర్షిప్పులు ఏర్పాటు చేయడం అవసరం.

స్వగతం పేరిట సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసిన ముందుమాటలో ఇలా అంటారు. " పందొమ్మదవ అర్ధ శతాబ్దం ఆరంభ కాలంలో ' విద్య' ను సార్వ జనీనం చేయడానికి ఉద్యమించి తమదంటూ ఒక ప్రత్యేక చరిత్రను సృష్టించుకున్న ఫూలే దంపతుల చరిత్ర కూడా ఇరవయవ శతాబ్దం ఆరంభంలో గాని రూపు దిద్దుకోలేదు."జ్యోతిరావు ఫూలేను బడికి పంపాలని తండ్రిని ఒప్పించి ఉపాధ్యాయుడు మున్నీ గఫార్. అతి శూద్ర , శూద్ర కులాల బాలికలకు బడి పెట్టడం ఇష్టం లేక , బ్రుంరాహ్మణుల బెదిరింపులకు భయపడి ఇంట్లోంచి వెల్ల గొట్టాడు. అపుడు ఆశ్రయమిచ్చి ఆదుకున్నది ఉస్మాన్ షేక్. ఉస్మాన్ షేక్ చెల్లెలే ఫాతిమా షేక్.వారింట్లో స్కూలు నడపడంతో ఫాతిమా షేక్ అందులో ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యురాలి గా పని చేసి సేవలంచించారు.

ఈ పుస్తకానికి డాక్టర్ వినోదిని మాదాసు ముందుమాట రాస్తూ " మరుగున పడిన చరిత్ర శకలం మరో చదువుల తల్లి ఫాతిమా షేక్ " అని చక్కగా పేర్కొన్నారు. ఫూలే దంపతులైనా , ఫాతిమా షేక్ అయినా వారి చరిత్ర మనదాకా వచ్చిందంటే అందుకు కారణమైన మాన్యశ్రీ కాన్షీరాం గారిని ఈ సందర్భంగా తలుచు కోవాలి.

మహాత్మా జ్యోతిరావు ఫూలే (1827–1890), సావిత్రిబాయి ఫూలే (1831– 1897) లతో కలిసి పని చేసిన, అనేక విధాలుగ సహకరించిన ఫాతిమా షేక్ కూడా 1831 లోజన్మించారు. ఇలా ఇలా సావిత్రిబాయి , ఫాతిమా షేక్ సమ వయస్కులు . అదే కాలంలో సంఘ సంస్కర్తగా ఎదిగిన సాయిబాబా మహారాష్ట్ర పత్రిలో 1838 లో పుట్టి షిరిడీలో 1918 లో కాలధర్మం చెందారు.

జ్యోతిరా ? ఫూలే సాయిబాబా కన్న తొమ్మిదేళు పెద్ద.

1848 లో జ్యోతిరావు ఫూలే శూద్ర అతిశూద్ బాలికలకు పాఠశాల ప్రారంభించాడు. బ్రాహ్మణ వర్గం వ్యతిరేకించింది. వారి భయానికి తండ్రి గోవిందరావు ఫూలే వారిని ఇంట్లోంచి వెల్ల గొట్టాడు.

అలా " అన్ని వైపుల నుండి నిరాశ చెంది భయ భ్రాంతులకు గురై ఇంటి నుండి వెల్ల గొట్ట బడినపుడు, తమకు ఆశ్రయం ఇచ్చే ధైర్యం ఎవరిలోనూ లేదు. ఆ గడ్డు సమయంలో ఉస్మాన్ షేక్, ఫాతిమా షేక్ మమ్మల్ని ఆదుకుని మాకు ఆశ్రయమిచ్చారు అని రాశారు సావిత్రిబాయి ఫూలే. ఫాతిమాకు ఉర్దూ వచ్చు. మరాఠీ రాదు. ఫాతిమా తొలి విద్యార్థినిగా మొదటగా ఫూలే వద్ద మరాఠీ నేర్చుకుంది .ఉపాధ్యాయ శిక్షణ పొందిన తొలి ముస్లిం మహిళ ఫాతిమా షేక్. అహమ్మద్ నగర్ లో ఆ శిక్షణ పొందారు.

ఫాతిమా షేక్ పూర్వీకులు ఉత్తర ప్రదేశ్ నుండి మహారాష్ట్ర లోనినాసిక్ జిల్లా మాలెగాం వచ్చి స్థిర పడ్డారు. వీరి కుటుంబం వృత్తిరీత్యా బట్టల వ్యాపారం చేసేవారు. తరువాతి కాలంలో చేనేత బట్టల వ్యాపారంలో సంక్షోభం, కరువు పరిస్థితుల కారణంగా పూనా కు చేరుకుంది. ఫాతిమా తల్లి దండ్రులు ఆమె చిన్నతనంలోనే చని పోయారు. ఉస్మాన్ షేక్, ఫాతిమా షేక్ అన్నా చెల్లెల్లకు పూనాలోని గంజ్ పేట నివాసి మున్నీ గఫార్ బేగ్ పెద్ద దిక్కుగా నిలిచారు. అలా వీరి నివాసం గంజ్ పేటకు మారింది. అక్కడే స్థిర పడ్డారు. ఈ విషయాలను డాక్టర్ షంషుద్దీన్ తంబోలి గారు పరిశోధించి వెలికి తీసారు.

1848 నుండి పూనా కేంద్రంగా బుధవారపేట భిద్రెవాడలో మహాత్మా జ్జిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతులు శూద్ర , అతి శూద్ర బాలికలకు పాఠశాల ప్రారంభించారు. ఆ కాలంలో ఆడ పిల్లలకు చదువు నిషిద్ధం. అలాంటి కాలంలో శూద్ర అతిశూద్ర బాలికలకు పాఠశాల ప్రారంభించడం బ్రాహ్మణ సమాజానికి సహించరానిదైంది. జ్యోతిబా ఫూలే తండ్రిని తీవ్రంగా హెచ్చరించారు. దాంతో తండ్రి వకోడుకు కోడలును ఇంట్లోంచి వెల్ల గొట్టాడు. అపుడు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో మున్నీ గఫార్ మద్దతుగా నిలిచారు. మున్నీ గఫార్ ఫూలే చదువు ఆగి పోకుండా తండ్రిని ఒప్పించి సహకరించిన ఉదాత్త హృదయుడు. మున్నీబేగ్ ఉస్మాన్ కుటుంబానికి ఆసరా అయి నిలబెట్టినందున వారి మాటతో ఉస్మాన్ షేక్ ఫూలే దంపతులకు ఆశ్రయమిచ్చాడు . అట్లా ఫాతిమా షేక్ సావిత్రిబాయికి స్నేహితురాలైంది. అప్పటికి ఫాతిమా వయసు సావిత్రి బాయికి వలెనే 18–19 సంవత్సరాలు. ఆ కాలంలో బాల్య వివాహాలే జరిగేవి. సావిత్రిబాయికి 7 వఏటనే జ్యోతిరావుతో పెళ్లయింది. ఫాతిమాకు పెళ్లయిందో లేదో తెలియదు. పెళ్ళి విడాకులై ఇంటిపట్టున ఉంటుందో తెలియదు. మున్నీ గఫార్ చెప్పడంతో కట్టుబట్టలతో వెల్లగొట్ట బడ్డ ఫూలే దంపతులకు వసతితోపాటువంటపాత్రలు, బట్టలు వగైరా అన్నీ ఇచ్చి ఆదుకున్నాడు ఉస్మాన్ షేక్. పాఠశాల నడపడానికి రెండు గదులు ఇచ్చాడు. అలా ఇద్దరు ముస్లిం సహకారంతో జ్యోతిరావు దంపతుల ఆశయం ముందుకు సాగింది. వారికి తోడుగాఫాతిమా వారి వద్ద మరాఠీ నేర్చుకొని తాను కూడ టీచర్ గా చదువు చెప్పడం ప్రారంభించింది. ఇలా ముగ్గురు ముస్లింల సహవాసం , చిన్నప్పటి నుండి ముస్లింలతో కలిసి తిరగడం వల్ల ఫూలేకు ముస్లింల పట్ల, వారి మతం పట్ల ఆసక్తి , అభిమానం పెరిగింది. అందరూ సమానమనే సమానత్వ భావన వల్ల జ్యోతిరావు ఫూలే ఇస్లాంను, మహమ్మద్ ప్రవక్తను, ముస్లింలను ప్రశంసించాడు. అదే సమయంలో ముస్లిం పాలకుల మీద,వారి విలాసాల మీద, ధార్మికుల మీద వారి లోపాలను ఎత్తి చూపి విరుచుకు పడ్డాడు. ఫూలే " మానవ్ మహమ్మద్" శీర్షికతో వారిని ప్రశంసిస్తూ సుదీర్ఘ పవాడా (స్తుతి గీతం) రాశాడు. దాన్ని అబ్దుల్ ఫౌజాన్ తెలుగు చేశారు. అది ఇలా మొదలవుతుంది.

" మహమ్మదు ప్రపంచానికి విచ్చేసినారు. చీకట్లను వెలుగులోకి మార్చేసినారు. విగ్రహారాధన పట్ల విముఖత కలిగించినాడు. పరమాత్మ సత్యం అని ఆయననే ఆరాధించుమన్నాడు. అచత్యం నుండి దూరంగా ఉండు మన్నాడు. ఊహా జనిత విగ్రహాల ఊసే వద్దన్నాడు."

1856లో సావిత్రిబాయి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. సావిత్రిబాయి తల్లిగారింటికి పోయింది. మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా తాలూకాలోని నయాగాం ఆమె తల్లిగారిల్లు.

దాంతో పాఠశాల వ్యవహారాలన్ని ఫాతిమా షేక్ చూసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా పని చేశారు. పుట్టింటి నుంచి సావిత్రిబాయి1856 అక్టోబర్ 10 న ఒక లేఖ రాశారు. 1848 లో ప్రారంభించి 1849 నాటికి అయిదు పాఠశాలలను ఏర్పాటు చేశారు. 1856 నాటికి పూనాలో 15 పాఠశాలలు ఏర్పాటు చేసి ఉన్నారు.భర్తకు రాసిన ఆ లేఖలో ఫాతిమాను గుర్తు చేస్తూ " నేను అక్కడ లేకపోవడం వల్ల ఫాతిమా ఎంతో ఇబ్బంది పడి ఉంటుంది. అయినా ఆమె అన్ని విషయాలను అర్థం చేసుకుంటుందని నాకు తెలుసు."

శూద్, అతి శూద్ర బాలికలకు ఆంగ్ల విద్య నేర్పడంతో పాటు ముస్లిం బాలికలకు చదవు నేర్పాలనుకున్నారు. ఫాతిమా . ఇల్లిల్లు తిరిగి ముస్లిం బాలికలను కూడ పాఠశాలలో చేర్పించారు. ఫూలే బాలికల పాఠశాలతో పారంభించి వయోజన పాఠశాల, ఉపాధ్యాయ శిక్షణ పాఠశాల ఏర్పాటు చేశారు. సామాజిక సేవ, వితంతువుల సంరక్షణ, బాల్య వివాహాల వ్యతిరేక ఉద్యమం, మద్య పాన నిషేధ ఉద్యమం, కార్మిక హక్కుల ఉద్యమం మొదలైన కార్యక్రమాలు చేపట్టారు. అపుడు ఆయా పాఠశాలలో చదువు చెప్పిన టీచర్లు, చదువు నేర్చిన విద్యార్థులు ఎవరో వారి వికాస పరిణామాలు పరిశోధించ వలసి ఉంది. సావిత్రి బాయి ఆరోగ్యం కుదుట పడి పూనా చేరినాక కొంత కాలం వరకు ఫాతిమా పని చేసినట్టు ఆధారాలు దొరికాయి. ఆ తరువాతి జీవి పరిణామాలు తెలియరావడం లేదు. 1856 నాటికి ఫాతిమాకు 25 ఏళ్లు. సావిత్రి బాయికి కూడా 25 ఏళ్లు. ఫూలే దంపతులకు సంతానం కాలేదు. 25 ఏళ్ల వయసులో ఫాతిమాకు పెళ్లయి అత్తగారింటికి వెళ్లి పోయిందా? 1856 తర్వాతి జీవితం పై పరిశోధనలు సాగుతున్నాయి.

ఈ పుస్తకంలో ఫూలే దంపతుల సంఘ సంస్కరణ ఉద్యమాలను, వారెదుర్కొన్న కష్టాలను, వారికి సహకరించిన వారిని సందర్భోచితంగా పేర్కొన్నారు.

సయ్యద్ నశీర్ అహ్మద్ సులభంగా అర్థం కావడానికి ఈ పుస్తకంలో అనేక శీర్షికల కింద చరిత్రను పొందు పరిచారు. అవి ఇలా ఉన్నాయి. స్వచ్ఛందంగా సేవలకు సంకల్పించిన ఫాతిమా, ఉపాధ్యాయిని గా ఫాతిమా ప్రస్థానం ప్రారంభం, ఆగ్రహించిన ఆధిపత్య కుల పెద్దలు, సజనుల వ్యతిరేకతను సహించిన ఫాతిమా, బేటీ పడావో ఉద్యమానికి పునాదులు, ఫాతిమా విజ్ఞప్తులకు స్పందన, అడ్డుకట్టకు విఫల ప్రయత్నాలు, సడలని పట్టుదల, తెంపరి తనానికి అడ్డుకట్ట, సావిత్రిబయితో కలిసి సడిచిన ఫాతిమా, ప్రధానోపాధ్యాయినిగా ఫాతిమా షేక్, ఫాతిమా చరిత్రకు ప్రాణం పోసిన సావిత్రిబాయి లేఖ, 1856 అక్టోబర్ నాటి లేఖ, ఫాతిమాకు సావిత్రి బాయి ప్రశంసలు, చరిత్రను చెప్పిన ఛాయా చిత్రం, 1856 తరువాత ఫాతిమా ఏమయ్యారు? ఫాతిమా షేక్ కు వివాహం అయిందా?, విస్తృతంగా మౌఖిక సమాచారం, ఫాతిమా షేక్ జననం మరణం, ఫాతిమా గురించి ముమ్మరంగా సాగుతున్న పరిశోధనలు, . ఈ శీర్షికలతో పాటు అనుబంధంలో మర్నిన్ని విశేషాలు అందించారు. అయితే ఫాతిమా షేక్ తండ్రి గురించి, ఫూలే

గురువు, గఫార్ బేగ్ కు ఫాతిమా తండ్రికిగల స్నేహం, ఫాతిమా అన్న ఉస్మాన్ షేక్ ల వివరాలను కూడా మరి కొన్ని సేకరిస్తే మరింత సమగ్రంగా ఉంటుంది సమాజిక పరిణామం. మొదట చెప్పినట్టు 1831 లో కాకుండా అలిఖిత, మౌఖిక ఆధారాలను బట్టి ఫాతిమా షేక్ ఫాతిమా షేక్ 1832 సెప్టెంబర్21 న జన్మించారని అంటారు కొందరు.

1900 అక్టోబరులో. సావిత్రిబాయి ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తూ ప్లేగు వ్యాధికి గురై మరణించిన మూడేళ్లకు తన 68– 69 వ ఏట ఫాతిమా మరణించినట్టు తెలుస్తున్నది. ఫాతిమా మరణించే నాటికి అంబేద్కర్ కు తొమ్మిదేళ్లు. జ్యోతిబా ఫూలే 1890 లో చనిపోయిన మరుసటి సంత్సరం అంబేద్కర్ జనసం. సావిత్రిబాయి 1897 లో చని పోయేనాటికి అంబేద్కర్ కు ఆరేళ్లు. అలా చరిత్ర పరిణామం కొనసాగడం మొదలైంది. 1901 – లో భాగ్యరెడ్డి వర్మ(మేదరి బాగయ్య హైదరాబాద్ చాదర్ ఘాట్ లో అతిశూద్ర బాలికలకు పాశాల ప్రాంభించారు. సంఘ సంస్కరణలకు కృషి చేశారు. అంబేద్కర్ కు చేయూతనిచ్చి ప్రోత్సహించారు. నిజాం రాజు అంబేద్కర్ కు, అలీగడ్ ముస్లిం యూనివర్సిటీకి, బనారస్ కాశీ విశ్వ విద్యాలయానికి తలా పదిలక్షల రూపాయలు విరాళం ఇచ్చారు. అంబేద్కర్ ఔరంగా బాద్ లో విద్యాలయం నిర్మించారు. భారతీయ చరిత్ర ఇలా తిరగ రాయబడ వలసి ఉన్నది. మన చరిత్ర, మనవారి చరిత్ర మనం రాసుకోవలసి ఉన్నది. ఇలా ఎన్నో ప్రయాసల కోర్చి టీవీ సీరియల్ కు, సినిమాకు సరిపోయేన్ని వివరాలు సేకరించి మన కందిస్తూ చక్కని పుస్తకం వెలుగులోకి తెచ్చిన సయ్యద్ నశీర్ అహమ్మద్ గారికి అభినందనలు

ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్. రచన: సయ్యద్ నశీర్ అహమ్మద్.

ప్రతులకు: ఆజాద్ హౌజ్ ఆఫ్ పబ్లికేషన్స్.
ప్లాట్ నం. సి– 2 , శ్రీరాం ఆర్కేడ్. అమరావతి రోడ్. ఉండవల్లి. – 522501, తాడేపల్లి మండలం. గుంటూరు జిల్లా. ఆం. ప్ర. వెల 50 రూ.లు.
ఫోన్ నం. 9440241727.)

"సమాజంలో మార్పులు ప్రవేశించినపుడు అందుకు అనువుగా సంఘ సంస్కరణలు అవసరమవుతాయి. ఘనీభవించి , గడ్డకట్టుకు పోయిన విశ్వాసాలను, వ్యవస్థలను, వివక్షలు, అసమానతలను పెకలించి వేయడానికి సంఘ సంస్కర్తలు కృషి చేస్తారు"



– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

నీతోనే యుద్ధం

ఈశాన్యాన కమ్మిన విషమేఘాలు
ప్రపంచమంతా కమ్ముకుని
యుద్ధవాతావరణాన్ని తలపిస్తున్నది
శస్త్రాస్త్రాలతో సంబంధంలేనిదీ యుద్ధం
రాజ్యాల ఆక్రమణల కోసం కాదీ యుద్ధం
దోపిడీలకు సంబంధం లేనిదీ యుద్ధం
ఇది మనుషులమధ్య రణం కాదు
జనజీవితాన్ని నిర్వీర్యం చేస్తున్న
కంటికి కనబడని క్రిమిపై
మనమంతా కలిసి చేస్తున్న ప్రచ్ఛన్నయుద్ధం
ప్రజారోగ్యపరిరక్షణమే లక్ష్యంగా
ప్రతి మనిషి ఒక సైనికుడై
జనమంతాకలిసి పోరాడదాం
ప్రభుత్వప్రకటించిన
లాక్ డౌన్ కు సహకరిద్దాం
స్వీయ నియంత్రణను పాటిద్దాం
ఈనాటి నీ ఏకాంతజీవనంతో
రేపటి నీ సంతోషాలకు పునాది వేసుకో
అంతర్ముఖీనుడవై నిన్నునీవు తెలుసుకో
కర్తవ్యాన్ని పాటించు
మనిషిగా ఆలోచించు
ప్రాణాలు తీసే కరోనాకాదు
ఎలాంటి వైరస్ లు నీ దరిచేరవు.

–డా.మైలవరపు లలితకుమారి
9959510422

కని, పెంచే అమ్మానాన్నలే... కనిపించే దేవతలు !

కమ్మని కలలెన్నోకని, కన్ననాటినుండి
కన్నబిడ్డలు కళ్ళు తెరిచిన నాటినుండి
రాత్రింబవళ్ళు కంటికిరెప్పలా కాపాడిన.

కాలిలో ముల్లుగుచ్చుకుంటే కన్నీరు కార్చిన
కాలేటి కడుపుల్ని చిరునవ్వుల్లో దాచుకున్న
కన్నబిడ్డలకు కమ్మని తిండిపెట్టి ఆకలి తీర్చిన
చిన్నజబ్బుచేస్తే డాక్టర్ దగ్గరికి పరుగులు తీసిన

తలకుమించి అప్పులు చేసిన
స్కూలు కాలేజి ఫీజులు కట్టిన
గొప్ప విద్యావంతులను చేసిన
ఉన్నతుద్యోగులుగా తీర్చిదిద్దిన.

కాలి చెప్పులు అరిగేలా తిరిగి తిరిగి
ఖరీదైన విదేశీ సంబంధాలు వెదికి వెదికి
అంగరంగ వైభవంగా ఘనంగా వివాహాలు చేసిన
అందరికి ఆస్తులు పంచి అస్థిపంజరాలుగా మారిన

అమ్మానాన్నలను...
కనికరం లేక కసిరి కొట్టే...
బాధ్యతలేక బయటికి నెట్టే...
కన్నబిడ్డలెంతటి కఠినాత్ములు! ఔరా
ఎంతటి క్రూరులు ! ఎంతటి నీచులు !
ఎంతటి మూర్ఖులు ! ఎంతటి నిర్దయులు !

ఇంతటి పాషాణ హృదయులు కృతజ్ఞతలేని
ఈ కన్నకుమారులకన్నా ఈ కన్నకుమార్తెలకన్నా
విశ్వాసమున్న వీధిల్లోని ఆ శునకాలే సయం గదా!
ఓడైవమా చనిపోయాక కట్టే "చలువరాతి సమాధులకన్న"
ముసలితనాన ఇంత "ముద్దపెట్టే చేతులే" మిన్న యన్న
కాసింత ఇంకితజ్ఞానాన్ని
ఈపిల్లలకు ప్రసాదించండి ప్రభూ!

–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

కవి సమ్మేళనం

ఇది తెలుగు కవి సమ్మేళనం
సు–కవుల
మనోభావ కుసుమాల తోరణం
సాహిత్య రస పిపాసకుల
సహనానికి నిదర్శనం లాంటిది
సారంగపాణి సలంకరించే సుదర్శనం లాంటిది
ఈ సమావేశములతోనే
ఈ సమ్మేళనములతోనే
సమాజములో సాహిత్యంపై
అభిమాన మంకురిస్తుంది
అది దినదిన ప్రవర్ధమానమై
భవ్య , దివ్య రచనలు గావిస్తుంది
ఆబాలగోపాలాన్ని అలరిస్తుంది
మురిపిస్తుంది మ



తొలి తెలుగు ప్రధాని పి.వి.నరసింహారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా 'మొగ్గలు' ప్రక్రియ సృష్టికర్త డా॥ భీంపల్లి శ్రీకాంత్ వెలువరించిన "అసాధ్యుడు" పుస్తకంలోని మొగ్గలు ఇవి

–సంపాదకుడు



జీవితంలో తొలి ఉద్యమప్రస్థానానికి శ్రీకారం చుట్టి
వందేమాతర ఉద్యమంతో వేకువకిరణమై వెలిగిండు
పివి పోరాటానికి పాదులువేసింది వందేమాతరోద్యమం

నిజాం నియంత పాలన విముక్తికోసం కంకణబద్ధుడై
వారి ఆకృత్యాలపై అలుపెరుగని పోరాటం చేసిండు
ఉవ్వెత్తున ఎగిసిపడిన విప్లవ ఉద్యమ కెరటం పివి

అతిపెద్ద భూస్వామ్యకుటుంబంలో తాను పుట్టినప్పటికీ
పేదల బతుకులను మార్చాలని తపనపడ్డ ఉద్యమశీలి
పేదలకు భూములను పంచిపెట్టిన ఉదారస్వభావి పివి

స్వామి రామానంద తీర్థ అనునూయిడిగా అరుదెంచి
సోషలిస్టు నాయకుడిగా అవతరించిన అభ్యుదయవాది
గాంధీజీ అడుగుజాడల్లో నడిచిన ఉద్యమపథగామి పివి

పూవు పుట్టగానే సహస్రదళాలతో పరిమళించినట్లుగా
బాల్యంలోనే అసమాన పాండిత్యాన్ని ప్రదర్శించిన దిట్ట
సామాజికతను ఒంటబట్టించుకున్న అపారదేశభక్తుడు పివి

మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలని సంకల్పించి
తెలుగు అకాడమిని స్థాపించిన అసలైన భాషాభిమాని
అధికారిక మాతృభాష విద్యావిధాయక రూపకర్త పివి

నిరుపేదలవారికి విద్య అందించాలనే సదాశయంతో
గురుకుల పాఠశాలలను నెలకొల్పిన విద్యాజ్యోతి
విద్యారంగ వ్యవస్థలోనే పెనువిప్లవం గురుకులాలు

ఒకపక్క విద్యార్జనలో నిమగ్నమై చదువుకుంటూనే
మరోవైపు సమాజసేవనే దేశసేవగా తరించిన ప్రాజ్ఞుడు
నాటి ఉద్యమదీప్తులే పివి రాజకీయబాటకు పునాదులు

దేశంలోనే తొలిసారిగా ఇంటర్ విద్యను ప్రవేశపెట్టి
పేదధనిక వర్గాలకు విద్యను పంచిన మహితాత్ముడు
గుణాత్మకమైన ఇంటర్ విద్యకు పితామహుడు పివి

సరళీకృత ఆర్థిక విధానాలకు అంకురార్పణ చేసి
బలోపేతమైన వ్యవస్థాకృతికి పాదులు వేసినవాడు
భారతదేశ ఆర్థిక ఉద్యమానికి స్ఫూర్తిప్రదాత పివి

హింసాత్మక సంఘటనలకు ఆలవాలమైన పంజాబులో
సమయస్ఫూర్తితో ప్రశాంతత చేకూర్చిన రాజనీతిజ్ఞుడు
దేశంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పింది పివి

దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలనే చెట్లను నాటి
భవిష్యత్తుకు సరళీకరణ ఫలాలను అందించిన ఘనుడు
భారతదేశ నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పివి

సమున్నత సంపాదక ప్రతిభతో సంచికలను రూపొందించి
విశేష సంచికలకు ప్రాణం పోసిన సంపాదక సంపన్నుడు
అశేషమైన ప్రత్యేక సంచికల సంపాదక రూపశిల్పి పివి

ఆర్థిక సంస్కరణల ముళ్ళబాటను పూలరథంలా మార్చి
దేశాన్ని అభ్యుదయపథంలోకి నడిపించిన పురోగామి
నాటి సంస్కరణల ఫలం నేటి కళ్ళముందున్న నవభారతం

మైనారిటీ ప్రభుత్వాన్ని అయిదేళ్ళ నాయకత్వంతో
దేశానికి సుస్థిరపాలన అందించిన పరిపాలనాదక్షుడు
అపార పరిజ్ఞానం గల దక్షిణభారత తొలిప్రధాని పివి

రాజకీయజీవితంలో ఆటుపోట్లనెన్నింటినో ఎదుర్కొని
తలపండిన మేధావిగా ప్రకాశించిన అసామాన్యుడు
సమయస్ఫూర్తితో నెగ్గుకొచ్చిన సహనశీలి మన పివి

తాను నమ్మిన సిద్ధాంతాలకు నిబద్ధ జీవుడవుతూనే
ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడిన పాలనాబద్ధుడు
రాజకీయంలో ప్రజాస్వామ్యాన్ని వెలిగించినవాడు పివి

రాజకీయాల్లో ఎన్నోసార్లు మౌనవ్రతం పాటిస్తూనే
ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకున్నాడు
నిర్ణయం తీసుకోకపోవడం ఒక నిర్ణయమన్నవాడు పివి

అంతర్జాతీయ వ్యవహారాలలో నెహ్రూ బాటలో నడిచి
భారతదేశ ఆర్థికపరిస్థితిని చక్కదిద్దిన ఆర్థికనిపుణుడు
దేశానికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి పివి

విద్యాశాఖను మానవవనరుల అభివృద్ధి శాఖగా మార్చి
విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చిన అభ్యుదయవాది
విద్యాశాఖను బలోపేతం చేసిన సంస్కరణలశీలి పివి

నిరంతర సంస్కరణ నిచ్చెనమెట్లతో తాను ఎదుగుతూ
అందరికీ అభివృద్ధిఫలాలను అందించిన అభ్యుదయవాది
సంస్కరణలకు చిరునామాగా నిలిచిన పథగామి పివి

కలసిరాని కాలంలో సమస్యలతో నిత్యపోరాటం చేసి
దేశ విజయపతాకను ఎగురవేసిన అపరచాణక్యుడు
ప్రజాస్వామ్య చరితకు అసలైన చిరునామా పివి

పటిష్ట భూసంస్కరణ చట్టాలతో భూపంపకాలను చేపట్టి
స్వయంగా తనభూములను ధారాదత్తం చేసిన విప్లవవాది
భూ సమస్యలను పరిష్కరించిన అపరమేధావి పివి

అత్యున్నతమైన దేశ ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన
మొట్టమొదటి దక్షిణ భారతీయ రాజకీయ దురంధరుడు
తెలంగాణ ముద్దుబిడ్డగా చరిత్ర సృష్టించిన ఘనుడు పివి

విశ్వనాథ సత్యనారాయణ "వేయిపడగలు" నవలను
హిందీలోకి "సహస్రఫణ్" గా అనువదించిన పండితుడు
అపురూపమైన అనుసృజనకు అసలైన భాష్యం పివి

హిందీ నవలాసాహిత్యంలో అగ్రశ్రేణి రచనగా ఖ్యాతిపొంది
యావత్భారతంలో సాహితీ అభిమానులను అలరించినది
హిందీలో విజయకేతనం ఎగురవేసిన నవల "సహస్రఫణ్"

బహుభాషా గ్రంథాలను సృజనాత్మకంగా అనువదించి
తెలుగు భాషానువాద నైపుణ్యానికి నిదర్శనమై నిలిచాడు
మరాఠి భాషాప్రావీణ్యానికి నిదర్శనం పివి అబల జీవితం

ఉన్నతమైన రాజకీయ పదవులలో ఒదిగి ఎదుగుతూనే
పాలనాపరమైన చైతన్యాన్ని రగిలించిన కార్యాదక్షుడు
అలంకరించిన పదవులకే వన్నెతెచ్చిన రాజనీతిజ్ఞుడు పివి

సరళమైన శైలిలో తెలంగాణ పదబంధాలను వాడుతూ
సందర్భోచిత సంభాషణలకు ప్రాణంపోసిన మరాఠి నవల
పివి సాహిత్యంలోనే విశిష్టమైనది అబల జీవితం నవల

హాస్య వ్యంగ్య అధిక్షేప రచనలను తన నవలల్లో చిత్రించి
సమకాలీన రాజకీయ ఎత్తుగడలను తూర్పారపట్టాడు
రాజకీయ పరిణతతో నవలలు రాసిన సాహసి మన పివి

కుంఠితదీక్షతో బహుభాషలను పట్టుదలగా నేర్చుకుని
భారతీయాత్మకు మారుపేరుగా నిలిచిన భాషాధురీణుడు
బహుభాషావేత్తగా రాణించిన రాజకీయదురంధరుడు పివి

సామాజిక సమస్యలపట్ల లోతైన అవగాహన కలిగి ఉండి
అభివృద్ధికి కారకమైన సంస్కరణలను ప్రవేశపెట్టిన ధీశాలి
నిత్యసంస్కరణలకు నాందిపలికిన మేధోసంపన్నుడు పివి

ప్రపంచ ఆర్థిక వాణిజ్య సంబంధాలను పటిష్టపరచడంలో
దేశాధినేతల మన్ననలను పొందిన ప్రజాయుత సంస్కర్త
భారతదేశ ఆర్థికరంగాన్ని మలుపు తిప్పిన ఘనుడు పివి

వివిధ దేశాల అధ్యక్షులు పివి ప్రతిభను కీర్తించడమే గాక
గొప్ప రాజనీతిజ్ఞుడిగా ప్రశంసలందుకున్న సమర్థుడు
అంతర్జాతీయ యవనికపై దేశజండాను నిలిపినవాడు పివి

నమ్ముకున్న సిద్ధాంతాలనే తాను ఆభరణాలుగా ధరించి
ఆత్మవిశ్వాసంతో అడుగులువేసి విజయం సాధించిన దిట్ట
రాజకీయతేజస్సుతో రాణించి విశ్వంలో వినుతికెక్కిన పివి

విదేశాంగమంత్రిగా గొప్ప దౌత్యసంబంధాలను నెలకొల్పి
భారతదేశ అభివృద్ధికి రాచబాటలు వేసిన రాజనీతిజ్ఞుడు
శత్రుదేశాలను మిత్రదేశాలుగా మలిచిన దౌత్యవేత్త పివి

ప్రతికూల ప్రభావాలను అనుకూలంగా నిర్దేశించుకుని
స్వపక్షీయులను సైతం అబ్బురపరిచిన అజేయుడు
రాజకీయ రణరంగాన్ని ఏలిన విలక్షణ రాజనీతిజ్ఞుడు పివి

స్వతంత్ర భారతదేశ పన్నెండవ ప్రధాని పదవిని అధిష్ఠించి
భారతదేశ రూపురేఖలను మార్చేసిన ఆధునిక నిర్మాత
ప్రధానమంత్రిగా రాణించిన అద్వితీయ ప్రజ్ఞావంతుడు పివి

దేశంలో అణుబాంబు తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టి
సాహసోపేతమైన చర్యలకు నాందిపలికిన సాహసవీరుడు
పోఖ్రాన్ అణుపరీక్ష విజయానికి కారణమైన సాహసి పివి

వాక్కులు రసగంగాప్రవాహంతో ఛలోక్తులతో శోభింపజేసి
రసజ్ఞులను ఆనందపరవశులను చేసిన హాస్యచతురుడు
ఆహూతులను ఆనందడోలికల్లో అలరించిన చమత్కారి పివి

కోట్లాదిమంది భారతీయుల జీవనగతులను మార్చివేసి
వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేసిన అపరమేధావి
మహోన్నత నేతగా మహిలో వెలిసిన మహితాత్ముడు పివి

నాడు దూరదృష్టితో నాటిన విదేశాంగ విధానాల పాదులు
నేటికీ అంతర్జాతీయ బంధాలను సుసంపన్నం చేస్తున్నాయి
ఆధునికవాణిజ్యానికి తెరలేపిన నవీన మార్గదర్శకుడు పివి

రాజకీయంలో ఎప్పుడూ మౌనభాషియై ఒప్పారుతూనే
అనేకవిమర్శలకు మౌనంతోనే సమాధానమిచ్చిన ఘనుడు
మౌనాన్ని అలంకారప్రాయంగా ధరించిన జ్ఞానశిఖరం పివి

భారత రాజ్యాంగాన్ని భారత సంవిధానంగా అనువదించి
ఆంగ్లచట్టాలను తెలుగులోకి మార్చమన్న భాషాభిమాని
తెలుగు భాషకు గండపెండేరం తొడిగిన ఠీవి మన పివి

కలుషితమయిన రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తులు వేసి
ఐదు సంవత్సరాలు పరిపాలించిన నాటి మేటి ప్రధాని
చాణక్యనీతితో నీతిపంతమైన పాలన అందించింది పివి

తనదైన రాజకీయ చాతుర్యంతో ఒక్కొక్కమెట్టు ఎక్కి
అతిరథ మహారథులను అధిగమించిన అగ్రభూమిక
అధిష్ఠించిన పదవులకు అలంకారప్రాయ ఆకారం పివి

అగ్రరాజ్యాలతో సమానంగా అణుపరీక్షలకు నాందిపలికి
భారతదేశ అణుశక్తిని ప్రపంచానికి చాటిన దార్శనికుడు
ప్రపంచ దేశాలన్నింటికీ దేశ ఉనికిని చాటింది పివి ఘనత

దేశప్రగతికి ఉజ్వలమైన పటిష్టమైన దారులను నిర్మించి
దేశాభివృద్ధికి పట్టం కట్టిన రాజకీయ మేరునగధీరుడు
అసాధారణమైన మహోన్నత దార్శనికుడు మన పివి

మానవజాతి శ్రేయస్సుకై గాంధీజీ సిద్ధాంతాలను ఆరాధించి
ఆయన అడుగుజాడలలో నడిచిన చైతన్య జీవధార
గాంధీజీ స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితమైనసేనాని పివి

భారతదేశ అభివృద్ధికి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి
విదేశీ సంబంధాలను సుసంపన్నంగా పటిష్టం చేసినవాడు
శత్రుదేశాలను సైతం మిత్రదేశాలుగా మలిచిన నేర్పరి పివి

భూసంస్కరణల చట్టం చేసి శాసనసభలో ప్రవేశపెట్టి
గాంధీజీ కలైన గ్రామస్వరాజ్యానికి అంకురార్పణ చేసిండు
సురాజ్యం కోసం నడుంబిగించిన నవయుగ ధృవతార పివి

నాయకత్వపటిమతో రాజనీతిజ్ఞతతో విధేయుడిగా నిలిచి
ఇందిరాగాంధీ అంతరంగికులలో ఒకడిగా నిలిచిన మేధావి
రాజకీయాల్లో నమ్మకంతో మెలిగినందుకే ప్రధానయిన పివి

ప్రాచీన విద్యాబోధనకు ప్రతిరూపంగా గురుకులాలను
ప్రయోజనాత్మకంగా దేశమంతటా ప్రవేశపెట్టిన క్రాంతదర్శి
మహోన్నతమైన సంస్కరణలకు మారుపేరు మన పివి

"జయచంద్రా ! హైందవ ధ్వంసకా!" అంటూ రాసి
ఛందోబద్ధ కవిత్వాన్ని చిన్ననాటనే ఆవిష్కరించిండు
ఆశుకవితా సరళిలో సాగిన ఖండకావ్య సృష్టికర్త పివి

ప్రతిపక్ష సభ్యుడైన వాజపేయిని ఐరాసకు పంపించి
రాజకీయ నాయకులందరినీ విస్మయపరిచిన చాణక్యుడు
రాజకీయాల్లో చతురతను చాటిన అసామాన్యుడు పివి

తెలుగు భాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ
తెలుగు అకాడమిని స్థాపించిన తెలుగుభాషా ప్రేమికుడు
తెలుగుభాషకు పట్టాభిషేకం చేసిన తెలంగాణ దిట్ట పివి

రాజకీయం సాహిత్యం రెండింటినీ సమపాళ్లలో రంగరించి
ప్రజలగుండెల్లో నిలిచి కొలువుదీరిన సాహితీదురంధరుడు
రాతల్లో చేతల్లో ఆరితేరిన నవయుగ అభిమన్యుడు పివి

విదేశీ దౌత్యసంబంధాల సముద్ధరణకు విశేషంగా కృషిచేసి
బలమైన సంబంధాలను నెరపడంలో విజయుడయ్యాడు
విదేశీ సంబంధాలను పాదుకొల్పడంలో సవ్యసాచి పివి

విదేశీ పర్యటనలో వారి భాషల్లోనే అనర్గళంగా ప్రసంగించి
అసమాన పాండిత్యంతో సభికులను అలరించిన శేముషి
దౌత్యవేత్తల ప్రశంసలను అందుకున్న ప్రాసంగికుడు పివి

కటకటాలకే పరిమితమై చీకటిగదుల్లోనే మగ్గే ఖైదీలను
సంస్కరించేందుకు ఓపెన్ జైళ్ళను ప్రవేశపెట్టిన ఘనుడు
ఖైదీలల్లో పరివర్తన బీజాలనాటిన సంస్కరణాభిలాషి పివి

అసాధ్యుడు" పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

యావత్తు భారతదేశం గర్వించదగ్గ రాజకీయనాయకుడు, మహామేధావి, బహుభాషావేత్త, రాజనీతిజ్ఞుడు, సంస్కరణశీలి, తొలి తెలుగు ప్రధాని అయిన పివి నరసింహారావు గురించి మొగ్గల ప్రక్రియలో రచించిన అసాధ్యుడు (పివి మొగ్గలు) కవితాసంపుటిని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. జూన్ 17 న హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లోని తన ఛాంబర్ లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన దార్శనికుడు పివి నరసింహారావు అని కొనియాడారు.

పివి శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకుని యువకవి భీంపల్లి శ్రీకాంత్ పివిని స్మరిస్తూ రాసిన మొగ్గలు ఆలోచింపే విధంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయనను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శివార్చక విజయకుమార్, నాగర్ కర్నూలు జిల్లా డిప్యూటీ వైస్ చైర్మన్ బాలాజీ ఠాగూర్ సింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని సజీవంగా నిలుపుతూ
"గొల్ల రామవ్వ" అనే అత్యద్భుతమైన కథను రచించిండు
తెలంగాణ మాండలిక పదాలతో కథలు రాసినవాడు పివి

విదేశాల్లో నలభైఏడు టన్నుల బంగారాన్ని కుదువబెట్టినా
సంస్కరణల ఆయుధాలతో దేశానికి రప్పించిన మేధావి
ఆర్థిక సరళీకరణ సంస్కరణల పితామహుడు మన పివి

అనర్గళమైన అద్భుత ప్రసంగాలతో అలరించే వాగ్గాటియై
ఉపదేశాలతో సభికులను ఉత్సాహపరిచే ఉపన్యాసకేసరి
ప్రవచించే సారాంశంలో విశేష అభినివేశం పివి సొంతం

సంస్కరణలతో భారతదేశ జెండాను విదేశాల్లో ఎగురవేసి
ప్రపంచాన్ని సరళీకరణంచేసి ఏకతాస్వరాన్ని వినిపించిండు
ప్రపంచానికి సరికొత్త దేశాన్ని పరిచయం చేసినవాడు పివి

భారతదేశ రాజకీయాల్లో అపర బృహస్పతిగా రాణించి
అందరికీ ఆత్మబంధువుగా నిలిచిన అనంతమైన మేధోశక్తి
రాజకీయ బంధువులందరికీ తలలోని నాలుక మన పివి

ప్రజాశ్రేయస్సుకై పరితపిస్తూ సామ్యవాదబాటలోనే నడిచి
సమతావాదాన్ని బలంగా చాటిన అసలైన సామ్యవాది
సగటు భారతీయుడి ప్రయోజనమే పివి సంస్కరణాభిలాష

అమెరికా చైనా జర్మనీ దేశాలతో సత్సంబంధాలను నెరపి
బలమైన విదేశీ విధానాలను కొనసాగించేటట్లు చేసిండు
భారతదేశ ప్రయోజనాలకు పరాకాష్ట పివి విదేశీ విధానాలు

రాజకీయంలో ఆటుపోట్లనెన్నింటినో తట్టుకుంటూ నిలబడి
సహనశీలసంపదత్వంతో రాజకీయదరిని చేరిన నావికుడు
సమయస్ఫూర్తితోనే దేశాన్ని ఏలిన మహా మౌనఋషి పివి

భారతదేశ రాజకీయ చరిత్రలోనే చిరస్మరణీయంగా వెలిగి
నాయకత్వపటిమతో ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించాడు
భారతదేశ అభివృద్ధిలో కీలకభూమిక పివి సంస్కరణలు

ఆర్థిక సంస్కరణల ముళ్ళరథాన్ని నవ్యపథంలో సాగించి
దేశాన్ని అభ్యుదయపథంలో నడిపించిన భవిష్యత్ ద్రష్ట
నవ్యభారతానికి నాందీవాచకమైన పరిపాలనాదక్షుడు పివి

అసాధ్యమనుకున్న పనులన్నీ సుసాధ్యం చేస్తూపోతూ
భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన కార్యోన్ముఖుడు
బంగారు భవిష్యత్తుకు మార్గం వేసిన సంక్షేమసారథి పివి

నిజాం కాలంనాటి ముల్కీ నిబంధనలకు మద్దతు పలికి
స్థానికులకే ఉద్యోగాలివ్వాలనే తలంపుకు నాందిపలికాడు
స్థానికతే ఉద్యోగాలకు గీటురాయని లక్ష్మణరేఖగీసింది పివి

విమర్శలకు ప్రశంసలకు తానెప్పుడూ లొంగిపోకుండా
తన పనిని తాను చేసుకుని పోయిన మౌనతపస్వి
రాజకీయ మేధోవర్గంలో స్థితప్రజ్ఞతకు మారుపేరు పివి

తీవ్రవాదుల ఆగడాల ఆటంకాలను దుశ్చర్యలను చూసి
టాడా చట్టాన్ని పక్కాగా రూపొందించిన సాహసవంతుడు
ఆటంకవాదులను అడ్డుకున్న అసలైన సింహస్వప్నం పివి

సుస్థిరమైన అభివృద్ధికి బలమైన పునాదులను నిర్మించి
స్వతంత్ర భారతాన్ని ఉజ్జ్వలంగా ప్రకాశింపజేసినవాడు
నవీన భారతదేశం పివి ఆవిష్కరించిన అజేయచిత్రపటం

భారతావనిలో మచ్చలేని మహానాయకుడిగా ఎదిగి
రాజకీయ విలువలకు పట్టం కట్టిన సేవాదురంధరుడు
ఆధునిక రాజకీయ మహాభారతంలో చాణక్యుడు పివి

కేంద్ర మానవవనరుల శాఖకు మానవతారంగులు అద్ది
విశిష్టమైన శోభను చేకూర్చిన అపార జ్ఞానసంపన్నుడు
మానవవనరులకు పునాది వేసిన మానవ వనరు పివి

విదేశాలదృష్టిలో మనదేశంపై ఉన్న అపోహలను తొలగించి
సరికొత్త దృక్పథాన్ని కలిగించిన నవ్య భారతదేశ నిర్మాత
సంస్కరణలను పూలరథాలుగా మార్చిన పథగామి పివి

నిరంతరం దేశం కోసం ఆలోచించే మేధావిగా ఉద్భవించి
ప్రపంచంలో భారతదేశాన్ని సమున్నతంగా నిలిపిన మేధ
ఆర్థిక ఉషస్సులను పంచిన తెలంగాణతేజం మన పివి

పొరుగుదేశాలతో బలమైన మైత్రీభావాన్ని నెలకొల్పడానికై
వాణిజ్య సంబంధాలను కొత్తపుంతలు తొక్కించిన ద్రష్ట
నూతన విదేశాంగ విధాయక తారకమంత్ర విధాత పివి

తూర్పు ఆసియా దేశాలతో సత్సంబంధాలకు నాందిపలికి
అంతర్జాతీయ విపణిలో దేశీయకీర్తిని ఇనుమడింపజేసాడు
సంపన్నదేశాలతో సమున్నతమైత్రి నెరపిన రాయబారి పివి

అన్ని వేళల్లోనూ మౌనాన్నే ఆశ్రయించి మౌనంగా ఉంటూ
మౌనదీక్షతోనే ప్రపంచ రాజకీయాలను జల్లెడ పట్టినవాడు
మౌనం మహామహో మేధావుల విలక్షణమైన జ్ఞానలక్షణం

రాజకీయాలకతీతంగా నాయకులందరి దృష్టిని ఆకర్షించి
భారతదేశ అభ్యున్నతికి పాటుపడిన నిజమైన దేశభక్తుడు
భవ్యదేశానికి దారిచూపిన సంస్కరణల స్ఫూర్తిప్రదాత పివి

ప్రపంచదేశాలతో విశేషమన్ననలను సఖ్యతగా పొందుతూ
విశ్వాసపాత్రుడిగా అందరికీ తలలో నాలుకైన విధేయుడు
విదేశాంగశాఖకు వన్నెలద్దిన మేధోసంపన్నుడు మన పివి

దేశంలో రాజకీయ నాయకత్వ అస్థిరత నెలకొన్నప్పుడు
దేశప్రధాని పదవిని చేపట్టి సుస్థిరతను సాధించిన ఘనుడు
సమర్థమైన నాయకత్వ పటిమకు అసలైన నిర్వచనం పివి

పివి మదిలో తొలచి వికసించిన సంస్కరణల బీజాలు
భారతదేశమంతటా పూసిన కల్పతరువుల క్షేత్రాలు
నేటి దేశాభివృద్ధికి ఆధారం పివి సంస్కరణ ఫలాలు

భారతదేశ సమున్నత అభివృద్ధిని ఆకాంక్షించిన నేతయై
దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన పరిపాలకుడు
ఆధునిక భారతదేశాన్ని అవతరింపజేసిన నిర్మాత పివి

విలువైన మాటలను తనదైన శైలిలో చేతలతో చూపించి
అఖిల భారతావనిని అబ్బురపరిచిన అపరచాణక్యుడు
దేశ రాజధానిలో తెలంగాణ వెలుగులు పంచిన ఠీవి పివి

విదేశాంగ విధానంలో సరికొత్త దిశానిర్దేశనం చేస్తూ
తన రాజనీతిజ్ఞతతో కొత్తపుంతలు తొక్కించిన విజ్ఞుడు
విశ్వయవనికపై భారతదేశాన్ని ఠీవిగా నిలిపినవాడు పివి

పల్లెల్లో మౌలిక వసతులు మెరుగుపడాలని సంకల్పించి
వాటి పురోగతి కోసం పరితపించిన సంక్షేమ క్రాంతదర్శి
గ్రామీణాభివృద్ధే సమగ్రమైన అభివృద్ధని కాంక్షించిన పివి

పంచాయతీరాజ్ సంస్థలన్నింటికీ చట్టబద్ధత కల్పించి
ఆర్థికాభివృద్ధి ప్రణాళికలను రూపొందించిన బీజాక్షరి
సామాజిక సంక్షేమానికి బాటలు వేసిన ద్రష్ట పివి

ప్రపంచ రాజకీయనాయకుల్లో విలక్షణనేతగా వినుతికెక్కి
రాజనీతిజ్ఞుడిగా పేరుగాంచిన అసమాన దురంధరుడు
రాజకీయాల్లో అణువణువునా తలపండిన నేత పివి

మానవీయ కోణంలో ఆర్థికసంస్కరణలకు శ్రీకారం చుట్టి
దేశాభివృద్ధికి నిరంతరం పాటుపడిన ప్రగతి కాముకుడు
సామాన్యప్రజలు అభివృద్ధి చెందాలన్నది పివి అభిమతం

వాణిజ్యసంబంధాల కోసం విదేశీపర్యటనలు అనేకం జరిపి
ఇరుదేశాల వ్యాపారానికి పరస్పరసహకారాన్ని కోరినవాడు
వివిధ రంగాలలో అభివృద్ధిని ఆకాంక్షించిన మార్గదర్శి పివి

విదేశీ పెట్టుబడులకు ఉదారంగానే స్వాగతం పలుకుతూ
నూతన పారిశ్రామిక విధానానికి నాంది పలికిన ధీరుడు
దేశ ఆర్థికాభివృద్ధికి గీటురాళ్ళు పివి సంస్కరణల ఫలాలు

దేశ రాజకీయాల్లో తాను నమ్మిన విలువలను ఆచరించి
భారత ప్రజాస్వామ్య రథానికి పట్టం కట్టిన రథసారథి
ఉన్నతమైన రాజకీయాల్లో ఉత్తమ రాజకీయుడు పివి

ప్రణాళికబద్ధమైన ప్రగతిమెట్లను అపలీలగా అధిరోహించి
అపూర్వమైన సంస్కరణలను చేపట్టి నడిపిన దార్శనికుడు
సమగ్రమైన సదాలోచనలకు కార్యకర్తృత్వం మన పివి

పాత్రికేయుడిగా తొలినాళ్ళలో కాకతీయ పత్రికను నడిపి
కథలు కథనాలు వ్యాసాలు రాసిన నవ యువకెరటం
తెలంగాణలో సామాజిక చైతన్యానికి మారుపేరు పివి

జీవిత కాలమంతా అతితక్కువగా మాట్లాడి మౌనభాషియై
తన చేతలతోనే దేశాన్ని నడిపించిన అపర గండరగండడు
దేశాన్ని ప్రగతిపథంలో నడిపిన గొప్ప రాజనీతిజ్ఞుడు పివి

వ్యవసాయిక పారిశ్రామిక రంగాలు దేశాభ్యున్నతికి
బంగారుబాటలు వేసే ఆదాయవనరులుగా భావించాడు
దేశాభివృద్ధికి వ్యవసాయ పారిశ్రామిక రెండు కళ్ళన్న పివి

అధికారాన్నెపుడూ తన స్వీయవైభవానికి వాడుకోకుండా
ప్రజాసంక్షేమమే పరమావధిగా తపించిన నిష్కామయోగి
ఆదర్శనాయకుడిగా అవనిలో వెలసిన కలువపువ్వు పివి

తెలుగును బోధనాభాషగా పరిపాలనాభాషగా మలచి
తెలుగుభాషా సౌందర్యాన్ని లోకానికి వెల్లడించినవాడు
తెలుగు భాషాభిమానానికి అసలుసిసలు నిర్వచనం పివి

రాజకీయ పదవుల కోసం ఏనాడూ పాకులాడకుండా
తన అసాధారణ ప్రతిభతోనే సంపాదించిన అగ్రజుడు
రాజకీయంలో నిస్వార్థంగా ఎదిగిన నిరుపమానశీలి పివి

భారత రాజ్యాంగాన్ని భారత సంవిధానం పేరుతో
సరళమైన శైలిలో తెలుగులోకి అనువదించిన దిట్ట
అనువాదకుడిగా సమున్నత శిఖరాయమానం పివి

విదేశాంగ వ్యూహాలను వ్యూహాత్మకంగా అనుసరించి
దేశరక్షణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించిన ధీశాలి
దేశభద్రతలో రాజీపడని అంతర్జాతీయ కీర్తిపతాక పివి

తెలంగాణ రాజకీయ మాగాణంలో విరిసిన పత్రహరితమై
దేశ రాజకీయాల్లో వెలుగులీనిన సహస్రాధిక కాంతిపుంజం
ప్రధానిగా దేశసేవలోనే తరించిన సంస్కరణాభిలాషి పివి

నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులో తేవాలని
నవోదయ పాఠశాలలకు అంకురార్పణ చేసిన రూపకర్త
మానవవనరుల మంత్రిగా నవీనవిద్యకు నాందీగీతం పివి

అసాధారణ గ్రహణశక్తితో అపారమైన ధారణపటిమతో
బహుభాషలను బహుచక్కగా వల్లెవేసిన మహా ఘనాపాఠి
స్వయంకృషికి నిరుపమానమైన నిదర్శనం మన పివి

పాత విదేశాంగ విధానాలను కొత్తపుంతల్లో తొక్కుతూ
దూరదృష్టితో శతృదేశాలను మిత్రదేశాలుగా మలిసిండు
విదేశీ సత్సంబంధాల సాధనకు పునాది వేసింది పివి

పంచెకట్టులో తెలుగుదనంతో నడకలో హుందాతనంతో
తెలుగు నేలన వెలుగులు నింపిన రాజకీయ శిఖరాగ్రం
ప్రపంచాన ప్రజ్ఞను చాటిన అసాధారణ పండితుడు పివి

రాజకీయ సాగరంలో తన మేధోబలంతో పయనించి
అత్యున్నత శిఖరాలకు చేరుకున్న అరుదైన వ్యక్తిత్వం
రాజకీయంలో అందరాని అందలం ఎక్కిన ఘనుడు పివి

సమున్నత పరిపాలనా జ్ఞానంతో అధ్యయన శీలత్వంతో
నిరంతరంగా సహస్రాధిక ఆలోచనలను చేసిన అవధాని
ప్రాపంచిక చింతనపరుడైన సామాజిక లోచనుడు పివి

విప్లవాత్మక సంస్కరణలతో ప్రగతిపథంలో పయనింపజేసి
దేశాన్ని అత్యున్నతస్థాయిలో నిలిపిన మేధోసంపన్నుడు
భారతదేశ రాజకీయ సామాజిక సంస్కరణాభిలాషి పివి

రాజకీయరంగంలో ఎన్నో ఉన్నతపదవులను అలంకరించి
వాటికే అలంకారికతను సాధించిన నిరాడంబరమైన జీవి
రాజకీయాల్లో రాజనీతిజ్ఞతకు పెట్టింది పేరు మన పివి

అంతర్జాతీయ ఒప్పందాలను అవలీలగానే కుదిర్చి
వాణిజ్యలావాదేవీలను సరళీకృతం చేసిన సంస్కర్త
నేటి సంస్కరణఫలాలు నాడు పివి నాటిన విత్తనాలు

రాజకీయ రణరంగంలో ఎన్నో కుట్రలను కుతంత్రాలను
చాకచక్యంతో అధిగమించి అందలం ఎక్కిన అజేయుడు
విలక్షణనేతగా వాసికెక్కిన అపరచాణక్యుడు మన పివి

తెలంగాణలో భూసంస్కరణల పర్వానికి పాదులు వేసి
నవసమాజ నిర్మాణానికి నడుంబిగించిన సంస్కరణశీలి
భూసంస్కరణలను అమలు చేసిన ధైర్యశాలి మన పివి

బాల్యంనుంచే ఉద్యమాల ప్రభావంతో పోరాటపటిమనెంచి
నాటి నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన గండరగండడు
ఉడుకురక్తంతో ధిక్కారస్వరాలను వినిపించిన ధీరుడు పివి

తెలంగాణ పలుకుబళ్ళను లోకోక్తులను ప్రయోగించి
మరాఠీ నవలను తెలుగువాళ్ళకు అందించిన సృజనకర్త
అపురూప అనుసృజన సుగంధం పివి "అబల జీవితం"

ఆయన ఆలోచనలు వేయిపడగలుగా పురివిప్పినందునే
భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా అలరారుతున్నది
నవీన భారతాన్ని ఆకాంక్షించిన భవిష్యత్తు ద్రష్ట మన పివి

బూర్జుల దగ్గర జూనియర్ న్యాయవాదిగా చేరుతూనే
రాజకీయ మెళకువలను నేర్చుకున్న నిత్య అభ్యాసి
సామాజిక మార్పుకోసం విశేష కృషిసల్పిన ధీశాలి పివి

రాజకీయంలో ఒంటరిపోరాటం చేసిన యోధుడుగా నిలిచి
దేశాభ్యున్నతికి అహరహం విశేషకృషి సలిపిన స్థితప్

వాక్సిన్ చెప్పులు

అర్ధరాత్రి అపరాత్రి లేనేలేదు
భయం రెక్కల సైరన్ గుండెల్లో
గుబులు పుట్టిస్తోంది
అంబులెన్స్ బెల్ మోత
వీధుల నిండా విరుచుకుపడుతుంది.

ఆసుపత్రిలో పడక నిద్రపోవడం లేదు
ఆక్సీజన్ సిలిండర్లకు ఊపిరాడడం లేదు
చూపుల తడి అయినవారికై ఎదురుచూస్తుంది
నిశబ్దం పిలువకున్నా పలుకుతుంది.

రేపు డేంజర బెల్స్ బ్లాక్, వైట్ ఏ రంగు అద్దుకొని
ఎమర్జెన్సీ వెలుగుల్ని చీకటి చేస్తాయో...!
ఆరని అగ్ని గుండాల్ని వెలిగిస్తాయో...!

ప్రజలా! పాలకులా! ప్రకృతి విలయతాండవమా!
ఎవరి నిర్లక్ష్య క్షణాలు గంటకొట్టాయో...
మరణ ధృవపత్రాలు ఎగిసిపడుతున్నాయి
భూగోళపు శ్మశానవాటికల నిశీధిలో...

ఇప్పుడు ప్రపంచమంతా వాక్సిన్ చెప్పులు
తొడుక్కొని, శానిటైజర్ అత్తర్ చల్లుకుని
మాస్క్ చిరునవ్వు మొఖాన తగిలించుకుని
కరోనా వేవ్స్ చీకట్లో
వెన్నెల అడుగులు వెయ్యాల్సిందే.

-శ్రీతరం బింగి శ్రీకాంత్
7893613015

ఉమ్మడి కుటుంబం

ఉమ్మడి కుటుంబం
నిండు కుండ!
అది ఎప్పుడు తొనకదు!

అది ఒక వటవృక్షం
కథల కణాచి
ఇప్పుడన్నీ బోన్సాయ్ మొక్కలే !

చెట్లు ఒరిగి పోతున్నవి!
పక్షులు ఆదారానికి దూరంగా
పంజరం బ్రతుకు బ్రతుకుతున్నవి !

అదేమిటో వింత!
అన్నీ కరువై తెరమరుగైనయి!
అన్నిటికీ ప్రత్యేక దినాలు!

పట్నాలు లేవు అన్నీ పల్లెలే!
పాలి వలసలే పట్నాలు!
పల్లె వేరు-పట్నం తేరు!

పట్నం వేర్లన్నీ పల్లెల్లో!
పల్లె కనిపించదుపట్నం మెరుస్తది!
అందుకే అందరుభ్రమిస్తరు!

ఉమ్మడి కుటుంబం ఓపుస్తకం!
బంధాల అనుబంధాల సమస్తం
తెరుస్తే మరువలేని జ్ఞాపకం!

అది ఒక క్షీరసాగరం!
ఉమ్మడిగ కలిసి చిలికితేనే
అమృతం పుడుతుంది!

ఉమ్మడి కుటుంబం
ఇప్పుడు పిల్లల పుస్తకంలో
చదువే కథ అయింది!

-పి.బక్కారెడ్డి
9705315250

అక్షర సూరీడు అంబేద్కర్

అక్షరాలు నేర్చుకొని బతుకు..
అందంగ తీర్చి దిద్దుకొనుము..
అజ్ఞానమనే నిశిలో వుండి..
ఆగమాగము కాబోకుము..

అక్షరాల విలువ తెలుసుకొని..
అడుగులనటువైపు వేయుము.
అంధకారమును చీల్చుకొని..
వెలుతురువై ప్రకాశించుము.

ఎన్నో లక్షల అక్షరాలను..
తన మస్తిష్కమున నింపుకొనెను..
అఖండ భారతావని నుదుట..
ఎర్రని సింధూరమై మెరిసెను..

అక్షరాలనాయుధముగ మలిచి..
ఉద్యమాలనెన్నో చేసెను..
అక్షరాలతో జవాబు చెప్పి..
ఆత్మీయులుగా మలుచుకొనెను..

పరిపాలనకనువైనవి కూర్చి..
రాజ్యాంగమును రచియించెను..
తన ప్రతిభ పాటవాలు తెలిసి..
ప్రపంచ మేధావని పిలిచెను..

-పసుల.శంకర్
9542181301

నానీలు

సర్దుకుపోదాం
రండి!
సంసార నావ
సాఫీగా సాగేందుకొరకై!!

అలకలు
కులుకులు..!
అన్నీ అందాల విందులే
సర్దుకుపోయే మనసుంటే...!!

ఎవ్వరికీ దక్కని
కుక్కల కోట్లాటే...!
సర్దుబాటు తత్వం
లేకుంటే ...!!

కొంచెంలో
తలా కొంచెం పంపకం!
అమ్మానాన్నలు నేర్పిన
సర్దుబాటు పాఠాలు!!

కాకెంగిల్లా
మధురమైనవే...!
ఒక్కటే అందరం పంచుకు తిన్న
బాల్య స్మృతి ...!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

నా పల్లె లోకంలో ..

వేలాడే ఇరుకు గదుల నుంచీ
రెపరెపలాడే చల్లని గాలిలోకి
ఈ ప్రయాణం ఉరికింది .
ఔరా ।
ఈ వేసవి తోటల చూపులు
ఊపిరి వాకిలిని శుభ్ర పరుస్తున్నాయి .
కాలం రెప్పల కిలకిలల్లో
ఎంచక్కా పల్లె మారింది.
నిశ్శబ్ద మౌన ప్రపంచం లో
రూపు రేఖలు కొత్త చిగురులు తొడిగాయి .
పండిన పంటలు
దారెంట పలకరిస్తున్నాయి .
జొన్న కంకులు ఎత్తుతూ కొందరు
ఆవులకు గడ్డిపెడుతూ కొందరు
మామిడి తోట కాస్తూ కొందరు
ఇక్కడ చిరు నవ్వుల తోటను చూసాను .
కాసింత పల్లె గాలికి వికశించాను
ప్రయాణాలు ఎన్ని చేసినా
దూరాలు ఎన్ని మారినా
చెదరని స్వప్నంలా నా పల్లె నిలిచింది.
ఇంటిలో కూచుంటే చాలు
చుట్టూ కాకుల కూతలు
పిచ్చుకల కిచకిచలు
ఆప్యాంగా వాలుతుంటాయి.
తడితడిగా మనసుని కుదుపుతుంటాయి .
పల్లె తాకిన ప్రపంచంలో
మరో కొత్త అనుభవం పరచుకుంటుంది .
ఈ చల్లని పల్లె గాలుల్లో తడిస్తే చాలు
కోల్పోయినవి
అనుభూతి చెందుతున్నట్లు ఉంటుంది .

-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

మానసిక బలాడ్యులు..

ఆత్మవిశ్వాస పెంపుకై
అంతర్గత అవయవాల
అద్భుత శక్తి కోసం
అందరం చేయాలి
యోగాసనాలు...

ఊపిరితిత్తులకు
ఊపిరి అందించి
ఊపునివ్వాలంటే
ప్రాణాలు వెలిగించాలంటే
ప్రాణాయామలు చేయాలి..

మనసుల నిండా
మనోధైర్యం నింపి
మనఃశ్శాంతిని పెంచాలంటే
మనుషులందరూ
ధ్యాన ముద్రలు వేయాలి..

అనవసర వ్యాపకాలు కాదు
అవసరమైన వ్యాయామాలతో
అపురూపమైన శరీరాలను
శక్తివంతం చేసుకొని
సత్తా ఏందో మనమే చూపాలి..

రోగాల బారిన పడి
రోగులవడం కాదు
రోగనిరోదక శక్తిని పెంచే
అన్ని తలుపులు తెరిచి
మానసిక బలాడ్యులు కావాలి
శారీరక దారుడ్యులు అవ్వాలి
కరోనా ముత్తాతొచ్చినా
కరిగి అరగాల్సిందే
మన శక్తికీ.. మానసిక శక్తికీ...

-కొక్కె రాములు
9985341992

దూరాన్ని పాటిద్దాం

ఇది జలకాలాడే
సమయం కాదు,
ముద్దూ, ముచ్చట్లు
ఆడుకునే సమయం
అంతకన్నా కాదు,
కరోనా మహమ్మారి
దోబూచులాడుతూ
కాచుకోనుంది సుమా!
తస్మాత్ జాగ్రత్త,
ఆరడుగుల దూరం
పాటించండి,
కరోనా దుర్గునీదాన్ని
భరించలేక మాస్కులు
తొడుక్కున్నామని
మరువకండి,
లాక్ డౌన్లతో విసిగి
వేసారిపోతున్నామని
విసిగిపోకండి,
శుచి, శుభ్రతలు జన్మ
హక్కుగా భావించి
కంటిన్యూ చేయండి,
రానున్న కాలంలో
మంచికాలం రానుంది,
నీవు పాటించిన
ఆమడదూరమే
నీకు శ్రీరామ రక్ష

-రాయవరపు సరస్వతి
7989665525

ఇంకెన్నాళ్లో...?

ఎక్కడి నుండి ఊడి పడ్డదో కానీ
ఈ మాయదారి మహమ్మారి
ఊళ్లకు ఊళ్లే మింగేస్తుంది
వైకుంఠ దామాలను కిక్కిర్సెలా
శవాల దిబ్బలను కాల్చేస్తుంది
కొత్త కొత్త వేరియంట్లు
పుట్టుకొస్తున్నయి
తరంగాల మీద తరంగాలు
దేహాలపై ఎగిసిపడుతున్నయి
దేశమంతా రావణకాష్ఠంలా
మంటల్లో తగలబడిపోతుంది
నిమిషానికొకరు జీవిదుస్తనేవున్నరు
శవాల గదులు నిండిపోతూనేవున్నయ్
ఆక్సిజన్ లేక సరైన మందులు దొరకక
అంతటా అల్లకల్లోలమవుతునేవుంది
పట్టించుకునే నాధుడే లేడని
జనం ఆక్రోశం వెళ్లగక్కుతునేవున్నరు
మేమున్నాము మీకేం కాదని
భరోసా కలిగించే నాయకులేరి?
విషం కక్కుతున్న కరోనాకు
విరుగుడిచ్చేదెవరు..?
అందని ద్రాక్షలా మారిన వైద్యాన్ని
అక్కున చేర్చేదేవరో..!
ఈ ఘోరకలిని చూసిన
పాలకులకు కనువిప్పు కలిగేదెప్పుడో
కరోనా దూకుడుకు
కళ్లెం వేయాల్సిందెన్నడో
రోదనలతో అల్లాడుతున్న
భారతావని ప్రశాంతంగా బతికేదెప్పుడో
ఇంకెన్నాళ్లో... ఎదురుచూపులు...?

-కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

శ్రమే జీవిత పరమార్థం

అనాయాస ప్రాప్తము గొప్పదనమెరుగదు,
అనాయాస భుక్తము వంటికంటుటెరుగదు.
చెమటోడ్చిన దేహమే నిర్మిస్తుంది
గృహాన్నైనా, దేశాన్నైనా.
మొలకెత్తినప్పటి నుండి
అంగుళం కూడా కదలని చెట్టు
కంటికి కనిపించకపోయినా
అంతర్గతంగా నిరంతరం శ్రమిస్తూ
పూవో, కాయో కాయించి పదిమంది ఆకలి తీరుస్తుంది.
పరిమాణం చిన్నదయినా
చిట్టి చీమ రోజంతా శ్రమిస్తూ
తనకు నాలుగింతల భారం మోస్తూ
పట్టు వదలని విక్రమార్కుడై
ఆహార సంగ్రహణ చేస్తుంది.
కూర్చుని తింటే కొండలయినా కరుగుతాయి,
కండలరిగించకుండా తినే తిండి
కాయాన్ని భారం చేస్తుంది.
శ్రమకోర్చిన కాయమే హాయిగా నిద్రిస్తుంది.
శ్రమించని దేహం నిద్రకు రోదిస్తుంది.
శ్రమఫలమే తృప్తినిస్తుంది.
శ్రమే జీవిత పరమార్థం.

-సొదరి మోహన్ గౌడ్
9440464503

రెక్కలు

ప్రపంచాన్ని
జయించినవాడైన
ప్రకృతి ముందు
నిస్సహాయుడే.
అజేయి
ప్రకృతి.

-పి. శ్రీనివాస్ గౌడ్
9949429449

మేజిక్

పాపం నువ్వు మాత్రం ఏంచేస్తావులే
మా ముఖాలు మాకే బోర్ కొట్టేశాయి
అర్జంటుగా మాకో కొత్త ముఖం కావాలి

మాదికాని ముఖమైనా ఫర్వాలేదు
అత్యంత ఆకర్షణీయంగావుండాలి సుమా

అందుకే నీకు ముఖాలు మార్చే పనినిచ్చాం
ముఖాలనందంగా తీర్చిదిద్దే మహాగనినిచ్చాం

అసలందమనగానేమి?
అందాన్ని నిర్వచించే కొలమానాలేమి?

నువ్వు చెక్కిన అనేకానేక నగిషీల మధ్య
మాదంటూ చిన్న పోలికున్నా చాలు
తెగ ఆశ్చర్యపోతూ మురిసిముక్కలవుతాం
మాదికాని ముఖాన్ని చూసుకుని
మేమే మురిసిపోవటం ఎంతవిషాదమోకదా

పాపం నువ్వు మాత్రం ఏం చేస్తావులే
మా అందాలకలకో రూపాన్నిస్తూ పోతావు

అయినా ఇపుడెవరి ముఖం ఎవరిది గనుక
అన్నీ పరాయి ముఖాలు, పరాధీన ముఖాలు

ఇన్ని రంగుల మేకప్ ముఖాల మధ్య
నాదైన తేటముఖంకోసమే నా వెతుకులాట
ఓ నా ప్రియమైన చిత్రకారుడా!

పంట చేలో రైతు ఆకుపచ్చని ముఖం,
పరిశ్రమలో కార్మికుడి స్వేద ముఖం
మల్లెపూవులాంటి పిల్లల ముఖం,
పసి పాపకు పాలిస్తున్న తల్లి ముఖం
నాదైన ముఖం నాకు చిత్రించిస్తావా?

మేకప్ తో మా ముఖాలు మార్చినట్లు
మామనసులు మార్చే మేజిక్కేదైనావుంటే సెలవిస్తావా?

- చిత్తలూరి
9133832246

తెలుగు కథకు అసలైన చిరునామా కారా మాష్టారు

కాలం వెళ్ళుతూ..వెళ్ళుతూ..కొందరిని తన గర్భంలోకి లాక్కుపోతుంది. మనకెంతో ఆత్మీయులైన వాళ్ళను, మనకెంతో నచ్చిన వాళ్ళను తీసుకొనిపోయినప్పుడు కాలంపై ఆగ్రహిస్తాము. ఎవ్వరు శాశ్వతం కాదని తెలిసిన కూడా మనలో దిగులు మేఘాలు కమ్ముకుంటాయి. కథా సాహిత్యానికే తన జీవితాన్ని అంకితం చేసిన కారా మాష్టారు సాహితీలోకాన్ని విడిచి పరలోకానికి చేరుకున్నారని అనుకోవడానికి దు:ఖం కలిగించిన వాస్తవం మాత్రం అదేకదా. మనకోసం ఆయన వదిలిపోయిన కథలు మనల్ని పలకరిస్తూనే ఉంటాయి. ఒక ఆధునిక శతాబ్ది మానవ జీవితాల్ని ప్రత్యక్షంగా చూస్తూనే, మానవీయమైన కోణంలో రచనలు చేసి, అసంఖ్యామైన అభిమానులను చూరగొన్న భారతీయ కథా సాహితీవేత్త కారా మాష్టారు గారు.

విశ్వ విఖ్యాత కథారచయిత కాళీపట్నం రామారావు (1924-2021) గారు 'కారా మాష్టారు' గా తెలుగు కథాసాహిత్యంలో పేరుపొందినవారు. ఆయన ఉపాధ్యాయులుగా, సాహితీ విమర్శకులుగా, ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన తెలుగు కథకు అసలైన చిరునామా కథానిలయం వ్యవస్థాపకులుగా, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును అందుకున్నవారిగా మనందరికి సుపరిచితులు. దశబ్దాలుగా కారా మాష్టారు గారి కథలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నాయి. ఆయన కథలు వాస్తవ జీవితాలకు ప్రతినిధులు. ఆయన వాసిలో కొన్ని కథలే రాసినప్పటికి అవి సామాజిక రంగాల్లోని అనేక అంశాల్లోని వైరుధ్యాలను వెలికిలోకి తెచ్చాయి. ఆ కథలు ఉద్యమచైతన్యాన్ని కలిగించాయనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.ఆయన రాసిన కథలు సామాన్యుల వెతలకు నిలువుటద్దాలు. సామాజిక పోరాటాలతో మమేకమైన రచయిత. సామాన్య ప్రజల జీవితాల్లో మార్పులు రావాలని ఆకాంక్షించిన దార్శనికులు.

తెలుగు మాట్లాడే మనకు ఇప్పుడు రెండు రాష్ట్రాలున్నాయి. తెలుగు సాహిత్యాన్ని కూడా విభజించుకునే చదువుకుంటున్నాము. ప్రాంతంతో సంబంధం లేకుండా అందరి మనసులలో చోటు సంపాదించుకున్న సాహితీ సృజనకారుడు కారా మాష్టారు గారు. ఆయన కథలు మూడు దశాబ్దాలుగా నేను చదువుతూనే ఉన్నాను. ఆయన కథలంటే ఒక ప్రత్యేకమైన అభిమానం. గురజాడ, చాగంటి సోమయాజులు, రావిశాస్త్రి, గంటేడు గౌరినాయుడు, వట్టికోట ఆళ్వారుస్వామి,కోకు, బోయ జంగయ్య, ధాశరథి రంగాచార్య,

ప్రాంతంతో సంబంధం లేకుండా అందరి మనసులలో చోటు సంపాదించుకున్న సాహితీ సృజనకారుడు కారా మాష్టారు.

శ్రీపాద సుబ్రాహ్మణ్యశాస్త్రి, అల్లం రాజయ్య, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య కథలతో పాటుగానే కాళీపట్నం రామారావు గారి కథలను కూడా ఇష్టంగా చదవుకోవడం నాకు అలవాటు.

1924 నవంబరు 9న లావేరు మండలంలోని మురపాక గ్రామంలో జన్మించారు. ఆయన పూర్తి పేరు కాళీపట్నం వెంకట సూర్యరామ సుబ్రమణ్యేశ్వరరావు. పండితులకు, పామరులకు కూడా ఆయన కథలు అర్థమయ్యే విధంగా రచించారు. 1948 జూన్‌లో విశాఖ సెయింట్ ఆంథోని పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడిగా చేరారు. పాఠాలను బోధించడంతో పాటుగా కథలను కూడా రాసారు. ఆయన 1979లో పదవీ విరమణ పొందిన కూడా సాహిత్యానికి మాత్రం విశ్రాంతి నివ్వలేదు. ఆయన మొత్తం కథలు యాభై వరకు ఉంటాయి. వాటిలోనే మనకు కావల్సినంత జీవితాల్ని పొందుపర్చారు. 'భాయిజాన్, వెళ్లిపోయింది, వెనుక చూపు నిజమే, నే నేందుకు వ్రాసాను వ్యాసం, తీర్పు, ఇల్లు, యజ్ఞం, మహాదాశీర్వచనం, శాంతి, చావు, జీవధార,కుట్ర, వీరుడు-మహావీరుడు, భయం' కథలు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చాయి. విప్లవ రచయితల సంఘంలో పనిచేస్తున్న రోజుల్లోనే 1971 జనవరి 31న విశాఖలో మహాకవి శ్రీశ్రీ 'యజ్ఞం' కథల సంపుటిని ఆవిష్కరించారు.

1996లో 'యజ్ఞంతో తొమ్మిది కథలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించారు. అవార్డుతో వచ్చిన డబ్బులతో ఆయన శ్రీకాకుళంలో 22 ఫిబ్రవరి 1997న తెలుగు కథ కోసం 'కథానిలయం'ను ఏర్పాటు చేశారు. 1910లో వెలువడిన గురజాడ కథ నుండి ఇప్పటి తరం కథకుల కథల వరకు సమీకరించారు. తెలుగు కథల వివరాలు కావాలంటే అక్కడికి వెళ్ళితే చాలు లభిస్తాయి. ఆయన పూర్తి జీవితాన్ని ఈ పనికే అంకితం చేసిన ఆచరణవాది. అందుకే తెలుగు వారి గుండెల్లో సుస్థిరమైన స్థానాన్ని పొందారు. సామాజిక సమస్యలు, శ్రీకాకుళం భూ పోరాటాలు, ఆర్థికపరమైన అసమానతలు, కుటుంబాల మధ్యనున్న సంబంధాలను తనదైన కోణం నుండి పరిశీలన చేసి రాసిన కథలు అనేక చర్చలకు పట్టుగొమ్మలైనాయి.

ఆయన కథలు రాయడంతో పాటుగా కథా రచయితలుగా రాణించాలనుకునే వాళ్ళకోసం 'కథన రీతులు' అనే పుస్తకంలో కథన పద్ధతులను వివరించారు. కథా వస్తువును ఎంపిక చేసుకోవడానికి చేయాల్సిన కృషిని ఇలా వివరించారు. 'హింసలు, కష్టాలు అన్నవి మనమూ, మనవాళ్ళు అనుభవించేవి కావు. వేధింపులు, అవమానాలు,అపహాస్యాలు చదువుకునే ఆడపిల్లలకి మాత్రమే పరిమితాలు కావు. సినిమాహాళ్ళ దగ్గర, శ్రీరామనవమి వంటి సంబరాల్లో దేవాలయాల దగ్గర, దివ్యక్షేత్రాలలో, తీర్థాలు జరిగే చోట,స్నానఘట్టాలలో అన్ని వయసుల వాళ్ళ, అన్ని తరగతుల వాళ్ళు అల్లర్లలకూ, ఆగడాలకు గురి



అవుతారు. పసిగుడ్డును వదిలి పనిలోకి వెళ్ళే సమస్య ఉద్యోగస్థులైన దంపతులకే పరిమితం కాదు. రోడ్డుపని, మట్టిపని, రాతిపని చేసే వేలాది కూలి దంపతులకీ, పాచిపని, వంటపని చేసి గడుపుకునే ఎందరో పేద ఇల్లాళ్ళకీ కూడా అది హృదయశల్యమైన సమస్యే. ఇంటిపని, బయటిపనితో వాళ్ళు నలిగిపోతారు. ఆకలీ, దాని బాధకు తట్టుకోలేక ఒళ్ళమ్ముకోవడం వయసులో ఉండే ఆడవాళ్ళకే పరిమితం కావు. అమ్ముకోవడానికి అందాలు, వయసులు లేని వాళ్ళు, ఉన్నా అందుకు మనసంగీకరించక హింసలు భరించేవారు ఇతరత్రా చాలమంది ఉన్నారు'. ఇంకా చాల విషయాలను ఈ వ్యాసాల్లో ప్రస్తావించారు. బాధల్లో ఉన్న వాళ్ళ జీవితాల సమస్యలను కొత్తదనంలో వ్యక్తీకరించినప్పుడే ఆ కథలు ప్రజలకు చేరువ కాగలవని అభిప్రాయపడినారు.

కారా మాష్టారు గారు సమాజంలోని అట్టడుగు ప్రజల జీవితాల కష్టాలను, కన్నీళ్ళను, జీవన పోరాటాలను, సంఘర్షణలను, సంవేదనలను సునిశితంగా పరిశీలన చేసి గొప్ప కథలుగా వాటిని మలిచారు. కాలం గడుస్తున్న కూడా వాటి విలువ ఏమాత్రం కూడా తగ్గలేదు. 'యజ్ఞం' కథ వెలువడి ఐదు దశబ్దాలు అవుతున్న కూడా ఎక్కడో ఒక చోట దాని గురించి మాట్లాడుతూనే ఉంటారు. గ్రామాల అభివృద్ధి చెందడం అవసరమే. ఆ అభివృద్ధి ముసుగులో జీవనాధారం కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేది ఎవరు? నాటి వ్యవస్థ అయినా నేటి వ్యవస్థ అయినా పాలకులు మారవచ్చు కానీ సమస్యలు అలానే ఉన్నాయి.

సుందరపాలెం వంటి గ్రామాలు ఇప్పటికీ కూడా ఉన్నాయి. గోపన్న లాంటి షావుకారులు, శ్రీరాములు నాయుడు లాంటి ఆదర్శ మానవులు, అప్పల్రాముడు వంటి సన్నకారు రైతులు, అప్పుల తగాధాలు, పంచాయితీలు, తీర్పులు, నిరసనలు అన్ని జరుగుతూనే ఉన్నాయి. గోపన్న షావుకారు దగ్గర అప్పల్రాముడు చేసిన అప్పుకు తన భూమి అంత కరుగుతున్న కూడా తీరలేదు. ఏండ్లు గడుస్తున్న పంటను అతనికే ఇస్తున్న కూడా అప్పు పూర్తిగా చెల్లుబాటు కాదు. ఊరికి ఉపకారం చేద్దామనే ఆశయంతో రోడ్డు వేయించి, బడి కట్టించిన ఆదర్శ యువకుడు శ్రీరాములు నాయుడు పంచాయితీ పెద్ద. ఆ ఊరి దేవాలయం ముందు ఒక మండపాన్ని నిర్మిస్తారు. అప్పుడు ఒక ప్రతిజ్ఞ చేస్తారు. 'ఇక నుండి ఈ మండపమే మన న్యాయమండపం. యీ మండపమున్నంత కాలం న్యాయం కోసం మనం పరాయి పూళ్ళకు పోరాదు. ఏనాడైనా యీ మండపంలో న్యాయం దొరక్క, దాని కోసం యీ పూరివాడు పై పూరుకు పోతాడో, ఆనాడు యీ కట్టిన మన యీ చేతులతో దీన్ని కూల్చివేత్తాం' అనే కట్టుబాటును నిర్ణయించుకుంటారు.

వీళ్ళ పంచాయితీని చూడటానికి పక్క గ్రామాల ప్రజలు కూడా వస్తారు. అప్పల్రాముడు పంచాయితీ సభ్యుడు కూడా. అతనికి అనుకూలంగా తీర్పు వస్తుందని అనుకుంటారు. షావుకారుకు బాకీ వున్నావు కాబట్టి కట్టుమని అడుగుతారు. ఆయన పూర్వపరాలు పరిశీలన చేయకుండానే తీర్పు చెప్పడంతో అప్పల్రాముడు తన జీవితకథను మొత్తం ఆవేదన భరితంగా వివరిస్తాడు. తనకున్న కొద్ది భూమిని షావుకారు పేరుమీదికి మారుస్తారు. తన నాలుగో కొడుకు సీతారాముడు తండ్రితో ఏకీభవించకుండా కోర్టుకు పోదాము అంటాడు. ఊరి కట్టుబాటుకు కట్టుబడి బతికినంత కాలం షావుకారి ఋణం తీర్చుకుంటానంటాడు తండ్రి. కోపంతో సీతారాముడు సంతకం చేయకుండా ఇంటికి పోయి తన కొడుకును చంపి గోనె సంచిలో పెట్టుకుని ఆ పంచాయితి దగ్గరికి వస్తాడు. 'నువ్వు మమ్మల్ని సచ్చిందాక బానిస బతుకు బతుమన్నావు. నీకు తెల్సపుడు సరే. ఇప్పుడు తెలిసీ నువ్వదేమాట లంటున్నావు. నా కదిట్టం లేదు. నా కొడుకు మీద నా కాశెక్కువ. నా కొడుకు బానిస బతుకు బతకడు. అందుకే పరుగెత్తుకెల్లాను. ఒరేయ్ ఓరె కొడుకా, నువు బానిస బతుకు బతుకుతావా, నత్తావా? యీయాల సత్తె రేపటికి రెండు. రా నిన్ను సంపేత్తా నన్నాను. ఆడు పరుగెత్తికొచ్చినాడు.నాను పటక్కన నరికేసినాను. ఆ కత్తటు బారేసి యిటు లగెత్తుకొచ్చినాను. నువ్వు గొప్పో నేగొప్పో నువ్వే సెప్పు'. హృదయవిదారకమైన విషయమిది. వ్యవస్థలోని కర్కశత్వాన్ని బలంగా చిత్రీకరించిన ఈ కథను సినిమాగా కూడా తీశారు. తెలుగు సాహిత్యంలో ఈ కథ మీద విస్తృతమైన వాదోపవాదాలు కూడా జరిగాయి.అవి పుస్తకాలుగా కూడా వెలువడినవి. కాలంతో పాటు ప్రయాణించే ఈ కథను అందించిన కారా మాష్టారు గారి రచనా పటిమను గూర్చి ఎంతగా వివరించిన తక్కువే. ప్రజాస్వామ్య దేశంలో జరుగుతున్న ఆదర్శవంతమైన పాలనపైన సంధించిన శరాలు ఆయన సృష్టించిన కథల్లోని పాత్రలు.

మధ్యతరగతి కుటుంబ జీవితాల్లో వచ్చిన మార్పులను 'సంకల్పం' కథ ద్వారా వివరించారు. సుభద్రమ్మ తన అత్తగారు ఉన్న విధానం, తన కోడలు శకుంతల తనతో ప్రవర్తిస్తున్న విధానం, ఆమెకు వచ్చిన కోడలు స్వభావంతో ఆమె మానసికంగా పడుతున్న వేదనను సమర్థవంతంగా వివరించారు. ఆర్థికపరమైన ఇబ్బందులు లేని కుటుంబమే కావచ్చు కానీ తల్లిదండ్రులకు పిల్లలు ఇచ్చే ప్రాధాన్యతలు ఎట్లా తగ్గిపోతున్నాయో వివరించిన కథ. భర్త బతికున్న రోజుల్లో కాశీకి వెళ్ళదామనుకున్న ప్రతిసారి అడ్డంకులు రావడం ఆగిపోవడం జరుగుతుంది. చివరికి ఆయన అస్థికలతో సుభద్రమ్మ పెద్దకొడుకు, కోడలుతో కాశీకి వెళ్ళుతుంది. గత జ్ఞాపకాలను మనసం చేసుకుంటు మానసికమైన కుంగుబాటు ఆలోచనలతోనే గడుపుతుంది. ఆమెకు కాశీకి వెళ్ళడం పెద్దగా ఇష్టం ఉండదు. పిల్లల బలవంతంతో బయలుదేరుతుంది. కొడుకు, కోడలు, ఆమెకు మధ్యన జరిగిన సంభాషణతో ఆమె మరింత కలత చెందుతుంది. పెద్ద కొడుకు తన దగ్గరనే ఉండాలని అమ్మను అడుగుతాడు. అలవాటైన ఊరిలో ఉన్న కొడుకు దగ్గర ఉండాల? పట్టణంలో ఉన్న కొడుకు దగ్గర ఉండాల? అనే సందిగ్ధ ఆలోచనలతో ఎవరి దగ్గర ఉండకుండ గంగానదిలోనే మునుగుదామనుకుంటుంది. చివరిక్షణంలో రక్షింపబడుతుంది. గడిచిన జీవితంలోని పద్ధతులను విడువలేనితనమొకవైపు లాగుతుండగా. కొత్త పద్ధతులకు, మార్పులకు అలవాటుపడలేని జీవితంతో సతమతమవుతున్న పెద్దల జీవితాలను గూర్చి వివరించిన కథనమిది.

పట్టణాలలోని, నగరాలలోని శివారు ప్రాంతాల్లో నివసించే సామాన్య ప్రజల నీటి సమస్యలను వ్యక్తం చేసిన కథ 'జీవధార'. యాభై గుడిసెలుండె చోట ఒకటే కొళాయి ఉంటుంది. ఆ నీటిధార కూడా కొద్దిసేపు మాత్రమే వస్తుంది. వాళ్ళకు నీళ్ళు కావాలంటే అక్కడ వెలిసిన ధనవంతుల భవంతుల దగ్గరికి వెళ్ళి ప్రాధేయపడుతూ అడుక్కోవాలి. వాళ్ళ చీవాట్లను భరించాలి. మాటలను భరించాలి. అట్లాంటి జీవితాలను ఒక ఉయదం పూట జరిగిన సన్నివేశంతోనే మొత్తం కథను చిత్రీకరిస్తారు. అమ్మాజీ, సత్యవతి, తవిటమ్మల మధ్యన జరిగే సంభాషణలతో పాటు అక్కడి వారి బతుకుల దీనస్థితిని కళ్ళకుకట్టినట్టు వర్ణిస్తారు. భవంతిలో ఉండే పిల్లలు వీళ్ళను చూసి హేళనగా నవ్వుకోవడాలు, వీళ్ళకు కనీస అవసరాలు తీరడానికి నీళ్ళులేని అవస్థలను, ఆ భవంతుల తోటల్లో పళ్ళు, కాయలు ఇవ్వలేని మొక్కల కోసం గంటల తరబడి నీళ్ళను వాడుకోవడం చూసి బాధపడుతుంటారు. నీళ్ళు కావాలని వస్తే కుక్కలను మీదికి ఒదులుతామంటారు. ఆ గొడవను తీర్చడానికి మధ్యవర్తిగా మరొకరు వస్తారు. పబ్లిక్ కొళాయి దగ్గర నీళ్ళు ఆగిపోవడంతో అందరు భవంతి దగ్గరికే చేరుతారు. మాటమాట అనుకుంటారు. చివరికి తలో బిందెడు తీసుకోవాలని భవంతిలో ఉన్న ఆమె ఒప్పుకోవడంతో అన్ని కోపాలను పక్కనబెట్టి నీళ్ళను పట్టుకుపోతారు. అక్కడితో ఈ కథ ఆగిపోదు. ఇవన్ని వాళ్ళకు నిత్యకృత్యమే. ఈ కథలోని ముగింపు మాటలను చదివితే ఆ దు:ఖం మనకు కూడా తెలుస్తుంది. 'కసురుకున్నా విసుక్కున్నా కుక్కల్నీ పోలీసుల్నీ చూపి భయపెట్టినా, లేని వాళ్ళు కలవారినిబ్బంది పెట్టక వల్లకాదు. ఇద్దరు ముగ్గురై, ముగ్గురు పదిమందిలో చేరి అవతలి పేటలోని ఓ రెండతస్థుల భవనపు సింహద్వారం వద్ద చేరేరు ఆడవాళ్ళు. కథ మళ్ళా మొదలు- వాళ్ళు గేటు తియ్యరు. వీళ్ళు గేటు వదల్రు. ఇలా కడవరకూ..'

చాలా భిన్నమైన కథలు రాసిన ఆయన పిల్లల పెంపకం మీద 'రేవతి నుంచి..తల్లుల ప్రేమ' అనే ఒక కథను రచించారు. ఇదొక సీత అనే మిత్రులరాలికి రేవతి అనే మిత్రురాలు రాసిన లేఖ. తన ఇంటి పక్కన నిత్యం జరిగే సంఘటనల మీద ఆమె అభిప్రాయాలను రాసింది. చిన్న పిల్లల మీద తల్లుల హింసపై సున్నితంగా చెప్పిన కథ ఇది. చిన్న కథనే కావచ్చు కాని పిల్లల పెంపకంపైన సూటిగా ప్రశ్నించిన కథ ఇది. నా పిల్లలను నేను ఏమైన చేసుకుంటాను అడగటానికి మీరెవరు అనుకునే వారికి చెంపదెబ్బ వంటి కథ ఇది. రేవతి రాసిన వాక్యాలను చదివితే మన కళ్ళు కూడా వర్షిస్తాయి.'బిడ్డ ఆనందంగా పాడుకుంటూ వుంటే నిద్రాభంగమయిందంటూ వుగ్రురాలు అయ్యే తల్లులు-బిడ్డ ఆనందం కోసరం పగటి నిద్ర-పాడునిద్ర-త్యాగం చెయ్యలేకపోయిన తల్లులు-బిడ్డ అర్ధరాత్రప్పుడు ఆకలయ్యో, చీమకుట్టి ఏడిస్తే, కారణం ఏమిటో

ఆయన కథలు రాయడంతో పాటుగా కథా రచయితలుగా రాణించాలనుకునే వాళ్ళకోసం 'కథన రీతులు' అనే పుస్తకంలో కథన పద్ధతులను వివరించారు.

తెలుసుకోవడానికయినా ప్రయత్నించకుండా, కాల్చుకు తింటోంది అంటూ విసుక్కునే తల్లులు. వీరికట బిడ్డల మీద ప్రేమనట!! ఆ



తెలుగు సింహం వెంకట నరసింహం

అన్యాయంపై, అవినీతిపై సింహగర్జన చేసిన మన తెలుగు సింహమే పాములపర్తి వెంకట నరసింహారావు పార్లమెంటులో సంఖ్యాబలంలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తికాలం ఆయుష్మునింపిన రాజకీయచతురుడు నెహ్రూకుటుంబంనుండి గాక బయటినుండి వచ్చి ప్రభుత్వానికి ఊపిరిలూది ప్రాణభిక్షపెట్టిన అపర చాణక్యుడు స్వతంత్ర భారత ప్రధానిపీఠాన్ని అధిష్ఠించిన ఏకైక తొలి తెలుగుబిడ్డ.తెలంగాణ పురిటిగడ్డపై పుట్టి తనకు జన్మ నిచ్చిన లక్నేపల్లి, దత్తతవెళ్ళిన వంగర గ్రామాల ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పిన తెలుగుకీర్తి మన పాములపర్తి శాంతగంభీరుడు, సుగుణధాముడు, పోరాటాల వీరుడు,ధీరుడు. బహుభాషాకోవిదుడు.కవి. అనువాదకుడు న్యాయవాది.ఆతడొక మౌని,కాలాన్ని ముందుగానే ఊహించగల క్రాంతదర్శి,భవిష్యత్తు తరాలకు మార్గదర్శి, తెలుగు వారే కాదు యావద్భారతీయులంతా తనను ముద్దుగా పీవీ అని పిలుచుకొనేవారు.అట్టి నాటి భారతప్రధాని కీ॥శే॥ పాములపర్తి వేంకట నరసింహరావు శతజయంతి సందర్భంగా వారి జీవిత విశేషాలను రాజకీయాలలో వారి పాత్రను మననం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం.అది మన కర్తవ్యం.అందుకే వారి గత జీవితంలోకి ఒకసారి తొంగిచూద్దాం.ముగిసిన వారిజీవిత పుస్తకంలోని గతకాలపు జ్ఞాపకాల పుటలను ఒక్కొక్కటిగా తిరగేద్దాం మరొక్కసారి తెలుగువారిగా మనమంతా గర్విద్దాం.

జననం-బాల్యం-విద్యాభ్యాసం :

అది 1921 జూన్ 28.ఆకాశవీధిలో ఒక తార ఉదయించిందేమో... వరంగల్‌జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో రుక్నాబాయి సీతారామారావు దంపతులింట క్యార్‌క్యార్‌మంటూ ఒక చంటిపిల్లవాని ఏడ్పు, వారి ఇంట ఎనలేని ఆనందాన్ని నింపింది. అయితే కారణాలేమైనా

అనతికాలంలోనే కరీంనగర్‌జిల్లా వంగర గ్రామవాసులైన పాములపర్తి రంగారావు,రుక్మిణమ్మ దంపతులకు దత్తునిగా ఇవ్వబడ్డాడు. కుటుంబ నేపథ్యం జమిందారీకుటుంబమైనా పీవీగారి మనస్తత్వం దానికి విరుద్ధం బూర్జువాతత్వం ఏమాత్రం దరిజేరని పేదల పక్షపాతి.సహాయంచేసే గుణమేకాని స్వార్థం అణుమాత్రంలేని నిస్వార్థజీవి, దయార్ద్ర హృదయుడు.పేదల బాధలను జూచి చలించిపోయేవాడు. బాల్యమంతా భోగభాగ్యాలతో గడచినా సామాన్యులతోనే స్నేహంచేసేవాడు. ఇతరుల కష్టాలను చూచి బాధపడేవాడు. తనుపెద్దవాడైతే వీరి కష్టాలకు పరిష్కారమార్గం చూపించాలనే ఎప్పుడూ ఆలోచించేవాడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నకాలంలోనే నిజాం పరిపాలనను వ్యతిరేకిస్తూ మాట్లాడే వాడు.నిజాం నిరంకుశత్వాన్ని నిరసిస్తూ కవితలు వ్రాసేవాడు.ఉపన్యసించేవాడు.అదే సమయంలో కాంగ్రెసువారిచే నిర్వహించబడుచుండిన స్వాతంత్ర్యపోరాటంలో పలంత్రీగా పాల్గొనేవాడు. తదుపరికాలంలో 17 సంవత్సరాల ఎల ప్రాయంలోనే కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెస్ యువజనసంఘ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించాడు.ఈయన కాంగ్రెస్‌వాది అనేకంటే గాంధేయవాది అంటేనే సముచితంగాఉంటుంది.గాంధీవిధానాలపట్ల మన పీవీకి అత్యంతప్రీతి.స్వామిరామానందతీర్థ ప్రవచనాలకు పరవశించి భక్తిమార్గంలోఅడుగుపెట్టిన పీవీ అంతే మక్కువతో గాంధేయమార్గాన్ని అభిమానించి కాంగ్రెస్‌కు దగ్గరయ్యాడు. స్వామిరామానందతీర్థ ప్రవచనాలు ,గాంధీ ప్రభోధాలు రెండింటిలోను మానవతత్వం,ధర్మం, అహింస మార్గాలు ఒక్కటిగా ఉండడమే అందుకు కారణం.భారతదేశ ఆర్షధర్మంపట్ల ఆయనకుఎనలేని గౌరవం. మనిషిని మనీషిగా తీర్చిదిద్దగలిగే శక్తిని కేవలం ఆర్షధర్మాన్ని అనుసరించడంవల్లనే ప్రోదిచేసుకొనవచ్చునని చివరివరకు నమ్మిన మహనీయుడు పీవీ. భక్తిఉంది మూఢభక్తిలేదు ఆస్తికుడే కానీ అనాగరిక ఆస్తికుడుమాత్రంకాదు. నాస్తికులపట్ల ద్వేషమూలేదు. ఆయనభోగులలోనే ఒకయోగి వందేమాతర గీతాన్ని వందేమాతర నినాదాన్ని భగవన్నామస్మరణకంటే భక్తిభావంతో యావద్భారతమంతా స్పందిస్తున్న రోజులవి.కానీ వందేమాతరం మాటే నిజాం సర్కారుకు ఆంగ్లేయులకు ఫిరంగిమోతలా విన్పించేది అటువంటి భయానకమైన సందర్భంలో కళాశాలలో వందేమాతరగీతం ఆలపించడం.పీవీ గుండెధైర్యానికీ.దేశభక్తికీ పరాకాష్ఠగా చెప్పవచ్చు ఈ గీతాలాపనవల్ల తదుపరి జరిగే పరిణామాలను వచ్చే ఉపద్రవాలను లెక్కచేయని మొండిధైర్యం, ధైర్యాన్నిమించిన దేశభక్తి ఆనాడే పీవీలో మొగ్గతొడిగింది.ఈ విషయం తెలిసిన కళాశాల యాజ మాన్యం పీవీని తరగతులనుండి బహిష్కరించారు.బహిష్కరించబడిన పీవీ నాగపూర్‌చేరి1940 నుండి 44 వరకు తన స్నేహితుని ఇంటనే ఉండి న్యాయవాద విద్య నభ్యసించి తిరిగి హైదరాబాద్ చేరుకున్నాడు. ఒకరికి కీడు తలపెట్టాలని చూస్తే కీడుకు బదులుగా అది మేలై జీవితాన్ని ఒక మలుపుత్రిప్పుతుంది అనడానికి ఇది ఒక మంచి ఉదాహరణ.పీవీ వంటి మంచి మనిషికి ఇదే శుభపరిణామంగా మారింది. గౌరవాన్ని ఆపాదించిపెట్టింది. న్యాయవాద వృత్తివిద్య నభ్యసించి వచ్చిన పీవీ బహుభాషా కోవిదుడైన బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్‌లాయర్‌గా చేరి ప్రాక్టీస్‌చేశాడు.ఆ కాలంలోఎందరికో ఉచితంగానే కేసులను వాదించే వాడంటే అతని హృదయంఎంత సున్నితమైనదో మనం అర్థంచేసుకోవచ్చు.బూర్గులవారివద్ద ఎందరో జూనియర్లుండగా అనతికాలంలోనే పీవీయే బూర్గులవారికి అత్యంత ప్రీతిపాత్రమైనాడు. ఆయనలోని సమయ పాలన,కార్యదక్షత చేసే పనిలో నిబద్ధత అటువంటిది, పీవీఅంటే క్రమశిక్షణ, పీవీఅంటేనే విజ్ఞానఖని అనేటంతగా గుర్తింపును పొందాడు.రాజకీయప్రవేశం చేయకముందే ఆయన ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాడు.

రాజకీయరంగ ప్రవేశం :

తనకు అన్యాయంజరిగితే స్పందించేవారు కొందరైతే తనవారికి అన్యాయంజరిగితే స్పందించేవారు మరికొందరు.తనవారు కాకపోయినా తనతోటివారికి అన్యాయం జరిగినా సాటిమనిషిగా స్పందించడమేకాదు ఎదురుతిరిగి పోరాటానికైనా సిద్ధపడేవారు మరికొందరు .అటువంటివారికోవకు చెందినవారే పాములపర్తి వేంకటనర సింహారావు. నిజాం నిరంకుశత్వాన్ని ,సామాన్యులపై జరుపుతున్న దౌర్జన్య దమనకాండను చూచి సహించలేకపోయేవాడు. యువకునిగా ఉన్నప్పుడే నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించేవాడు.

జర్నలిస్టుగా కొంతకాలం కాకతీయపత్రికను నడిపి నిజాంకు వ్యతిరేకంగా వ్యాసాలు కవితలు వ్రాసేవాడు స్వామిరామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమంలోను హైదరాబాద్ విముక్తిపోరాటంలోనూ పాల్గొన్నాడు. ఇక్కడ మనమొక విషయాన్ని పరిశీలించవలసిన అవసరంఉంది బూర్గులవారు న్యాయవాది. వారిదగ్గర పీవీ జూనియర్‌న్యాయవాది. బూర్గులవారు 18 భాషలలో మాట్లాడగల నైపుణ్యంగల బహుభాషాకోవిదుడు.అలాగే పీవీకూడా బహుభాషా కోవిదుడు.తదుపరికాలంలో బూర్గులవారు హైదరాబాద్‌స్టేట్ కు ముఖ్యమంత్రి. అలాగే పీవీకూడా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రి.బూర్గులవారు కాంగ్రెస్‌వాది,పీవీ కాంగ్రెస్‌వాది. మరోవిషయమేమంటే పీవీ కేంద్రంలో ఆర్థికమంత్రి ఆర్థిక సంస్కరణలకాద్యుడు ఐనాడు. తదుపరి తానే ప్రధానమంత్రిగా ఐనాడు. పిదప తన మంత్రిమండలిలో ఆర్థికశాస్త్రనిపుణుడైన మన్మోహన్ సింగ్‌ను రిజర్వుబ్యాంక్‌నుండి తీసుకువచ్చి ఆర్థికమంత్రిగా నియమించుకుంటే పీవీ ఆర్థిక విధానాలకు ఆలోచనలకు అనుగుణంగా భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఒడ్డుకుచేర్చడమేగాక యావత్ప్రపంచమే ఆర్థిక సంస్కరణలలో భారతదేశంవైపు చూచేలా చేసింది.ఇదే పీవీ ముందుచూపుకు నిదర్శనం. తదనంతరం మన్మోహనే ప్రధాన మంత్రియైనాడు. ఇదంతా యాదృచ్ఛికమేయైనా ఒకమేధావి మేధావితోనే స్నేహంచేస్తాడని.తనంతవాడిగా నిస్వార్థంగా తయారుచేస్తాడని బూర్గులవారిని, పీవీనీ ,మన్మోహన్‌సింగ్ ను పరిశీలిస్తే మనకు ఇట్టే అర్థమైపోతుంది.

కార్యకర్త స్థాయినుండి ప్రధానమంత్రిదాకా :

కాంగ్రెస్‌లో ఒక సామాన్య కార్యకర్తగా ప్రవేశించి యువజన నాయకునిగా ఎదిగి రాష్ట్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, విదేశాంగ రాయబారిగా ఎన్నో పదవులను అధిరోహించి అత్యున్నత స్థానమైన ప్రధాని వరకు ఎదగడానికి చేసిన ఈ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు మరెన్నో ఆటుపోట్లు. వ్యతిరేక పవనాలను తట్టుకొని ఏటికెదురీది ఎన్నో విజయాలను సొంతంచేసుకొన్న తన రాజకీయ జీవిత ప్రస్థానం చివరికి ఎలాముగిసిందో ఒకసారి పరిశీలిద్దాం.

1957 లో మొట్టమొదటిసారిగా మందని నియోజకవర్గంనుండి ఎమ్మెల్యేగా శాసన సభకు ఎన్నికైనాడు అనతికాలంలోనే ప్రజాదరణ చూరగొని సామాన్యులను ఆదుకోవడంతో వరుసగా నాలుగుసార్లు అదే నియోజక వర్గంనుండి ఓటమెరుగకుండా విజయాన్ని సాధిస్తూ వచ్చారు.1962 నుంచి న్యాయశాఖ,సమాచారశాఖ, దేవాదాయ శాఖ, వైద్యఆరోగ్యశాఖలవంటి వివిధ ప్రముఖ శాఖలకు మంత్రిగా విజయవంతంగా తన విధిని నిర్వర్తించడమేకాకుండా ఆయా పదవులకే వన్నెతెచ్చిన ఘనత మన పీవీది. దానికి ప్రధానమైన కారణం సామాన్యులైన ప్రజల మనసుల్లో మంచి స్థానాన్ని సంపాదించుకోవడం. ఇప్పటికీ రాజకీయనాయకుల్లో ఒక అపోహ ఉంది.ప్రజలు గొఱ్ఱెలని.ఎవరు దబ్బిస్తే వారికే ఓటువేస్తారని.అది కేవలం అపోహమాత్రమేనని మన పీవీ తన ప్రతి విజయాన్ని ప్రజలకు అంకితంచేస్తూ ఋజువుచేశారు.డబ్బుంటే ఎవరికి ఇష్టం ఉండదు. దగ్గరకు వచ్చి అర్థరాత్రి నిద్రలేపి లక్ష్మిని ప్రసాదంగా పంచిపెడుతుంటే ఎవరు కాదంటారు. ఎవరిచ్చినా తీసుకుంటారు కానీ ఓటు ఎవరికి వేయాలో ముందే నిర్ణయించుకొంటారు.వారికే వేస్తారు. ఇదే నిజం.మన పీవీ విషయంలో నిరంతరాయంగా అదే జరుగుతూ వచ్చింది.

హనుమకొండనుండి రెండుసార్లు, రాంటెక్‌నుండి రెండుసార్లు ,నంద్యాల ఉపఎన్నికలో మరొకసారి ఇలా కేవలం ఆంధ్ర ప్రదేశ్‌నుండి మాత్రమే కాకుండా ఒరిస్సా, మహారాష్ట్ర రాష్ట్రాలనుండి కూడా లోక్‌సభకు ఎన్నిక కావడం వారిపట్ల ప్రజలకున్న నమ్మకం,అభిమానం.ఒక తెలుగువానిగానో, ఒక తెలంగాణావాని గానో ప్రజలు అభిమానించలేదు. ఆయనొక మేధావి అని. తాడిత పీడిత ప్రజానీక కష్టాలను ఎరిగినవాడని, వారి వెతలను తీర్చేవాడని, వారి ఆకాంక్షలను నెరవేర్చేవాడని అంతకుమించి ఆయన అపరమేధావి అని నమ్మినవారు గనుగనే ప్రాంతీయ, కుల, మత, వర్గ భేదం చూపించకుండా భారతదేశంలో ఏమూలనుంచి ఎన్నికల్లో పోటీచేసినా అఖండ మెజారిటీతో గెలుపొందడం ఒక్క పీవీకే సాధ్యమయ్యింది అని చెప్పవచ్చు.

పీవీ కార్యకలాపాలను, పార్టీపట్ల అచంచలమైన విశ్వాసం, కార్యదక్షతను గమనించిన పార్టీ అధిష్ఠానం 1951 లో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యత్వాన్నిచ్చి గౌరవించింది. పనిచేసేసేవాడు ఎంత దిగువలో ఉన్నా ఎవరి సహాయం లేకుండానే ఉన్నత శిఖరాలనధిరోహించగలడు అనడానికి మన పీవీయే చక్కని ఉదాహరణ

వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని అహర్నిశలు పార్టీకోసమే శ్రమిస్తూ ప్రజలతో మమేకమౌతూ ప్రజలమెప్పును పొందుతూ మొట్టమొదటిగా 1957 లో శాశనసభకు ఎన్నికై 1977 వరకు రెండు దశాబ్దాలు శాశన సభ్యునిగా వివిధశాఖలలో మంత్రివర్యులుగా కొనసాగడం ఆయన ప్రజల హృదయాల్లో సంపాదించుకొన్న మంచితనానికి మచ్చుతునక. ప్రజలలోనూ పార్టీలోనూ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పదిల పరచుకొన్నాడు మన పీవీ రెండవసారి 1962 శాశనసభకుఎన్నికై రెండుసంవత్సరాలు అంటే 1964 వరకు న్యాయశాఖ సమాచార శాఖామాత్యులుగాను, 64 నుండి 67 వరకు మూడు సంవత్సరాలున్యాయశాఖ దేవాదాయశాఖామాత్యులుగాను 67నుండి 68 వరకు వైద్య,ఆరోగ్యశాఖ 68-71 న్యాయశాఖ సమాచారశాఖా మాత్యులుగా సేవలందించారు.

సుమారు 15 సంవత్సరాలు రాష్ట్రమంత్రిగా వివిధశాఖలను సమర్థవంతంగా నిర్వహించిన అనుభవం తోనూ పార్టీపెద్దలు,అధిష్ఠానం అందించిన సహకారంతో 1971 నుండి 73 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి నధిష్ఠించి పార్టీపెద్దల, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొంటూ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి పాలనా దక్షుడనిపించుకొన్నాడు.కాంగ్రెస్‌పార్టీ అధిష్ఠానవర్గం పీవీ కార్యదక్షతను గుర్తించి 1977లో లోక్ సభ ఎన్నికల బరిలో నిలపగా విజయకేతనం ఎగుర్చవేసి మొట్టమొదటిగా పార్లమెంటులో అడుగుపెట్టాడు. అంతేకాదు.కేంద్ర మంత్రిగా అనేక శాఖలను విజయవంతంగా నిర్వహించాడు.

1980 నుండి 84 వరకు విదేశీవ్యవహారాల శాఖను,ఒక సంవత్సరంపాటు హోంశాఖను,85లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా,రక్షణశాఖమంత్రిగా ,1985 నుండి 88 వరకు మానవ వనరుల అభివృద్ధిశాఖ.

1988-89 కాలంలో విదేశీ వ్యవహారాల శాఖలను అత్యంతసమర్థవంతంగా నిర్వహించి పార్టీలోనూ ప్రభుత్వంలోనూ ప్రజల్లోనూ మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు పీవీ. అంతేకాదు 1989 లో నాల్గవసారి లోక్‌సభకు ఎన్నికై 1991 నుండి 96 వరకు కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు. అంతేకాదు అయిదవసారి లోక్‌సభ స్థానానికి నంద్యాలనుంచి ఎన్నికై 1991 నుంచి 96 వరకు భారత ప్రధాని యైనాడు. భారతప్రధాని పీఠాన్ని అధిరోహించిన తొలి తెలుగువానిగా చరిత్రను సృష్టించి మెజారిటీలేని ప్రభుత్వాన్ని పూర్తికాలం పరిపాలించి కాంగ్రెస్‌పార్టీకి పునర్వైభవం కల్పించాడు. అయితే ప్రధానిపీఠాన్ని అధిరోహించడానికి ఆనాడు ఏర్పడిన పరిస్థితులను ఒకసారి విశ్లేషించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కారణాలేమైతేనేమి కాంగ్రెస్‌పార్టీలో ఏర్పడిన వైరుధ్యాల కారణంగా రాజకీయాలకు స్వస్తిచెప్పి ఆశ్రమం ఏర్పాటుచేసుకొని భోగాలను విడిచిపెట్టి యోగిగా మారిపోవాలనుకొని ఆ ప్రయత్నాలలో ఉండగా భారతదేశం ఒక్కసారిగా ఉలిక్కిపడేటట్లు విషాదవార్త. యువప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకు గురైనాడు. ప్రధాని స్థానంఖాళీ అయ్యింది తాత్కాలికంగానైనా ఆ స్థానంలో ఎవరోఒకరు ఉండకపోతే దేశం కష్టాలలో పడుతుంది. పార్టీ పెద్దలందరూ ఆలోచించి రాజకీయాలకు దూరంగా ఉండాలని నిశ్చయించుకొని గృహోన్ముఖుడైన పీవీ అత్యవసరంగా ఢిల్లీకిరమ్మని పిలుపు వెళ్ళక తప్పిందికాదు. ఆసమయంలో పీవీకిమించిన సమర్థుడు

లేడని భావించి ప్రధానిపదవిని కట్టబెట్టారు. అప్పటికి లోక్‌సభలో సభ్యత్వంలేనందున రాజ్యాంగంప్రకారం ఆరునెలల్లో లోక్‌సభలో సభ్యుడై ఉండాలి కాబట్టి సంద్యాల ఉప ఎన్నికలో గెలుపొంది అయిదవసారి లోక్ సభలో అర్హతను సాధించాడు. ఒకతెలుగువాడు ఈ దేశానికి తొలి ప్రధాని అర్హతను సాధించాడని చెప్పి ఆనందంగా రాజకీయాలను ప్రకృనబెట్టి తెలుగుదేశపార్టీ పోటి పెట్టలేదు. రాజకీయాను విరమించుకున్న వానికి రాజయోగం పట్టడం అంటే అది బ్రహ్మలిఖితమనే చెప్పాలి.

పీవీ ప్రవేశపెట్టిన సంస్కరణలు

రాష్ట్రమంత్రిగా వివిధ శాఖలను నిర్వహించినా, ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించినా, కేంద్రమంత్రిగా ఏశాఖను చేపట్టినా, చివరికి ప్రధానమంత్రిగా ఉన్నా ఆయన తలపెట్టిన సంస్కరణలు లేవంటే అతిశయోక్తికాదు. ప్రధానంగా ఆయన సంస్కరణాభిలాషి. గొప్ప సంస్కర్త.ముందుచూపు దూరాలోచన ఉన్న మేధావి. ప్రణాళికాబద్ధమైన జీవితం ప్రణాళికాబద్ధమైన పాలన ఆయన విజయాలకు మూలకారణాలు రాష్ట్రంలో విద్యాశాఖామాత్యులుగా చేసిన కాలంలో ఆయనప్రవేశపెట్టిన విద్యా సంస్కరణలు విద్యార్థిలోకానికి ఎంతో మేలుచేశాయి.అందులో ప్రధానమైనది గురుకుల పాఠశాలలను ప్రవేశపెట్టడమైతే కేంద్రంలో మానవవనరుల అభివృద్ధిశాఖామాత్యులుగా నవోదయ పాఠశాలలను ఏర్పాటుచేయడం ప్రశంసనీయం. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన భూసంస్కరణలు భూగరిష్ఠ పరిమితిచట్టం కలలోకూడా ఎవరూ ఊహించని గొప్ప సంస్కరణలలో ఒకటి. కేంద్రంలో ఆర్థికమంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణలు. ప్రధాని కాగానే ఆర్థికమంత్రిగా మన్మోహన్ సింగ్‌ను నియమించి ఆయనకు పూర్తిస్వేచ్ఛనిచ్చి తెచ్చిన ఆర్థిక సంస్కరణలు యావత్ ప్రపంచాన్నే భారతదేశంవైపు చూసేలా చేశాయి.అదే పీవీలో ఉన్న ముందు చూపునకు, నిశిత పరిశీలనకు, ఎదుటి వారి శక్తి సామర్థ్యాలను అంచనావేయగల నేర్పునకు తార్కాణం.అందుకే పీవీని అపరచాణక్యుడు, ఆర్థిక సంస్కరణల పితామహుడు అని ప్రతిపక్షం సహితం వేనోళ్ళ కీర్తించారు.

పీవీ సాధించిన విజయాలు - 1991 లో రాజకీయ సన్యాసం స్వీకరించాలని నిశ్చయించుకొన్న సమయంలో ప్రధానమంత్రిగా అదృష్టం తనతలుపు తడితే నంద్యాలనుండి గంగుల ప్రతాపరెడ్డిని రాజీనామాచేయించి గెలుపొందడం. చాలినంత బలంలేని కాంగ్రెస్ పార్టీకి సభలో మెజారిటీ నిరూపించుకోవడం అసలైన విజయంగా పేర్కొనవచ్చు .ఆయన ప్రధానిగా ఉన్న కాలంలో సాధించిన విజయాల పరంపర అనూహ్యమైనవి అసాధ్యమైనవి అని చెప్పవచ్చు. దానిలో అత్యంత ఆశ్చర్యకరమైన విజయాలు పంజాబ్ తీవ్రవాదాన్ని కఠినంగా అణచి వేయడం కాశ్మీర్ తీవ్రవాదుల డిమాండ్లను నెరవేర్చకుండానే బంధీలుగాఉన్న ప్రముఖులను విడిపించడం. అప్పటివరకూ ఏనాయకుడూ ఏ ప్రధానీ చేయని సాహసమది.తీవ్రవాదుల కోర్కెలు తీర్చకపోతే వారివద్దబంధీలుగాఉన్న వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లక తప్పదు. వారి ప్రాణాలు మనకు ముఖ్యం అందుచేత తీవ్రవాదుల కోరికలునెరవేర్చి మనవారిని విడిపించడమే శ్రేయస్కరమని ప్రజలంతా అదే భావంతోఉన్నారు. ప్రధాని ఈ తరుణంలో మీనమేషాలు లెక్కపెట్టడమేమిటని బంధీలుగా ఉన్నవారి బంధువులు సహితం ఆవేశంతో ఊగిపోయారు.ఆ సమయంలో యావత్‌భారత ప్రజలలో నరాలుతెగే ఉత్కంఠ. చివరికి ఎవరికీ ఏహానీ జరగకుండా సురక్షితంగా విడిపించారు అసాధ్యాన్ని సహితం సుసాధ్యం చేయగల నేర్పు పీవీలోని ప్రజ్ఞకు పరిణతికీ ఇదే నిదర్శనం.

ఇజ్రాయేల్ తో దౌత్యసంబంధాలు ఆగ్నేయాసియాలతో మైత్రీ బంధం, చైనా, ఇరాన్ వంటిదేశాలతో స్నేహ సంబంధాలను పెంచుకోవడం వంటి సాహసం, రాజనీతి, విదేశీ సంబంధాలలో పీవీ చూపిన చొరవ శ్లాఘనీయమని రాజకీయ నిపుణులు కీర్తించారు.మన భారతదేశానికి గర్వకారణమైన 1998 లో నాటిప్రధాని వాజుపేయి జరిపిన అణు పరీక్షలకు ఆద్యుడు పీవీయే.ఆ అణుబాంబు తయారీకి అనుమతినిచ్చినది పీవీ ప్రధానిగా ఉన్న తరుణంలోనే. అది పీవీ ధైర్య సాహసాలకు మచ్చుతునక. అది పీవీ ఠీవియేకాదు భారత ఠీవిని శక్తిసామర్థ్యాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఘనతకు ప్రత్యక్ష సాక్ష్యం.

పొరుగుదేశాలతో వైరంకంటే సత్సంబంధాలే సురక్షితమని ఎరిగినవాడు . అదే సమయంలో అవసరమైతే యుద్ధానికైనా భారతదేశం ఎప్పుడూ సిద్ధమేనని హెచ్చరికను జారీచేయడమే అణుబంబుతయారీకి అనుమతి నివ్వడంలోని ఆంతర్యం.మేము ఎవరితోనూ అనవసరపు యుద్ధానికి తలపడం.మామీదికి వస్తేఎదిరించి తరిమి కొట్టడానికి వెనుకడుగువేయం.ఇది మా బారతదేశ దౌత్యనీతియని చాటిచెప్పిన ఘనత అణుబాంబుతయారీకి అనుమతి నివ్వడంలోనే ప్రస్ఫుట మవుతోంది.ఇదేకదా పీవీలోని ఠీవిఅంటే.ఇలా శాసించడానికి ఎంత గుండెధైర్యముండాలి ఎంత సాహసముండాలి ఈ లక్షణం జన్మతః సంక్రమించినట్టిది.అందుకే పీవీచేపట్టిన భూసంస్కరణలు.పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం ఆర్థిక సంస్కరణలు, శాసన సభల ఎన్నికల్లో 70 శాతం వెనుకబడిన వర్గములవారికి కేటాయించడం, విద్యా విధానంలో తీసుకువచ్చిన మార్పులు, విదేశీదౌత్యసంబంధాలు అన్నీ చారిత్రాత్మకమైనవి,సాహసోపేతమైనవే కావడం విశేషం.

విమర్శలు, నిందారోపణలు- బహుశా ఎన్నడూ లేనివిధంగా ఒక తెలుగువాడు ప్రధానిపీఠాన్ని అధిష్ఠించడ మేమిటనే ఈర్ష్య అసూయా ద్వేషాలకు కారణమేమో.. ..స్వంతపార్టీనుండే పీవీ విమర్శలను ఎదుర్కోవలసి వచ్చింది.

1992 డిశంబర్ 6 వ తేదీ భారతదేశానికి అదిఒక దుర్దినం.బాబ్రీమసీదు కూల్చివేత.ఈ సంఘటనతో ప్రపంచమే ఒక్కసారిగా ఉలిక్కిపడింది.ప్రధానిగా పీవీ దీనికిపూర్తిబాధ్యత వహించాలనేది ఒకవర్గంవాదన కాగా,అసలుఈ కుట్రవెనుక ప్రధాని పాత్రే ప్రధానంగా ఉందన్నది మరొకవర్గం వాదన.ఇలా ప్రధాని పీవీపై బురదజల్లడానికి మరొక కారణం లేకపోలేదు.మనది సెక్యులర్‌స్టేట్ మతరహితంగా పాలన సాగించవలసిన ప్రధాని సాధువులతోను బాబాలతోను సాంగత్యంచేయడం, హిందూమతప్రచారకులతోనూ వారి విశ్వాసాలతోను తన వ్యక్తిత్వాన్ని సాగిస్తూ ముస్లింల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఈ కథను వెనుకనుండి పీవీయే నడిపించాడనేది ప్రధానమైన ఆరోపణ.ఈ ఆరోపణను తను మరణించేవరకు ఎదుర్కోవలసి రావడం దురదృష్టకరం, అత్యంత బాధాకరం 1994లో పీవీ ప్రభుత్వంపై ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన గండంనుండి గట్టెక్కడానికి అడ్డ దారులు తొక్కి జార్ఖండ్‌మోర్చా సభ్యులకు లంచం యిచ్చాడనేది ప్రతిపక్షం నుండి వచ్చిన ఆరోపణ.ఈ అవినీతితోనే పార్లమెంట్‌లో మెజారిటీసాధించి అయిదేళ్ళ పూర్తికాలాన్ని పూర్తిచేసుకోడానికి దోహదం చేసిందని ప్రతిపక్షాల వాదన.ఇది నిజము కాదని ఋజువైనప్పటికీ నేటికీ ఈ నింద నిందగానే మిగిలిపోయింది.

1989 లో బోఫోర్స్ అవినీతికేసులో రాజీవ్‌గాంధీతో విభేదించి పార్టీనుండి బయటకు వచ్చిన వి.పీ. సింగ్‌ను అప్రదిష్టపాలు చేసేందుకుగాను పీవీ సింగ్ కుమారుడైన అజయ్‌సింగ్‌ను కేసులో ఇరికించేందుకు సెయింట్‌కిట్స్ ద్వీపంలో ఫోర్జరీ సంతకంతో బ్యాంక్‌ఎక్కౌంట్‌ఓపెన్ చేయించాడని మరో ఆరోపణ.దీనినే సెయింట్ కిట్స్‌కేస్ అని ప్రచారం జరిగింది.

లఖూబాయి పాఠక్ అనే పచ్చళ్ళవ్యాపారి ప్రభుత్వంనుండి తనకు లైసెన్స్ నిమిత్తం పీవీకి అత్యంత సన్నిహితుడైన చంద్రస్వామికి లంచం ఇచ్చానని చేసిన మరొక ఆరోపణ ప్రభుత్వంలో తీవ్ర సంచలనాన్ని కలిగించింది.

స్టాక్‌మార్కెట్ కుంబకోణం కేసులో నిందితుడైన హర్షద్‌మెహతా ఈ కేసునుండి బయటపడేందుకుగాను సూటకేస్‌తో పీవీకి లంచం ఇచ్చానని ఆరోపించడంతో ఈ కేసు సూట్‌కేస్ కేస్‌గా ప్రసిద్ధికెక్కింది.

ఈ విధంగా పీవీ ప్రధానమంత్రిగా ఉన్నకాలంలో ఎన్ని విజయాలనుఅందుకున్నాడో అన్ని నిందా రోపణలను విమర్శలను కూడా ఎదుర్కోవలసివచ్చింది. అంతేకాదు దక్షిణభారతదేశంనుండి అందునా తెలుగావాడిగా ప్రధానిపీఠాన్ని అధిరోహించిన తొలి వ్యక్తిగా కీర్తిని సంపాదించుకున్నట్లుగానే .అనేకమైనకేసుల్లో కోర్టుకెక్కిన తొలి మాజీప్రధానిగా కూడా అంతే అపకీర్తిని మూటగట్టు కోవలసివచ్చింది. దీనికంతకూ కారణం కాంగ్రెస్‌పార్టీలోని విభేదాలు. తెలుగువాడన్న చిన్నచూపు.అంతకుమించి.ఉత్తర భారతానికి చెందిన వ్యక్తులేఎక్కువ మంది ప్రధానులు కాగా దక్షిణాదినుండి వచ్చినవాడనే ఈర్ష్య నాల్గుదిక్కులా శత్రువుల్లా చుట్టుముట్టడం,చివరి దశలో తన కలతకు కారణమయ్యింది.ఈ నిందారోపణలతోనే ఈ లోకాన్నివిడిచి వెళ్ళిపోవలసి వస్తుందేమోననే మనోవ్యథ ఆయన మనసును కలచివేస్తున్న తరుణంలో అన్నికేసులనుండి విముక్తి లభిస్తూ కడిగిన ముత్యంలా కేసులనుండి బయటపడ్డాడు. కేసులన్నీ నిరాధారాలని కోర్టు క్లీన్‌చిట్ ఇవ్వడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు అలా సంతోషాబుధిలో మునిగితేలుతున్న సమయంలోనే వారిని మృత్యువు కబళించడం బాధాకరమైనా నిరపరాధిగా మరణించడం సంతోషదాయకమే కదా !

కవిగా, సాహితీవేత్తగా

నేటి యువతతో పోటీపడి కంప్యూటర్‌ను ఉపయోగించిన గొప్ప సాహితీవేత్త పీవీ నరసింహారావు.యువకునిగా ఉన్నప్పుడే 1950 నుండి జయ అనే మారుపేరుతో కాకతీయ పత్రికలో ఎన్నో రచనలు చేశాడు.రచయితగా అనువాదకునిగాఎన్నో పురస్కారాలను అందుకున్నాడు.విశ్వనాథసత్యనారాయణ రచించిన వేయిపడగలు నవలను తెలుగునుండి సహస్రఫణ్ అనే పేరుతో హిందీలోనికి అనువదించాడు. తెలుగులో వేయిపడగలు సాహిత్య అకాడమీ పురస్కారం విశ్వనాథవారు అ

వాళ్ళు రైతులు

తొండలు తిరుగాడే
బంజరు బీడు నేలలని
పంట పొలాలుగా మార్చినవాళ్ళు
నేలకు జీవజలంతో
విత్తుకు ప్రాణం పోసే
శక్తిని ప్రసాదించిన వాళ్ళు
తమ ఆకలి దాచుకొని
ప్రపంచానికి అన్నంముద్ద అందించిన వాళ్ళు
దేశ అభివృద్ధికి కారకులైనా
నిరుపేద పౌరులుగా మిగిలిపోయిన వాళ్ళు
ఈ దేశపు వెన్నుముకలు రైతులు
నువ్వు రోడ్లపైన మేకులు విత్తుతుంటే
నేలతల్లి గుండెల్లో పచ్చని జెండాలు నాటుతున్నారు.
నువ్వు ససేమిరా అంటుంటే
మేము సాధిస్తామురా అంటున్నారు
నువ్వు పిడికిళ్ళతో బాంబులు పట్టుకుంటే
వాళ్ళు జేబుల్లో సీతాకోకలు పెట్టుకుంటున్నారు.
గ్రామాల నుండి మొదలైన వుద్యమం
రాష్ట్రాలు, దేశాలు దాటి ప్రపంచంలో
సగర్వంగా తలెత్తి నినదిస్తుంది
ప్రపంచానికి వసుధైక కుటుంబమే భావన
అందించిన దేశంమాత్రం కొంచెం బుద్ధి చూపిస్తూ
అందరి హృదయాల్లో చిన్నబోతుంది
నువ్వు ఎంతకాదన్నా దేశంలో
ముక్కాలు భాగం ఆక్రమించిన
నాగలి సైనికులు వాళ్ళు
నువ్వు వాళ్ళని యుద్ధానికి ప్రేరుపిస్తే
వాళ్ళు నాగళ్ళును దించేస్తారు
నువ్వు మాత్రం భిక్షాపాత్రతో
ప్రపంచాన్ని యాచిస్తూ తిరగాలి!

– గుర్రాల రమణయ్య
సెల్: 9963921943

చిత్రమైన రోగం

ఇదో చిత్ర విచిత్రాల గత్తర రోగం..
కంటికి కనపడని క్రిమి చేసే ఘోరం..,
అంతవరకే తెలుసు మనకు!
చేతులకంటుకుంటదని ఒకరు
గాలితోనొస్తదని ఒకరు..
ముక్కు మూసుకోవాలనొకరు
ముక్కు మూసుకుంటే..
బ్లాక్ ఫంగసొస్తదనొకరు
ఇంటికి వెంటిలేటర్లేకపోయినా,
ఒంటికి వెంటిలేటర్ మాత్రముండాలె
పల్స్ రేటు పరీక్షించుకుంట..
ప్రాణవాయువు పెట్టుకుంటేనే
ప్రాణాలుంటయట మరి..!
గవుర్మెంటు దావాఖాన్ల
మంచాల్లేక పాయే.,
ప్రైవేటు దావాఖానోల్లు
పైసలెన్ని ఉన్నయనిరి.!?
ప్లాస్మా థెరపీ పనిచేస్తదనిరి,
పనికిరాదని పక్కకువెట్టిరి..
రెమిడిసివీర్ రేట్లువెంచిరి,
రేపేమైతదో తెల్వదనిరి..
టీకాలకు మోకాలడ్డిరి,
మోకా మీద ఆపేశిరి..
ఒకటో డోసోల్లు..
ఓపికపట్టుమనిరి
రెండో డోసోల్లు..
రెన్నెళ్ళాగుమనిరి..!
పది నిమిషాలల్ల
పన్నోళ్లను కూసోవెట్టిన
పసరుమందును పక్కనవెట్టిరి
పరీక్షల పేరు మీద
ఆనందయ్యను ఆగంజేశిరి
వేలాది మంది ఉసురు పోసుకునిరి
తరతరాల ఆయుర్వేదాన్ని
నాటు వైద్యమని తేల్చి పారేశిరి.!
పండుగలు,జాతర్లల్ల..
గుంపులు గుంపులుగ గుమిగూడనిచ్చిరి!
ఎన్నికల్ల వేలమందితో మీటింగులువెట్టి
వందల మందిని బొందలవెట్టిరి.!
లాక్డౌన్ వెట్టుమంటె అస్సలే వెట్టమని
చెయ్యి దాటి పోయినంక
పొయ్యి మంటవెట్టినట్టు
గొళ్ళెం మరిచిపోయి తాళమేశిరి.!
ఇంతకూ.. చెప్పొచ్చేదేందంటే..?
ఎవ్వలికెవ్వలు కారు..
మనకు మనమే దేవుళ్లం,
మనల్ని మనమే కాపాడుకోవాలె!
ఇంట్లకెళ్లి బయటికెల్లొద్దు
పొద్దుగాళ్ల కొద్దిగ యోగజెయ్యాలే
యాళ్లకింత ముద్ద తినాలె
ముడుసుకొని పండుకోవాలే..
తప్పనప్పుడు బయటకువోతే
ముక్కు మూసుకోవాలె..
మూడు గజాల దూరముండాలె..
చేతులు బాగ కడుక్కోవాలె..
అన్నింటికీ మించి ధైర్నంగుండాలే..
అప్పుడు కరోనా ఏంజెయ్యది..!

– పెసరు లింగారెడ్డి
9010292500

ప్రాణవాయువు

చెట్లన్నియు నరికి..
చేస్తివి కాలుష్యము..
కాంక్రీటు వనం పెంచి..
పడితివి సంతోషము..
అబ్బబ్బో మానవా..!
ఆగకపోతివి తెలియక..!!

వద్దన్నా వినకుండ..
అడ్డంగా నరికితివి..
చూద్దామన్న లేకుండ..
భవంతులెన్నో కడితివి..
అయ్యయ్యో మానవా..!
ఆపవోయి మూర్ఖత్వము..!!

పచ్చని చెట్లతో..
కలకలలాడే వనాలు..
నిచ్చెన మెట్ల ఇండ్లతో..
నిండుకునె అడవులు..
చెట్లన్నీ నరికేసి మానవా..!
చరిత్రను మార్చితివి కదయ్యా..!!

పచ్చని చెట్లని నరికి..
తిప్పలెన్నో పడితివి..
జంతుజాలానికి..
ఎన్నో బాధలు పెడితివి..
చేయని తప్పులు చేసి..!
చేతలెత్తేసి కూసుంటివి..!!

రాను రాను లోకం..
తీరు మారుతువుండే..
కానీ పోని వాటికి..
చెట్లు బలవుతుండే..
బలి పశువును చేయకురా..!
భూమ్మీద వుండలేవురా..!!

ప్రాణం మీదచ్చెవరకు..
పాకులాడుతుంటివి..
ప్రాణవాయువు కొరకు..
పడరాని పాట్లు పడితివి..
తెలిసి తెలిసి మానవా..!
ప్రాణం వొదులుకుంటివి కదరా..!!

చెట్లు లేని లోకం.
చెడిపోవు కదరా..
తూట్లు పడి జీవితం..
తిరోగమనం చెందురా..
చెట్లు పెంచుతూ వుండరా..!
భద్రత కల్పించు కదరా..!!

చెట్లను నరుకుట మాని..
చేసుకో పుణ్యము..
బతుకు తీరు మారి..
బాగుపడు జీవితము..
పర్యావరణంకై పాటుపడు.!
ప్రగతి బాటలో నువు నడు..!!

–పసుల.శంకర్
9542181301

తప్పటంలేదు

పురిటి నెప్పుల రాత్రి
తొలివెలుగుల సంతకాన్ని పుడమి చేర్చింది
చెట్లపై పాకే కిరణాలతో
నేలమురిసిపోతోంది
గాయాలు తాత్కాలికమేనని
సర్దుకుపోతుంటుంది.

స్వప్నాలు వెలిగించిన రాత్రి
మదిలోంచి నెమ్మదిగా జారుకుంటోంది
ఏరుకుందామంటే ఒక్కటీ దొరక్క
తర్కీదులేని మనిషితలపండినా
జీవితంతో తలపడకతప్పటంలేదు.

వైరుధ్యాలతో ప్రపంచం
పాచిపట్టినవేళ
'సంభవామి యుగేయుగే' అంటూ
అంటుకట్టే ఏ శక్తీ ప్రత్యక్షమవటంలేదు
లాలస వికట్టాటహాసంలో
లాలిత్యం నివ్వెరపోకతప్పటంలేదు.

–సి.యస్.రాంబాబు
8374818961

వాస్తవాలు..

మనుషులు మధ్య న
అడ్డుగోడలు వద్దు
మతాల మధ్య న
పూల వంతెన ముద్దు.

బాధల కెరటాలకు
బాణమై నిలబడు
హక్కుల సాధనకు
బరి గీసి కలబడు.

విషపు ఆలోచనకు
సమాధి చెయ్యాలి
మంచి ఆలోచనకు
పునాది తియ్యాలి

మనువాద సంకెళ్ళు
మూల కెయ్యాలి
కులాల సంకెళ్ళు
కూల దొయ్యాలి.

ఆస్తుల గురించి
పోరాటం వద్దు
బంధాల గురించి
మరిచి పోవద్దు.

మంచి మార్గము
విజయానికి మెట్టు
మంచి నేస్తము
భవితకు తేనె పట్టు
తెలియని దగ్గర
గొప్పలు చెప్పకు
తెలిసిన దగ్గర
తిప్పలు పడకు

–తాటిపాముల రమేష్
7981566031

సహజీవనం

బాలల నీతి కథ

ఒక ఊరిలో పెద్ద వేప చెట్టు ఉండేది. ఎల్లప్పుడూ పెద్ద ,పెద్ద కొమ్మలతో ,పచ్చని ఆకులతో చక్కగాగాలికి ఆనందంగా ఊగుతూ ఉండేది. అనేక పక్షులు ,కీటకాలు , చీమలకు ఆ చెట్టు ఆవాసం అయ్యింది. పక్షులన్ని గూడులు కట్టుకుని గ్రుడ్లు పెట్టి పొదిగి పిల్లలను చేసేవి. తేనేటీగలు తేనె పట్టు కట్టేవి. చీమలు తొర్రలు చేసుకుని జీవించేవి. పిల్లలు ఊయల కట్టుకుని ఊగేవారు. ఇలా ఆ వేప చెట్టు అందరికి ఆవాసాన్ని ,ఆనందాన్ని కల్గిస్తూ ఉండేది.

ఆ చెట్టు పైన ఉన్న జీవులన్ని కలసి సహజీవనంతో ఐకమత్యం గా ఉండసాగాయి.

ఒకరోజు ఆ వేప చెట్టుకు ఒక దుర్బుద్ధి కలిగింది. తన రెమ్మలు,కొమ్మలు ఉండటం వలనే కదా ఇవన్ని ఇంత సంతోషంగా ఉండకలుగు తున్నాయి అని ఈర్ష్య పెంచుకుంది. ఎలాగైనా వీటినన్నిటిని తరిమేయాలని పథకం వేసింది.

అటుగా గొడ్డలి పట్టుకు వెళుతున్న వీరయ్యను పిలిచి 'నీకు వంటకు కట్టెలు కావాలన్నావు కదా నా కొమ్మలన్ని నరుక్కుని పో ' అని చెప్పింది. అసలే కరువు కాలం కావడంతో వీరయ్య తన పంట పండిందని మురిసిపోతూ గొడ్డలితో కొమ్మ లన్ని నరుక్కుని వెళ్ళాడు. కొమ్మలు లేక పోవడంతో జీవులన్ని రావడం మానుకున్నాయి. దాంతో చెట్టుఆనంద పడింది. ఆ ఆనందం ఎంతో కాలం నిలవ లేదు. మోడుగా ఉన్న చెట్టును చూసి వీరయ్యకు అత్యాశ కలిగింది. చెట్టును మొత్తం కొట్టేస్తే తను కొత్తగా కడుతున్న ఇంటికి కర్రలుగా ఉపయోగ పడ తాయని గొడ్డలితో వచ్చాడు. అది చూసి చెట్టు కల వర పడింది. తనని చంపొద్దని ప్రాధేయ పడింది. అయినా వీరయ్య జాలి చూపలేదు. అటుగా వెళు తున్న తేనెటీగలు ఇన్నాళ్ళు మనకు ఆవాసాన్ని ఇచ్చిన చెట్టు అపాయంలో ఉందని గ్రహించి వెంటనే వీరయ్యపై దాడి చేసి తరిమేసాయి. జీవులన్నిటిపై తను ఈర్ష్యపడి వాటిని తరిమేయడం వలనే తనకీ దుస్థితి కల్గిందని చెట్టు ఆవేదన చెంది పశ్చాతాప పడింది. వర్షాకాలం రాగానే చెట్టుబాగా కొమ్మలు చిగురించాయి. వెంటనే చెట్టు జీవులన్నిటిని పిలిచితనతో ఉండమని కోరింది. అందరం కలసి సహ జీవనం సాగిద్దామని వేడుకుంది. జీవులన్ని సంతో షంగా యధావిదిగా గూడులు కట్టుకున్నాయి. తేనె టీగలు తేనె పట్టు ,చీమలు పుట్టలు పెట్టుకున్నాయి. అందరూ కలసి హాయిగా ఏ ఆపద లేకుండాసహజీవనం సాగించారు.

(నీతి –కలసి ఉంటే కలదు సుఖం)

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

ఓ గొప్ప దళిత కవితా సంకలనం "ఐసోలేషన్ వాడ"

కరోనాకు బలి అయిన ఉసా (ఉమా సాంబశివరావు)గారికి అంకితం చేసారు. ఈ కవితా సంకలనాన్ని దాదాపు 55 కవితలు న్నాయి. డా॥జి.వి. రత్నాకర్, డా॥ కత్తి పద్మారావు, భూతం ముత్యాలు, గిడ్డి సుబ్బారావు, డా॥తాళ్ళపల్లి యాకమ్మ, ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, డా॥ గూటం స్వామి, డా॥ బండి సత్యన్నారాయణ, కోయి కోటేశ్వరరావు, విల్సన్ రావు, పురిమెళ్ళ సునంద లాంటి ప్రముఖుల కవితలు కొత్త కవుల కవితలు న్నాయి ఈ కవితా సంకలనంలో. కత్తి పద్మారావు ముందుమాటలో అన్నట్లుగా ఇది ఒక వేదానాపూరిత నిఘంటువులా కనిపిస్తుంది.



"ఈ ఒంటరితనం నాకు కొత్తేమీ కాదే/ ఎన్నెళ్ళుగానో ఊరికి దూరంగా విసిరేయబడ్డ వాణ్ణి కదా/ ఒంటరిగా కుమిలిపోవడం/ నాకు అలవాటైపోయింది'' అంటారు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు "నాకిది కొత్తేమీ కాదే!" (పేజి. 26). కవితలో. **సమర రహస్యాలన్నీ/ ఆచారాల్లోనే ఉన్నాయని అంటూ/** ఆవు వ్యాసం రాస్తున్నాడు. **మోకాలుకు బోడి గుండుకు యతి మైద్రికుదిర్చి/ పాచి పట్టిన పద్యాలు** ఆలపిస్తున్నాడు. (పేజి. 30) అంటారు కోవిడ్-420- కవితలో కోయి కోటేశ్వరరావు.

ఈసారి గునపాన్ని- మట్టి పెళ్ళలు ఇరసడానికి కాదు- మా బతుకుల్ని మట్టిపాలు జేసినోళ్ళ-గుండెల్లో దించడానికి కూడ వాడాల్సిందే! అంటారు డా॥ గూటం స్వామి "మేం బతకాలి" (పేజి. 39) కవితలో.

ఐదు వందలకు డబ్బాలో కుక్కబడ్డ/ బాలెట్ పత్రం వాళ్ళ జీవితమని ఆకలికి ఎవరో విసిరే ఆహార పొట్లాలకు/ ఇప్పటికీ ఎదురు చూస్తున్నామని అంటారు "ఊరిదారి" లో అనే కవితలో బంగార్రాజు కంఠ.

"ఒకనాడు మంటల్లో తగుల బెట్టారు- ఇప్పుడు గుండెల మీద కుంపటి పెట్టి జీవించమం టున్నారు" అంటారు. పాలకవర్గ స్వభావం కవిత్వీకరిస్తూ డా॥ కత్తి పద్మారావు. **"ఆటవిక న్యాయం- ఇక చెల్లదంటూ/ అసలు న్యాయం జరిగేదాక- నినాదనాదాలౌదాం''** అంటారు. "నినాదం" కవితలో డా॥.జి.వి.రత్నాకర్- చక్కటి సంకలనం తెచ్చిన నేతల ప్రతాప్ అభినందనీయులు.

ప్రతులకు: నేతల పద్మాప్రతాప్
ఇ.నెం. 3-152, శ్రీరాంగనగర్, పైడిపర్సు
తణుకు- ప.గోదావరి-534 211
సెల్: 95504 36286

– తంగిరాల చక్రవర్తి
సెల్: 9393804472

పుస్తక సమీక్షలు

కమ్మనైన అమృతనం

అమృతనం ఒకరోజు స్మరించుకొనేదికాదు
జీవనదిలా నిరంతరం సాగే ప్రేమప్రవాహం
ప్రేమ ఆరంభమయ్యేది తల్లితో నే
అంతమయ్యేది తల్లితోనే
ఈ సృష్టిలో ఉదాత్తమైనది
తల్లి మనసుమాత్రమే
తల్లి పిల్లలచేయి పట్టుకొని
నడిపించేదికొంతకాలమే
ఆమె హృదయం మాత్రం కొట్టుకొనేది
తన ఆఖరి శ్వాసవరకు,
అమృతనం అతిమధురం,
వర్ణించడం ఏ భాషతరంకాదు
అమృతస్థానాన్ని భర్తిచేయటం
ఎవరితరం కాదు
దేవుడికి మారురూపం అమ్మ
ప్రపంచం దృష్టిలో తాను అమ్మ
పిల్లలకు మాత్రం ఆమెయే ప్రపంచం
తల్లిప్రేమ ఏఅడ్డంకిని అంగీకరించదు
ఎలాంటి సవాళ్ళనైన ఎదరొడ్డుతుంది
ఏ త్యాగానికైన సిద్ధపడుతుంది
తల్లిలేని ఇల్లు దేవతలేని గుడివంటిది
కొవ్వొత్తిలా తాను నిత్యం కాలుతూ
తన పిల్లల ఉజ్వల భవితకు
నిర్విరామ కృషి చేస్తుంది
నువ్వుఎంత ద్వేషించిన నిను ప్రేమించే
వారున్నరంటే అది అమ్మమాత్రమే
అమ్మ తరాల వారసత్వాన్ని
పిల్లలకు అందించే అనుసంధానకర్త
అమ్మ కని, గోరుముద్దలతో
పెద్దచేసి ఓనమాలు దిద్దించి
తన శాయశక్తులా తీర్చిదిద్దుతూ,
పిల్లల శక్తియుక్తులను కనిపెట్టి
సరిదిద్దే తొలి గురువు
అహరహం తన పిల్లల ఉన్నతికి
తన ఆరోగ్యాన్ని సైతం పణంగా
పెట్టే త్యాగమయి
ఈ అమృతనం చక్రం
సజావుగా తిరిగినంత కాలం
జగతికి ఆనందం
అది ఆగిందా అంతం

–సంధ్య సుత్రావె
9177615967

పసిపిల్లల వేదన?

అమ్మా అమ్మా ఓమాయమ్మా
మమ్ముల కన్న మా కవితమ్మా
మేంఏంనేరంచేశామని నీవమ్మా
మమ్ము ఒంటరిగా వదిలేశావమ్మా

అమ్మా అమ్మా ఓమాయమ్మా
అక్షరాల నేర్పిన మా జేజమ్మా
లక్షణంగా వెంటనే రావాలమ్మా
క్షణమాలస్యం చేయక నీవమ్మా

అమ్మా అమ్మా ఓమాయమ్మా
బతుకునిచ్చిన దేవతవమ్మా
బజారు పాలుచేయకు నీవమ్మా
బేజారై పాలుపోక ఉన్నామమ్మా!

అమ్మా అమ్మా ఓమాయమ్మా
మమ్ముల కన్నది నీవేగదమ్మా
ఎందుకు చేస్తున్నవు ఆలస్యం
ముందుకురా నీవిక అవశ్యం!

అమ్మా అమ్మా ఓమాయమ్మా
మా అన్నపూర్ణవు నీవేనమ్మా
మేం ఆకలిలేసి చస్తున్నామమ్మా
మా కడుపు చూసేది నీవేగదనమ్మా

అమ్మా అమ్మా ఓమాయమ్మా
మము కనిపెంచిన మాయమ్మా
ఒంటరిగామేం ఉండలేమమ్మా
వెంటనే నీవిక వచ్చేయాలమ్మా!

అమ్మా అమ్మా ఓమాయమ్మా
మాముద్దు ముచ్చట నీవేనమ్మా
మాకు నీవులేక పొద్దే పోదమ్మా
ఇక మాకు ఏం తోచక ఉందమ్మా

–గుర్రాల లక్ష్మారెడ్డి
9491387977.

నడుస్తున్న కూడళ్ళు

అక్కడ కూసే కోడి జాడ లేదు
అర్ధరాత్రి దాకా వీరంగం వేసినా
అయిదు గంటలకే ఆవులించి
రోడ్డున పడే ఆరోగ్య వాంఛకులు.

తొలిపొద్దు మసకలోనే
వండిన సంకటిని చంకకేసి
కాడిని భుజాన మోసి నడిచే
కపటం తెలియని అన్నదాతలు.

కాలే కడుపులు తెల్లవారిస్తే
పగటిముద్ద కోసం కళ్ళు తెరిచి
గుక్కెడు గంజి గొంతున పోసి
కూటికోసం కదిలే కూలీలు.

స్వేచ్ఛలేని బాల్యం భయపెడితే
మత్తు కళ్ళ భారాన్ని వదిలించుకుని
బండెడు గోతాన్ని వీపున మోస్తూ
శిక్షశాలకు వెళ్ళే విద్యాఖైదీలు

ఆకలి కేకలు రొదచేస్తుంటే
ఉన్న ఊరు ఊతమివ్వక పోతే
వందల కిలోమీటర్లను కొలుచుకుంటూ
సాగిపోతున్న వలసలు.

ఆరాటాలు వేరువేరుగా ఉన్నా
గమ్యపు బాటలు భిన్నమైనా
జీవితమంతా సాగేవి నడకలే
మరణం వరకు ఆగని ప్రయాణాలే

–శింగరాజు శ్రీనివాసరావు
9052048706

హాస్యమొక ఔషధం

కళేబరాల మధ్య కంటిని తుడిచే చేతుల
బహిష్కారాల నుండి దృష్టి మరల్చడానికి
ఓదార్పుల వెలివేతల నుండి
మనసు దివుటపడి ఇమ్యూనిటీ పెరిగేలా
కొత్త చికిత్సలను వెతుకాలి
వల్లకాడుల మధ్య దుఃఖ గరళాన్ని మోస్తున్న దేహాలివి
ఆక్సిజన్ సిలెండర్ మోసుకెళ్లలేకపోయినా
అరచేతి మంత్రదండంలో
హాస్యపు వీడియో ఒకటి షేర్ చేద్దాం
ఎందరిలోనో ఎండార్ఫిన్ విడుదలయ్యేలా
ఐసోలేషన్ గదుల్లో
నాలుగు కార్టూన్ల క్యాట్ వాక్ నిర్వహిద్దాం
బరువైన నేమ్ ప్లేట్ బోర్డ్ కొద్దిసేపు బోర్లించి
కోటును కొక్కానికి తగిలించి
పసితనంలోకి ఒక్క పల్టీకొట్టాలి
హోదాల మెట్లుదిగి నవ్వులజల్లులో మునగాలి
అవసరార్థపు పెదవుల సాగదీతలు
మొహమాటపు కంటి మెరుపులు
రెసెప్షన్ కౌంటర్లో యూనిఫామ్ లా అతుకున్న నవ్వులు
షాపింగ్ కాంప్లెక్స్ ల్లో కష్టమర్లకై కురిసే నవ్వులు
ఇవేవీ గెలిపించలేని కాలమిది
ఓ మాట చెణుకై తాకాలి
ఎద పువ్వై విరిసేలా అత్తరై మనసు గుబాళించేలా
తనువు ఊగేలా అంతరంగం పక్కుమనేలా
రెమిడెస్ వీర్ తో నవ్వుల ఊయల
డోలోతో అజిత్రో మైసిన్‌తో
కొన్ని హాస్యపు గుళికలు జతవ్వాలి
మోము శిల్పాలపై నవ్వు నగిశీలను చెక్కే ఉలి
ముఖఛాయకు స్మిత కాంతుల వరమొసగేదే కాదు
హాస్యమంటే గుండె నిబ్బరానికి దివ్యౌషధం కూడా
కష్టంగా శ్వాసిస్తూ అయినా నవ్వుదాం నవ్విద్దాం
నిలిచి గెలువడమొక్కటే ధ్యేయమిప్పుడు

–దా కాచాపురం దుర్గాదేవి
7893093495

ప్రబంధాన్ని తలపించే.. శతకం!

కవితా కళానిధి, బహుగ్రంథకర్త.. సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ కపిలవాయి లింగమూర్తిగారి కలం నుండి జాలువారిన "సుందరీ సందేశం" శతకం ఆద్యంతం కడు రమణీయ భావాలతో నిండిన ఓ గొప్ప కావ్యం.. డా॥కపిలవాయి లింగమూర్తిగారు ఇప్పుడు మన మధ్యలేకపోయినప్పటికీ.. ఆయన రచనలు అజరామరం.. వివిధ ప్రక్రియల్లో అనేక గ్రంథాలను ప్రకటించిన డా॥.కపిలవాయిగారు ఓ గొప్ప సాహితీకారునిగా అందరి హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్నారు.

వారు చాలా కాలం క్రిందట రాసిన 'సుందరీ సందేశం' శతకాన్ని 2014లోనే ప్రథమ ముద్రణకు నోచుకుంది. ఇది ఓ వైవిధ్యమైన శతకం. ప్రబంధాన్ని తలపించేలా డా॥ కపిలవాయిగారు ఇందలి రచనకు జీవం పోశారు. నిర్మకుటంగా వెలువరించిన ఈ కావ్యంలో.. ఓ గొప్ప సందేశాన్ని అందించడం జరిగింది. తెలుగు కావ్యాలలో స్త్రీలను కవులు అనేక విధాలుగా వర్ణించారు. వాటన్నిటినీ ఏర్చి కూర్చి ఏకచ్ఛందస్సులో ఏకత్రం చేసిన ఘనత డా॥ కపిలవాయి గారికి దక్కిందని చెప్పవచ్చు. లోగడ ఎంత మంది కవులు మహిళల సౌందర్యాన్ని విభిన్న కోణాల్లో వర్ణించినప్పటికీ.. వారి యొక్క ఆ సౌందర్యం లోకానికేం సందేశం యిచ్చిందో ఎవరూ స్పష్ట పరుచలేకపోయారు. కానీ డా॥ కపిలవాయిగారు ఈ శతకం ద్వారా ఆ దిశలో కొంత ప్రయత్నం చేయడం ప్రశంసనీయం.

ప్రదర్శన శాలలో అనేక చిత్ర విచిత్రమైన వస్తువులు దర్శనమిస్తాయి. అలాగే కొన్ని ఏకవస్తు ప్రదర్శన శాలలూ వుంటాయి. ఒకే వస్తువుకు సంబంధించి విభిన్న పార్శ్వాలను ఆవిష్కరిస్తూ.. ప్రదర్శించేవీ వుంటాయి. ఈ శతకమూ అంతే. ఏకవస్తు ప్రదర్శనశాలగా పైకి కనిపిం చినా.. అనిపించినా కవి డా॥ కపిలవా యిగారి సృజనాత్మక ప్రతిభతో.. సాహిత్యం లో మహిళా మణులను విభిన్న కోణా ల్లో తీర్చిదిద్ద వచ్చో ఇందలి తమ రచన ద్వారా అందరినీ ఆకట్టుకున్నారు.

సృష్టియే సౌందర్యమైనప్పటికీ.. ప్రకృతి సైతం రమణీయతను ఆరబోసేదైనప్పటికీ.. మహిళలను వివిధ కోణాల్లో అభివర్ణించేందుకు డా॥ కపిలవాయిగారు ఈ శతకాన్ని ప్రకటించారు. భావుకులూ.. సౌంద ర్యా రాధకులు.. ప్రకృతి ప్రేమికులు.. విస్తుపోయేలా.. కవి డా॥కపిలవా యిగారు చక్కని భావుకతతో ఇందలి పద్యాల్లో స్త్రీ సౌందర్యాన్ని చక్కని ఉపమానాలతో రమణీయంగా తీర్చిదిద్దారు.

విశేషమేమిటంటే.. కవిగారు ప్రాచీన గ్రంథాల్లోని పేర్లను పద్యాల్లో పొందుపరుస్తూ ఆయా పేర్ల మాటున దాగి వున్న విశేషాలను అందంగా, అర్థవం తంగా ఆవిష్కరించారు. స్త్రీని భిన్నమైన రీతిలో వర్ణించడానికి అలంకార శాస్త్రంలో ఉపమా సామాగ్రి కావల సినంత ఉన్నప్పటికీ.. డా॥ కపిల వాయిగారు తమదైన శైలిలో.. అభివ్యక్తియందు నవ్యతకు చోటు కల్పిస్తూ.. శిల్పం విషయంలో చతురతను.. నేర్పరిత నాన్ని ప్రదర్శించి.. ఇందలి పద్యాలకు జీవం పోశారు.

స్త్రీని ఓ భోగ వస్తువుగానో.. ఆటవస్తువుగానో చూడవద్దనే ఆలోచన పాఠకుల్లో కలిగించేందుకు కవిగారు చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు కొండంత!

మనువందనం.. పురాణ పురుష వందనంతో తీర్చిదిద్దబడ్డ పద్యాలతో ప్రారంభమయ్యే ఈ శతకంలో... గాయత్రీదేవి స్తుతి.. వాగ్దేవి వందనం.. ఛందోదేవి స్తుతి.. వేదమాత స్తుతి, సప్తరూప స్తుతి, దేవస్తుతి, భారత భారతీస్తుతి. పార్వతీస్తుతి, సర్వమంగళ తదితర స్తుతులన్నీ.. శతకానికి శోభను కూర్చాయి.

'యంతంత కన్నులు' అంటూ అలసాని పెద్దన, నానికంబ అంటూ తిమ్మనకవి, రంగారు వం దనంబు అంటూ పింగళి సూరన, దొడ్డకొప్పు అంటూ ధూర్జటి, పొంకపు గుబ్బలు అంటూ శంకరకవిరాజు, సన్నని నడుము అంటూ సంకుసాల సుకవి, బం గారు సొమ్ముల గూర్చి భట్టుమూర్తి, పిన్ననవ్వు అంటూ తెనాలి, ఇలా.. కవులందరూ తమ ప్రబంధ సుందరీమణులను పై విధంగా ఆవిష్కరిస్తూ తమ రసజ్ఞతను ప్రదర్శించిన విషయాన్ని నిర్మకుటంగా కవి డా॥ కపిలవాయిగారు చక్కగా ప్రస్తావించారు.

నవ్యాంధ్ర కవులు సైతం రమణీమణులను తమ రచనల్లో ఎలా ప్రతిఫలింపజేశారో డా॥కపిలవాయిగారు సోదాహరణంగా వివరించారు.

కృతకంబు మాన్పిన గిడుగు
కొలది బెంచిన కందుకూరి ఆత్మ
కొంబ్రాట జూపిన గురజాడ అడుగులు
పూదేననిడిన దువ్వూరి గళము..
భవ్యకళోపాసి బాపిరాజు మొగంబు
కృష్ణ పక్షపు శాస్త్రి కురుల సొగసు
అపురూపంగా పలికిన ఆరుద్ర అదరంబు
శ్రీశ్రీ సుడివిన చెలువు చెవులు.. ఇలా నవ్యాంధ్ర రమణికి ఆయా కవులు తమ కావ్యాల్లో మహిళలను అభివర్ణించిన అంశాలను ఓ పద్యంలో డా॥కపిలవాయి గారు అందంగా ఆవిష్కరించారు.

ఇంకా కవితాకుమారి స్వయంవరం.. కావ్యకన్య కాస్తుతి సాహిత్య బాంధవ్యం.. వంటి శీర్షికలతో రాసిన పద్యాలు ఈ శతకానికి నిండుదనాన్ని కూర్చాయి.

ముఖ్యంగా పురాణ పాత్రలను ప్రస్తావిస్తూ రాసిన పద్యాల్లో.. ప్రమదోత్తమ, చంద్రమతి, దమయంతి, హేమ, సీత, శాంత, ధాన్యమాలిని, శకుంతల రాధ, ప్రమద్వర, సుభద్ర, ఉలూచి, రత్నాంగి, చంద్రకళ, తారా సముద్ర మదన సంభవ, దేవవతి, మోహిని, నుకుమారి, మానవకాంతలు, నువృత్త, సమయవిలాసిని, అతివ, వధువు, ఉష, సంధ్య తదితరుల గురించి పరిచయం చేసే పద్యాలు బాగున్నాయి. పై వాటితో పాటు స్త్రీ జాతులను డా॥కపిలవాయిగారు విశ్లేషణాత్మకంగా పద్యాల్లో తమ భావాలకు చోటు కల్పించారు.

మహిళామణుల వర్ణన కోసం.. పరిశోధన చేసే పరిశోధకులకు కావలసినంత సమాచారం ఇందలి పద్యాల్లో లభించగలదు. శిల్పం విషయంలో కావలసిన మెలకువలు ఇందలి పద్యాల ద్వారా తెలుసుకోవచ్చు. భాషాప్రేమికులు.. భావుకులు..తప్పక చదివి ఆస్వాదించదగిన నిర్మకుట శతకమిది.

ప్రతులకు: కపిలవాయి సంధ్య అశోక్
17-110 వాణీసదనం
విద్యానగర్ కాలనీ
నాగర్‌కర్నూల్-509 209
సెల్: 900185437

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

కసాయి మనసుకి దర్పణం.!

రెక్కలొచ్చిన పక్షులు గూళ్ళొదులుతాయి..
విత్తనం వేసిన తోటమాలికి పళ్లందకపోవచ్చు..
అవి విచక్షణ ఉన్న మానవజాతికి చెందవు..
నవమాసాలు మోసి, కని, కళ్ళలో పెట్టుకుని చూసిన తల్లిని
తన జీ(వి)తాన్ని ఎదుగుదలకు ధారబోసిన తండ్రిని
దూరం చేసుకుంటున్నారంటే,
కసాయి మనసుకు దర్పణమేకదా!
జవసత్వాలుడిగిన దశలో వాళ్ళేంకోరుకుంటారు
నాలుగు మంచిమాటలు, అనారోగ్యానికిన్ని మందులు..
అంతేగా!
బతుకు బతికించు అని
సాటివాళ్ళ విషయంలో అనుకుంటామే
సమస్త జీవజాతిని సమాదరించేది మానవుడేనని చెబుతామే
దానికే గుండెని బండ చేసుకొని వృద్ధాశ్రమాల్లో చేర్చడమా
దేవుళ్లను సైతం కంటతడి పెట్టించే
కలియుగ తత్త్వం ఇది అని సరిపెట్టుకుందామా?!
మానవుడు మాధవుడయ్యేది
కంటి ఎదురు దైవాలకి సేవచేసినప్పుడే!..
కన్న వారిని కంటికి రెప్పలా చూసుకున్నప్పుడే..
మారని మనిషి జీవచ్ఛవం..
జన్మ వృధాచేసుకునే శలభంతో..సమానం!

–సుజాత.పి.వి.ఎల్.
7780153709.

పాత బంగారం లాంటి విలువైన కథలు

అటు రాజకీయ జీవితాన్ని, ఇటు సాహిత్య వ్యాసంగాన్ని ఏక కాలంలో రెంటినీ అతి సమర్థవం తంగా ఈదగలిగిన వ



కట్టడి చేసేద్దాం

చైనాలోన పుట్టింది
చైనాలోన పెరిగింది
ప్రపంచమంతా చుట్టింది
మాయా వేషం గట్టింది
మహమ్మారిగా మారింది
మనుషులెందరినో జంపింది
మమతలన్ని మాయని జూపింది
మనిషికి మనిషికి దూరం పెంచింది
ముక్కుకు మూతికి ముసుగులు వేసింది
ఇంటికి వీధికి ఊరికి గొళ్ళెం వేసింది
అభివృద్ధి పరుగులను ఆపేసింది
ఉపాధికి జనులను దూరం చేసింది
బడులకు పిల్లల దూరంపెట్టింది
రెక్కాడితేగాని డొక్కాడని
వారి డొక్కలో తన్నింది
మేనులోనికి దొంగలా చొరబడింది
ఊపిరితిత్తుల బిగబట్టింది
ఊపిరెందరిదో పిసికేసింది
రాజులు కవులను భేదమె లేదు
రోజు కూలీలను బాధయెలేదు
బయట తిరిగితే లోపలికొచ్చింది
లోపల లోపల మనిషిని ఆగంజేసింది
మానసిక ధైర్యం లేకుంటే
మరుభూమికి పంపింది
ఆత్మవిశ్వాసముంటే అదిరిపడి
అట్టే పారిపోయింది
ఆసుపత్రిలో చేరితే లక్షలు వదిలించించింది
మధ్య తరగతిని భిక్షుకుల జేసింది
ప్రపంచమంతా చుట్టేస్తోంది
ప్రజల ప్రాణాలు తీసేస్తోంది
కొన్నిరోజులే అనుకున్నా...
కోటి మందిని మింగేసింది
ఇంకెన్ని రోజులు ఉంటుందో
దీని అంతం ఎప్పుడు జరుగుతుందో
అప్పటిదాకా ఎందుకు
ఎప్పటికీ శుచి శుభ్రత పాటిద్దాం
రక్షణ కవచాలు వాడేద్దాం
సామాజిక దూరం పాటిద్దాం
మహమ్మారిని కట్టడి చేసేద్దాం

-రాంనరేష్ కుమార్
9492682285

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 249వ రోజు 'ఇంద్రజాలం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఇంద్రజాలం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. - సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

కనికట్టు

కళ కళ కోసమే
కళల కళ్లు జన నీరాజనం కోసమే
చతుష్షష్టి కళలు మన కోసమే.
మాటల పూదోటలో
మనసుపై శ్రద్ధా సుగంధం చల్లి
గారడాటలో గెలుపు సంతకమే
ఇంద్రజాల మహేంద్ర జాల మహత్తు.
చూస్తుంటే భళే గమ్మత్తు
మది గుమ్మం లోనే దాగే విద్వత్తు
నేర్చుకుంటే సాధనా పటిమే
పదికాలాలకూ చరిష్మా వెలుగు
పల్లెల్లో మల్లెల తీరాల ఆడబిడ్డలు
మనముందే
మాయలు చేసే సాధనాశూరులుజ
ఆదరణ కరువై
బతుకు నడకకు బరువై
వృత్తి ధర్మం కూడందించలేక
తెర మరుగౌతున్న కనికట్టు విద్యలు.
తాడు మీద సవ్వారైనా
కర్రపై విన్యాసాలు చేసినా
కోతే మనలను కట్టిపడేసినా.
గతకాల తీపి గురుతులు
ఆకలికి బువ్వపెట్టని ఆటలు
గజ కర్ణ టక్కు టమార విద్యలన్నీ
అటకెక్కినై
వేదిక నాదాలకు శృతి జేసే
ఇంద్రజాలమే చంద్రవంకలా
నిలిచేకాలమెంతో!!.
టీవీ లనుండి
ఠీవీ గా చేరదీసే
ఇంద్రజాలం ఉంటే బాగుండు.

-ఏడెల్లి రాములు,
9494800454

గాలంవేసే జాలం!

ఇంద్రజాలం
అదే జిమ్మిక్
మాయాజాలం
దిమ్మతిరిగే మాజిక్!
భ్రమలోముంచి బురిడీ కొట్టించి
మసిపూసి మారేడుకాయ!?
మంత్రం తంత్రం
అతీంద్రియ క్షుద్రశక్తులు ఒకప్పుడు
ఆత్మలతో మాటమంతీ
దెయ్యాల వదలగొట్టే మాంత్రికులు
అరేబియన్ నైట్స్
కాశీమజిలీ
అల్లాఉద్దీన్ అద్భుత కథలు
ప్రాచీన నాగరికతల
మాయాజాలం!
మునులు ఋషుల తపోభంగానికి
అప్సరసలను పంపే ఇంద్రజాలం
వారి హ్వాయలు వగలతో బోల్తా పడిన
విశ్వామిత్రు ఋష్యశృంగ!
తాటకి మారీచుల ఫలం రామాయణం!
మయసభ వేసింది
కురుక్షేత్ర యుద్ధానికి బీజం!
ఇంద్రజాల పి.సి.సర్కార్!
జాదూగార్ ఆనంద్!
కనికట్టు మాజిక్ తో
ప్రపంచాన్ని చుట్టి
భారత్ కీర్తి ఎగరేస్తే
కలయో నిజమో
వైష్ణవ మాయయో!?
నోరు తెరచి చూస్తున్న
వారి నోటి లో కరక్కాయ!
ఇంద్రుడు పాపం
తనని మించిన తాడితన్నే
వారున్నారని గప్ చిప్!?

-ఎ.రాజ్యశ్రీ,
8985035283

మాయాజాలం

బ్రతుకు మహా సాగరమై
నిలవలేక నిలిచిన
భవితలో మాయలెన్నో
జీవితంలో నిండా నిండిపోయాయి.
ఆశలతో కొత్త లోకం
చూడాలని నిలిచిన
రూపమే లేనిదై
మనసులో నిలవదు.
కనికట్టు నేర్చిన
మాయజాలం జేసిన
జీవనోపాధి కొరకే.
మన జీవితాన్ని
ఆస్వాదించేందుకు
కదలికలై నిలిచి
ఇంద్రజాలం
యుగాల తరబడి నిలిచింది.
మంత్రజాలంతో
మాయలెన్నో జేసి
జీవనమున బంధించి
ఆనందం అందించింది.
ఆటలాడి వైరు ఎక్కి
పైకి క్రిందికి దూకుతూ నిలిచి
మాయలో పడిఉన్నా
పొట్ట కూటి కొరకే కదా.

-వి.సంధ్యా రాణి,
9542299500

భ్రమ

ఎదుటిమనిషిని ఆకట్టుకునే శక్తి
బయటి వారిని భ్రమించగలిగే శక్తి
మనకళ్ళనుకూడా శాసించగలిగే శక్తి
మనల్లిమనమే మర్చిపోయేలాచేసేశక్తి
అదే కనులకట్టు భ్రమ
ఇంద్రజాల మహత్యం.
వృత్తిగా నేర్చుకునే విద్య
వంశపారంపర్యంగా సంక్రమించే విద్య
సరదాకోసం
స్నేహితుల మెప్పు కోసం
నేర్చుకునే ఆనందాతిశయమైన విద్య
వీధిలో చిన్నపిల్లలతో చేయించే సర్కస్
పిల్లలతో చేయించే కనికట్టువిన్యాసాలు
పెండ్లిళ్లకు పేరంటాలకు పెండ్లివారిని
ఆకట్టుకునేందుకుపెట్టే మ్యూజిషియన్స్
ఇవన్నీ ఇంద్రజాలాలే.
మంచిమనసుతో
మనుషులమనసును
ఆకట్టుకునే ఇంద్రజాలం
చదువురాని పిల్లలకు నేర్పరితనంతో
మైమరపించి నేర్పే ఇంద్రజాలం
తెలివితక్కువ వారికి
మాటవిననివారికి
మెళకువతో
తన దారికితెచ్చుకునే ఇంద్రజాలం
ఇవన్నీ రకరకాలైన అవసరానికి
పనికొచ్చే ఇంద్రజాలాలు.



- తాతపూడి సోమశేఖర శర్మ, 8328079336

మహేంద్రజాలం

బాల్యంలో నోటుపుస్తకం కింద
రాళ్ళు మాయం చేయడం
కుడి చేత్తో నోట్లో వేసుకొని
ఎడమచేతిలో చూపడం
అబ్బుర పరిచేవి
అసలే అర్థం కానివి
బజార్లో గారడీ ఆటలో
బుట్టలో దాచిన వ్యక్తి
జనంలోంచి రావడం
కళ్ళగంతలతో
అడిగిన దానికి జవాబివ్వడం
శక్తులున్నాయనో
మాయగాళ్ళేమోనని ఒకటే భయం
నిప్పుల్లో నడవడం
రెండు ముక్కలుగా కోసినట్టు చూపి
ఒకే తాడు చేయడ
కళ్ళగంతలతో సైకిల్ తొక్కడం
పసి పిల్లాడి నాలుక కోసి అతికించడం
వాటిని చూడకుండా ఉండలేక
చూసి భయపడ్డ వింతలు ఎన్నో ఎన్నెన్నో...
పెరిగి పెద్దయ్యాక కిటుకేంటో బోధపడి
బ్రతికే దారి చూపి
నన్నో ప్రజానాయకున్ని చేసింది
అప్పుడెప్పుడో
బాల్యంలోచూసిన వాటిని
కొంచెం మార్చి మాయ చేస్తూనే ఉన్నాను
నావెంట జనాన్ని తిప్పుకుంటున్నాను
అవన్నీ ఇంద్రజాల మాయాజాలాలైతే
నేను ప్రయోగించేవి
మహేంద్రజాలాలు..
కన్నుమూసి తెరిచేంతలో కాలనీలు
కాలు కదలీ కదలిక ముందే
కంకరపై తారు రోడ్లు
చడీచప్పుడు కాకముందే సబ్సిడీలు
ఉచితానుచితాలు లేకుండా
అడిగీ అడగనివన్నీ ఉచితాలేనని
ఈలోకాన్ని నమ్మిస్తున్నాను
నా మాయాలోకంలో తిప్పేస్తున్నాను
ఇంకా కొత్తకొత్త ట్రిక్కులు చూపుతూ
మాయలోనే ఉంచుతున్నాను
మాయల మరాఠికిసైతం
పాఠాలు చెప్పే స్థాయికొచ్చాను
సాగినంతకాలం మాయా మాటలతో
దొరికినంత పోగుచేసుకుంటాను
ప్రజానీకానికి తగినట్టు
గారడీ చేస్తూనే ఉంటాను
నిజమైన నాయకుడిగా కీర్తించబడతాను.

- గుర్రాల వేంకటేశ్వర్లు,
9490918014

జీవన పోరాటం

ఇది ఒక కళ
వున్నది లేనట్లు
లేనిది ఉన్నట్లు చూపించే
కనికట్టు విద్య
జీవన పోరాటంలో
పొట్టకూటి కోసం
ఈ టక్కు టమార విద్యలు
ఇంద్ర జాల
మహేంద్ర జాల
విద్యల ద్వారా మనుషుల
కన్నులకు కనికట్టు కడుతూ
భ్రమలో ముంచేస్తారు...
బతుకు బండి సవ్యంగా
సాగి పోవాలంటే
యిలాంటి విద్యలతో
ఎంతో మంది జీవిస్తూ వుంటారు
మాయలు చేస్తూ
జనాన్ని ఏమార్చుతారు
అనూహ్య రీతిలో జరిగే
వింత కేళి ఇంద్రజాలం.

-కె. శైలజా శ్రీనివాస్,
8019736254

ఇంద్రజాలం .. అద్భుత ప్రపంచం !

వేగవంత అడుగులతో
చిత్ర విచిత్ర చేష్టలతో
వేదికంతా కలియ తిరుగుతూ
మధ్య మధ్య మంత్ర దండం ఝుళిపిస్తూ
ఇంద్రజాలకుడు చేసే అట్టహాసం
చిన్న పెద్దలకు ఉత్సాహం !
అబ్రక దబ్ర మూల మంత్రంతో
ఉన్నది లేనట్టు
లేనిది వున్నట్టు
చేయడమే కదా కనికట్టు
టోపీ కింద దాగిడి కూపీ లెన్నో
కోటు జేబులో నక్కిన ట్రిక్కులు ఇంకెన్నో
మాటల చమత్కారాలు మరెన్నో !
అగ్గి రాజుకుంటే పక్షి ప్రత్యక్షం
పేక ముక్కల వింత గణితం
చెవి లాగితే నోట జారే నాణెం
కడుపులో కత్తి దూసినా కారని రక్తం
క్షణం క్షణం ఉత్కంఠ భరితం
ఇంద్రజాలం - ఓ అద్భుత ప్రపంచం !

-రామకృష్ణ చంద్రమౌళి,
9666656687

మాయలొద్దు మంత్రాలొద్దు

నిన్న...
నిశిరాత్రిలో నిద్రలేచి
నల్లని ఆకాశంలోని
నక్షత్రాలన్నీ రాశిపోసిన నేను
రేపటి...
సూర్యోదయాన్ని ఆపలేనా ?
అన్నాడట ఓ ఇంద్రజాలికుడు
నిన్న...
నీళ్ల మీద నడిచిన నేను
రేపు...
సముద్రంలోని నీళ్లన్నీ త్రాగలేనా?
అన్నాడట మరో ఇంద్రజాలికుడు.
నిన్న...
నిప్పులమీద నడిచిన నేను
రేపు...
భగభగమండే సూర్యుని
గుటుక్కున మింగలేనా?
అన్నాడట ఓ ఇంద్రజాలికుడు.
నిన్న...
ఆకాశానికి నిచ్చెన వేసి ఎక్కిన నేను
రేపు...
సూర్యచంద్ర నక్షత్రాలపై
స్వారీ చేయలేనా?
అన్నాడట మరో ఇంద్రజాలికుడు?
నిన్న...
ఏనుగునెక్కి ఊరేగిన నేను
రేపు...
అడవుల్లోని సింహాలతో
పులులతో ఆడుకోలేనా?
అన్నాడట ఓ ఇంద్రజాలికుడు.
అసలు నిన్న ఏం జరిగిందో
రేపేమి జరుగుతుందో
ఏ వింతవైరస్ వస్తుందో
విశ్వం విస్తుపోయే ఏ విపత్తు తెస్తుందో
ఎవరికెరుక ?
ఆ పరమాత్మకు తప్ప
అందుకే ఇప్పుడు మనకు కావలసింది
మాయలు మంత్రాలు కాదు
కాసింత మంచితనం
కూసింత మానవత్వం
-అంతే.

- పోలయ్య కవి
కూకట్లపల్లి,
9110784502

వినోదం -విజ్ఞానం

ఇంద్రజాలమంటేనే
లేనిది ఉన్నట్లుగా
ఉన్నది లేనట్లుగా
భ్రమింపజేయడం
బజార్లలో బ్రతకలేనోడు చేస్తే గారడి
పెద్ద పబ్లిసిటీతో
పెద్ద ఫంక్షన్ హాళ్లలో
భారీ ప్రచారంతో
ప్రసిద్ధుల సమక్షంలో
ప్రదర్శించే అవే విద్యలు ఇంద్రజాలాలు
పూర్వకాలం నుండి
ఈ ప్రదర్శనల ప్రస్థానం
రాజుల కాలంనుండి
తరగని ఆదరణ ..
"ది గ్రేట్ ఇండియన్ రోప్ ట్రిక్.."
అద్వితీయ ఇంద్రజాల ప్రదర్శన
గాలిలోకి విసిరిన తాడు
అలా ఆకాశంలోకి నిటారుగా నిల్చి
నేల నుండి ఒకరు ఆ తాడును
పట్టుకొని వెళ్లేలా
ఎలా సాధ్యం అని ఆశ్చర్యం!
పెట్టెలో ఉన్న వ్యక్తిని
రంపంతో కోయడం
తిరిగి ఆ వ్యక్తి సజీవనీ !
కాటిపాపలు
బైరాగులు
చేసే చిట్కాలూ
ఇంద్ర జాలం
సంథింగ్ స్పెషల్!.

- ఎం.వి.ఉమాదేవి,
7842368534

సోపతి

నేలకు నింగికి
గాలిసోపతి,
చెట్టుకు చెంబుకు
నీళ్ళసోపతి,
కడుపునకు అన్నంకు
ఆకలిసోపతి,
విత్తనంకు మొలకకు
చినుకుసోపతి,
కాళ్ళకు గమ్యానికి
నడకసోపతి,
కన్నుకు లోకానికి
చూపుసోపతి,
గుండెకు దేహానికి ఊపిరిసోపతి..!
సోపతి లేని చోటులేదు
సోపతి కాని బంధం ఉండదు!
ఆపతి సోపతి ఈ రెండింటిని
వ్యాకరణం లో సంధిచేయలేం కావచ్చు కానీ
ఆపతి సంపతి కలిస్తేనే సోపతి !
నీది గుడిసెనో పెంకులో
డాబానో విల్లానో కానీ
నీ ఇంటి మీద నాల్గుసోపతుల జండాలు
ఎగురుతున్నాయంటేనే
నీ కుటుంబం
చల్లగాసేదతీరుతున్నదని అర్థం
నీ ఊపిరికి భద్రత ఉన్నదని అర్థం!

- డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

పుస్తక సమీక్ష

హాస్యం లాస్యం చేసే 'తింగరోడు'



నవ రసాల్లో హాస్యం ఒకటి. అయినా ఎందుకో తెలుగు కవిత్వంలో హాస్యం తక్కువే. ఎవరి కవిత్వంలోనో ఎక్కడో ఒక చోట హాస్యం మెరుపులా మెరుస్తది. కాని కావ్యమంతా హాస్యం ఉండడం చాల అరుదు. ఉదయశ్రీ ప్రభాకర్ కవితా సంకలనం 'తింగరోడు' లో - నిండా హాస్యం ఉంది. ఈమె కవిత్వంలో సిత్రాలు, ఇసిత్రాలు చానా ఉంటయ్. మచ్చుకు కొన్ని చూద్దాం.

ఒక రోడ్డుంటది. ఆ రోడ్డు మీద ఒకడు పడితే తలకు దెబ్బ తాకి పిచ్చి లేసింది. మల్ల గాడనే పడ్డడట. పిచ్చి పోయింది. పెళ్లి కూడ కుదిరింది. ఆ రోడ్డు మీద కార్లో షికారైతే ఉయ్యాల ఊగుతూ పోవచ్చు. నడుం నొప్పి లేనోళ్లకు జరంత వస్తది. ఉన్నోళ్లకు మాత్రం పురాంగ పోతది.

అచ్చమ్మ పెళ్లిలో బుచ్చమ్మ భోజనం ఎట్లుందంటే, తోపులాటలో చీర తీరు మారి-జుట్టు రూపు మారి బలప్రయోగంతో బిర్యానీ తెచ్చుకుంటే దుర్భిణి వేసి వెతికినా ముక్క కానరాదు.

'షాపింగ్ మాల్స్' ఎట్లుంటయ్? అవసరం ఉన్నయి కొనిపిస్తయ్. అవసరం లేనివీ కొనిపిస్తయ్. కోరికలు గుర్రాలై దౌడు తీస్తుంటే/చూపులకు చిక్కిందల్లా బాస్కెట్లో దాక్కుంటుంటే... శ్రీమతి మొహంలో మెరుపు- శ్రీవారి కాళ్లల్లో వణుకు. కాసులకు రెక్కలొస్తయ్. కార్డులేమో రాకీ రాకీ అరిగిపోతయ్.

ఉదయశ్రీ కైతలల్ల సుబ్బిగాడు, బుచ్చిగాడు ఇట్టాంటోళ్లుంటరు. సుబ్బిగాడు 'ఈ మధ్య దుంబుగా మారిండు/ ఈడు ఎగిరి దునుకుతే భూమికి గుంతలే. బుచ్చిగాడు "అద్దం చూసి ఆడు మురిసిపోవుడమే గాని ఆన్ని చూసి మురిసిపోయే పోరే లేదాయె". ఈడు పెళ్లి సూపులకని బయలెల్లితే ఆడి దోస్తులు వెంబడి పోతరు. ఈడు చూసొచ్చుడు/ చూసిన పోరీలేమో ఆళ్ల దోస్తులను చేసుకొనుడు.... గీ సారి ఎవ్వరు రాకుండా సూసుకొని, తలకు రంగేసుకుని పోయిండు. ఈన్ని ఎవరో చిరంజీవి స్టైల్‌ల నడువుమన్నరు. ముందుకు మూడు సార్లు మొగ్గితే - మూతి పగిలింది, పన్ను విరిగింది. ఇంకో తింగరి బుచ్చిగాడు అక్కతో-అద్దం 'నిన్నేమో తెల్లగ సూపిస్తది/ నేన్నీ తమ్మున్నే గదా/ మరి నన్నెందుకు నల్లంగ సూపుతాందని గోలచేస్తడు.'

ఒకడు లాక్‌డౌన్ వల్ల ఇంట్లనే ఉండి, ఆడికి ఆడే మాట్లాడుతుండు. మతిపోయిందేమో బిత్తిరేషం కట్టి ఓటికోటి మాట్లాడుతుండు. అందరి వరుసల్ని మార్చి పిలుస్తుండు. ఇంకొకడికి అసలే సరిగా కనబడదు. ఆడింకా చలువ కళ్లజోడు పెట్టుకున్నడు. ఆడికి ఎదురొచ్చినోళ్లే గాయాలపాలౌతున్నరు.

కవయిత్రి పెళ్లిసూపుల నెలా వర్ణించిందో సూడుండ్రి.

ఒక పిలగాడు 'పెళ్లి సూపులనగానే ఎగేసుకొచ్చిండు. మ్యాచింగ్ సూటేసి / ఎర్రపూల టైగట్టి / నెత్తిమీదున్న నాలుగెంటుకలకు నూనెబెట్టి... రెండించుల మందం పౌడరేసి'. 'ఇగ పిల్లేమో మిరపరంగు చీరకట్టి/ ఆకుపచ్చ జాకిటేసి... కండ్లు కానరానంత కాటుకెట్టి తయారైంది.' చాయ్ తెస్తూ తలెత్తి పిలగాన్ని సూసింది. మురిసిపోయిందో దడుసుకుందో... అడుగులు ఆగమాగమై తూలిపడ్డది.

ఉదయశ్రీ కైతలల్ల అత్తకోడళ్లు, బావా మరదళ్లు, యారాలు, ఆడిబిడ్డ, ఆలుమగలు - ఇట్లా ఎందరో- చిత్రంగుంటరు. అత్త ఎట్లుంటదో సూద్దామా! కోడలు ఒక్క ముద్ద ఎక్కువ తింటె సాలు/ ఏంది పిల్లానీకు నాతోనే పోటా అంటూ చురకలేస్తది/ఎవ్వల్లన సన్నబడ్డపంటె సాలు / నువ్వు దినక నన్ను బదనాం చేస్తుంటివంటది. ఊరికి బయలెల్లితే 'గీ చీర కట్టినవు మంచి చీర లేదా అంటది. మంచి చీర కట్టుకుంటే/ నీముందు పనిమనిషి లెక్కకనబడుతున్ననంటది... మాట్లాడితే వదరుబోతంటది. మాట్లాడకపోతే ముంగిదని మొత్తుతది.... కూసుంటే సోమరంటది. నిద్ర పోతే దొరసానని దెప్పుతది. ఆడబిడ్డవత్తనంటె ఎవరన్న వద్దంటరా? సుట్టమేనాయె. కాని ఆళ్ల పిల్లలు ఇల్లు పీకి పందిరేస్తరు. అందుకని ఆళ్లు బంధువులా రాబందులా అనిపిస్తది. ఇక యారాలు వయ్యారాలు చూద్దాం. పనికి ముందుండాలంటూ పనులన్నీ అక్కనెత్తిమీద పెడుతది. భోజనానికి బంతిలో కూసుంటే మా అక్కకు అరగదు, నాకు వేయమంటూ తన ఇస్తర్లో వడ్డించుకుంటది. 'మాటలతో మాతికి శిబ్బులు కట్టి/కడుపు నిండా భోంచేయమంటుంది. చిన్నదేకాని చిత్రాంగి!

ఈ కవిత్వంల మరదళ్ళ చిలిపి చేష్టలు మస్తుగుంటయ్. కొత్తల్లుడు సంక్రాంతికి అత్తగారింటి కచ్చిండు. ఇక మరదళ్లు ఊరుకుంటరా! కుంకుడు పులుసుతో తానాలు చేయిస్తరు. అల్లుడు కోతిగంతులేస్తూ బొబ్బలు పెడుతడు. మరదళ్లు వేడినీళ్ళు దాచి చన్నీళ్ల ముంచుతరు. పంచె కట్టుకొమ్మంటరు. 'జారుతున్న గోచిని పదేపదే దోపుతుంటే/ తలుపు చాటున పంచదార చిలుకల కిలకిలలు'/ ప్రేమతో పలహారాల రాసులు కడుపులో కుక్కుతారు. ఆ తరువాత గడబిడల యుద్ధం-చెంబుయాత్రలు.

ఉదయశ్రీ కవిత్వంల ఆలుమగల సరసాలు, విరసాలు, అగచాట్లు, సర్దుబాట్లు అన్నీ ఉంటయ్.

ఒకడు కారులో పెళ్ళాంతో షికారు కెత్తుండు. కారులోని ఏసీ మనసుకు హాయినిస్తుంటే/ అందాలతో ప్రకృతి మురిపిస్తుంటే/ సిగ్నలొలికే శ్రీమతి చిలుకపలుకుల మధురిమల్లో తేలిపోతుంటే.... 'ఢాం' అనే శబ్దం కర్ణకఠోరంగా వినిపిస్తుంది. తేరుకొని చూస్తే టైరు పంక్చరయ్యింది.

ఒక 'పెంకి పెళ్ళాం'ను చూద్దాం. మొగడు సినిమాకెళ్దాం పిల్లా అంటే చింపులేషమేస్తది. మంచి చీర లేదా అంటే ఏనాడన్న తెచ్చిన మొఖమా అంటూ ఎద్దేవా చేస్తది. గొడ్డు కారమేసి కూడెట్టుతది. కూరలేదా అంటే గరిటతో గిన్నెలను చిర్రగోనాడుతది. పండక్కి మా ఊరెళ్దామంటే 'నొప్పి' అంటూ మంచమెక్కి మూల్గుతది. ఆళ్ల అమ్మా నాయన వస్తే సాలు లేడిపిల్లోలె గంతులేస్తది.

ఒకామె పెనిమిటిని టూరుకు తోలుకపొమ్మని అడుగుతది. 'నీ పక్కనే ఉండి మురిసిపోవాలనే కదా!/... అడుగగానే ఒప్పుకుంటావు / వేసవి చినుకులోలె కిలకిలా నవ్వి మురిపిస్తావు' అంటది.

ఇంకొకామె తన మగన్ని చూస్తూ - 'గులాబీ పువ్వోలే ఉన్నవని మురిస్తే ఇప్పుడేమో కందగడ్డ లెక్కయితివి. సోకైన జుట్టు పాయె శోభన్‌బాబు రింగుపాయె' అనుకుంటది. అయితేనేం? 'నేను నవ్వితే వెన్నెలంటడు /నే అలిగితే అమాసంటడు' అని మెచ్చుకుంటది.

ఒకింట్ల 'మావ' సంబరంగ జెల్లపిల్లలు తెచ్చి పులుసొండుమని చెప్పి పోయిండు. వండేటప్పుడు కారం వెయ్యడానికి గంటె దొరకకపోతే డబ్బాతో వంచితే దుబుక్కున వడ్డది. కూర సూత్తే ఎర్రగుంది. మావ వచ్చినంక 'ఎండాకాలం మల్లెపూవులా మురిపిస్తడో/వడగండ్లవానలా జడిపిస్తడో' అని పెళ్ళాం బయపడుతనే ఉన్నది.

ఒకామె మొగుడు చెవిటోడు. 'పిలిస్తే పలకడు/తెమ్మన్నది తప్ప అన్ని తెస్తడు/ ఒకటడిగితే ఒకటి చెప్తడు. ఏంది బావా అంటే ఇగిలిస్తడు.

'పెంకుటిల్లు కింద ప్రేమ' పసందుగుంటది. వాన గొట్టవట్టె, ఇల్లు కురవవట్టె. వాన గొట్టనప్పుడు ఎండకాలం గాలి సక్కగస్తదని, చందమామ మనల్నే తొంగి చూస్తున్నదని, చుక్కలకంటే చక్కగున్నవని మావ మురిపించిండు. ఆమె చుక్కల్లా తేలిపోయింది. మరిప్పుడు వర్షంల తడిస్తే మస్తుగున్నదని ఇగిలిస్తుండు.

ఈ కవితా సంపుటిలో ఒకచోట "మొగోళ్లు పైకి ఏమనకుండా గుంభనంగా ఉంటారే గాని, ఆ తర్వాత వేసే చిందుల్లో కోతులే నయం" అని ఆడాళ్లు అనుకుంటరు. "ఆడోళ్లు ఆటంబాంబులే-సంబురమస్తే సంకకేసుకొని ఎగురుతరు. మండిందో మాటల్తోనే కాల్చుక తింటరు" అని మగాళ్లు అనుకుంటరు.

ఉదయశ్రీకి కవితా వస్తువులకు కొదువలేదు. జలుబు గురించీ రాస్తది. ఐసుపెట్టెను (ఫ్రిజ్‌ను) నమ్ముకొని ఊరెళ్తే కరంటోళ్ల వలన కలిగిన కష్టాన్నీ చెప్తది. 'పక్కింట్లో సూర్యకాంతం' వల్ల గల్లీ అంతా హిట్లరు చేతిలో రామరాజ్యంలా ఎట్లా ఉందో తెలుపుతది. 'బట్టతల'ను కూడా ఇడిసిపెట్టలేదు. 'జుట్టు లేకుంటే ఏమి? / పెళ్ళాం చేతికి చిక్కని మొనగాడివే నీవు / స్టైల్స్ ఎన్ని మారినా / మారని స్టైల్ నీదే కదా / చేతి వేళ్ల సంగీత కచేరీ సాధన / వేదిక భాగ్యం నీదే సుమా /.... పగటి పూట వెలుగులిచ్చే చందమామే నీ సొంతం" అని బట్టతల గల వాళ్లనూ నవ్వుల బుట్టలో పడేస్తది.

ఒక్కొక్కసారి ఉదయశ్రీ కవిత్వం ఊహల ఉయ్యాల లూగుతది. 'మనిషికే తోకుంటే' అని ఊహిస్తది.'బండెట్లా తోలాలి/బీరెట్లా కట్టాలి / జడ సింగారించేసరికే బారెడు పొద్దెక్కబట్టె / ఈ తోక సింగారం ఎప్పుడు చేయనురా బాబూ / ... కైత రాసేందుకు కుర్సీల కూసోనీకి వస్తదా రాదా' అని సందేహిస్తది. 'మనకు రెక్కలొస్తే' ఎట్లుంటదో మరో కవితలో ఊహల లోకంలో విహరిస్తది.

ఉదయశ్రీ 'తింగరోడు' లో సామాజికాంశాలూ ఉన్నయ్. వాటిలో కూడ హాస్యం తొంగిచూస్తది. ఈమె కవితలకు పెట్టే పేర్లు పొడుగుగుంటయ్. అవి కూడ హాస్యాన్ని పొడుగుకుంటయ్. ఈమె కవిత్వంలో సందర్భానికి తగినట్టు సామెతలు పడుతయ్. పోరి, పోరడు పదాలు గారాలు పోతయ్. నయగారాలు చూపుతయ్. ఈమె కవిత్వం ముచ్చటపెట్టినట్టే ఉంటది. మురిపిస్తది. అందులో ఉన్న భావం మెరిపిస్తది. తెలుగు బాసకు, తెలంగాణ యాసకు ఎంత పవరున్నదో తెలుస్తది.

అందరూ నవ్వుతూ, నవ్విస్తూ జీవిస్తే లోకం ఎంత ఆనందంగా ఉంటది! హాయిగా నవ్వుకునే హాస్యంతో కూడిన మంచి కవిత్వాన్ని అందించిన ఉదయశ్రీ ప్రభాకర్‌కు అభినందనలు.ఇసొంటియి ఈ కవయిత్రి మరెన్నో కావ్యాలు రాయాలె. బాధాతప్త హృదయాలకు హాస్యపు లేపనం పూయాలె.

ప్రతులకు: ఉదయశ్రీ ప్రభాకర్
ఫ్లాట్ నెం. 203, పద్మాక్షి హైట్స్
పద్మాక్షి కాలనీ, హన్మకొండ
వరంగల్. అర్బన్-500 601
సెల్: 9866687134

-ఎ. గజేందర్‌రెడ్డి
సెల్ : 9848894086

నిత్యస్మరణీయులు

భవభూతి

-దోరవేటి
సెల్:9866251679

ధృశ్య కావ్యములను దేదీప్యముగ వెల్ల
జేసి వెల్గినట్టి శేముషీవు
చమూళ శాస్త్ర విదుడ! భవభూతి నత్కవీ!
అందజేతు నతుల వందనీయ!

'ఉత్తర రామ-చరిత,'లో
కోత్తర 'మహవీర-చరిత', ఉత్తమ ప్రణయా
యత్తము ' మాలతి మాధవ '
ముత్తమవకో నాటకమ్ము లర్పిని నేడున్.

ధరణి విదర్భలోన ఈ బిధిమండపై జనియించి సత్క్రియా
చరణుడవయ్య వ్యాకరణ శాస్త్రము, దర్శన శాస్త్రము న్నలం
కరణము, తర్క, న్యాయమును, కాలగతిన్ గణుతించు శాస్త్ర మా
భరణములయ్యె నీకిల ప్రభవ యశస్వి! నమస్కరించెదన్

ఘన 'యశోవర్మ' యాస్థాన కవివరేణ్య!
సరస సాహిత్య నాటక శాస్త్ర నిపుణ!
మంత్రి కౌటిల్యయుక్తి ప్రమ బ్రి కీర్తి!
అందుకొను భవభూతి! మా వందనములు!

అమాయకపు గుట్టన్న కథలు
(పిల్లల హాస్య కథలు)

తాళం కప్ప (కథ)

ఒకసారి గుట్టడిని పక్కింటావిడ పిలిచి నెయ్యి, బీరకాయలు ,తాళం కప్ప కొనుక్కొని రమ్మని డబ్బులు ఇచ్చింది. వాడు మార్కెట్ కు వెళ్లి బీరకాయల కొరకై ఆరా తీశాడు .వాడికి ఒక మూల వింత కాయలు కనబడ్డాయి." అవి ఏమిటి" అని వాడు ఆ అమ్మకపు స్త్రీని ప్రశ్నించాడు. ఆమె నే